


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 01 శనివారం | మార్చి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 165
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

## ఎస్సెల్బీసీ సొరంగంలో మృతదేహాలు



- మట్టి, బురదలో బాడీలు 8 మంది మృతదేహాలు
- సొరంగం తవ్వేందుకు ఉపయోగించిన టీబీఎం మిషన్‌ను
- ప్లాస్మా గ్యాస్ కట్టర్ల సాయంతో కట్ చేసిన టీమ్స్
- అత్యాధునిక గ్రౌండ్ పెనెట్రేంగ్ రాడార్‌లో ఇదే దృశ్యం
- 6 మృతదేహాలు లభ్యం..మరో రెండింటి కోసం గాలింపులు
- అర్ధరాత్రి వరకు మృతదేహాల వెలికితీత
- కార్మికులు మృతి చెందారన్న వార్తలో నిజం లేదన్న కలెక్టర్

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

శ్రీశైలం ఎడమకాలువ సొరంగంలో వారం రోజుల క్రితం చిక్కుకుపోయిన 8 మంది కార్మికుల్ని తీసుకొచ్చేందుకు వివిధ వర్గాలు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో ఇవాళ టన్నెల్ లోపల 8 మంది కార్మికుల మృతదేహాల్ని గుర్తించారు. వాటిని బయటికి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వారం రోజులుగా ఎన్డీఆర్ఎఫ్‌తో పాటు వివిధ టీమ్స్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఇవాళ ఏడో రోజు రెస్క్యూ ఆపరేషన్ లో భాగంగా రైల్వే

## మంచులో చిక్కుకున్న 57 మంది కార్మికులు

- ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్‌లో భారీగా హిమపాతం
- హిమపాతం ధాటికి విరిగిపడిన మంచు చరియలు..
- మంచులో చిక్కుకున్న బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్‌కు చెందిన 57 మంది కార్మికులు
- సహాయక చర్యలు చేపట్టిన ఉత్తరాఖండ్ సర్కార్



2

**బద్రీనాథ్-నవభూమి:** ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్‌లో జాతీయ రహదారిపై భారీ హిమపాతం సంభవించింది. హిమపాతం ధాటికి మంచు చరియలు విరిగి పడ్డాయి. దీంతో అక్కడే పనిచేస్తున్న బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్‌కు చెందిన 57 మంది కార్మికులు మంచులో చిక్కుకుపోయారు. కార్మికులు రోడ్డు పక్కన పనిచేస్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీస్ ఉత్తరాఖండ్ ఐజీ స్పందించారు. "బద్రీనాథ్ లోని బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్‌కు చెందిన క్యాంప్ వద్ద భారీ హిమపాతం సంభవించి మంచు చరియలు విరిగి పడ్డాయి. దీంతో అక్కడే పనిచేస్తున్న 57

## బ్లాక్ ఫ్రైడే

### రూ.9 లక్షల కోట్ల సంపద ఆవిరి

- ఒక్కరోజే సెన్సెక్స్ 1,414 పాయింట్లు, నిఫ్టీ 420 పాయింట్లు డౌన్
- జీడీపీ గణాంకాలపై నెలకొన్న భయాలతో పాటు సుంకాలపై ట్రంప్ తాజా వ్యాఖ్యలు
- అమెరికా ఆర్థిక వ్యవస్థలో మందగమనం
- ఈక్విటీ మార్కెట్లో అమెరికా మంటలు

2



## స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం

### 3.22 లక్షల వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీ శాసనసభలో 2025-26 వార్షిక బడ్జెట్ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. రూ.3.22 లక్షల కోట్లతో బడ్జెట్ను సభ ముందుకు తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా పూర్తిస్థాయి బడ్జెట్ను ప్రవేశపెట్టారు. బడ్జెట్లో వ్యవసాయానికి రూ.48వేల కోట్లు కేటాయించారు. రెవెన్యూ వ్యయం రూ.2,51,162 కోట్లు, మూలధన వ్యయం అంచనా రూ.40,635 కోట్లు, రెవెన్యూ లోటు రూ.33,185 కోట్లు, ద్రవ్య లోటు రూ.79,926 కోట్లుగా అంచనా వేశారు. అన్నదాత సుఖీభవ కోసం రూ.6,300 కోట్లు, ఏపీ జీవనాడి అయిన



2

పోలవరం ప్రాజెక్టు కోసం బడ్జెట్లో రూ.6,705 కోట్లు కేటాయించారు..

బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం పయ్యావుల మాట్లాడుతూ.. రాష్ట్ర రుణ సామర్థ్యం సున్నాకు చేరుకుందని.. అప్పు తీసుకొనే శక్తి లేని ఏకైక రాష్ట్రంగా ఏపీ మిగిలిందని అన్నారు. అయినప్పటికీ సీఎం చంద్రబాబు స్ఫూర్తితో

- నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖకు రూ.1,228 కోట్లు
- పాఠశాల విద్యాశాఖకు రూ.31,805 కోట్లు
- ఉన్నత విద్యకు రూ.2,506 కోట్లు
- ఎస్సీల సంక్షేమానికి రూ.20,281 కోట్లు
- ఎస్టీల సంక్షేమానికి రూ.8,159 కోట్లు
- బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు
- అల్పసంఖ్యాక వర్గాల కోసం రూ.5,434 కోట్లు
- మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం రూ.4,332 కోట్లు
- వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమానికి రూ.19. 264 కోట్లు
- పంచాయతీ రాజ్ శాఖకు రూ.18,847 కోట్లు
- పురపాలక,పట్టణాభివృద్ధిశాఖకు రూ.13,862 కోట్లు
- గృహ నిర్మాణ శాఖకు రూ.6,318 కోట్లు

## సూపర్‌సిక్స్‌లో రెండింటికి నిధులు

- మహిళలకు ఉచిత బస్సు, నెలకు రూ1500పై నిధులు నో
- తల్లికి వందనం పథకం అమలు కోసం ఈ ఏడాది రూ .9,407 కోట్లు
- రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ 20 వేలు జమ
- అన్నదాత సుఖీభవ పథకం కోసం రూ 6,300 కోట్లు

2

**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీ ప్రభుత్వం 2025-26 వార్షిక బడ్జెట్ ను 3.22 లక్షల కోట్లతో ప్రతి పాదించారు. సంక్షేమ రంగానికి ప్రాధాన్యత ఇచ్చారు. సూపర్ సిక్స్ హామీల్లో ఈ బడ్జెట్ లో రెండు అమలు దిశగా కేటాయింపులు చేసారు. రెవెన్యూ వ్యయం అంచనా రూ.2,51,162 కోట్లు, మూల ధన వ్యయం అంచనా రూ.40,635 కోట్లుగా పేర్కొన్నారు. ఇక.. రెవెన్యూ లోటు రూ.33,185 కోట్లు, ద్రవ్యలోటు రూ.79,926 కోట్లుగా అంచనా వేసారు. మహిళలకు అమలు చేయాల్సిన రెండు పథకాలపైన మాత్రం బడ్జెట్‌లో ప్రస్తావన చేయలేదు. ఏపీ బడ్జెట్‌లో సూపర్ సిక్స్ హామీల్లో రెండు అమలు దిశగా ప్రతిపాదన చేసారు. తల్లికి వందనం పథకం అమలు కోసం ఈ ఏడాది రూ .9,407 కోట్లు కేటాయించారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ 15 వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలో ఈ పథకం అమలుకు ప్రభుత్వం నిర్ణయించింది. మే లో అమలు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అదే విధంగా రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ 20 వేలు జమకు నిర్ణయించారు. కేంద్రం పీఎం కిసాన్ పథకంలో భాగంగా ఇచ్చే రూ 6 వేల ను మినహాయించి మిగిలిన 14 వేలు మూడు విడతల్లో జమ చేయనున్నారు. ఈ పథకాలు ఎప్పుడు ఈ బడ్జెట్ లో అన్నదాత సుఖీభవ పథకం కోసం రూ 6,300 కోట్లు కేటాయించారు. అయితే దాదాపుగా 55 లక్షల మంది రైతులు అర్హులుగా అంచనా వేస్తున్నారు. దీంతో, ఈ నిధుల కేటాయింపు పైన చర్చ జరుగుతోంది. ఇక..



## ఎయిర్‌పోర్టుకు పచ్చజెండా

- దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న మామునూరు(వరంగల్) ఎయిర్ పోర్టుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్
- ఇటీవల ప్రధానిని సీఎం కలిసిన తర్వాత పరిణామం
- ప్రధానిని కలిసి వచ్చిన తర్వాత కేంద్రం నుంచి అనుమతులు
- ఇప్పటికే విమానాశ్రయం భూసేకరణకు రూ.205 కోట్లు విడుదల
- విమానాశ్రయం కోసం కొత్తగా 253 ఎకరాల భూసేకరణ

2


**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్రంలోని మోడీ సర్కారు తెలంగాణకు మరో శుభవార్త అందించింది. దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న మామునూరు(వరంగల్) ఎయిర్ పోర్టుకు కేంద్ర ప్రభుత్వం తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ఢిల్లీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కలిసిన అనంతరం ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. ప్రధాని మోడీతో సమావేశమైన సీఎం రేవంత్.. మెట్రోతోపాటు తెలంగాణలో ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న పలు ప్రాజెక్టుల గురించి వివరించారు. ఈ నేపథ్యంలోనే చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మామునూరు విమానాశ్రయంకు కేంద్రం నుంచి అనుమతులు రావడం గమనార్హం. మామునూరు ఎయిర్ పోర్టుకు మోడీ సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే మామునూరు విమానాశ్రయం భూసేకరణ కోసం రూ. 205 కోట్లు విడుదల చేసింది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.

## జగన్‌తో జాగ్రత్త!

- నేతలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీ అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం.. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన టీడీఎల్పీ సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ పై చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. జగన్‌తో జాగ్రత్తగా ఉండాలని... ఆయన కుట్రల పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. అంతే కాకుండా వివేకా హత్య, కోడికత్తి ఇష్యూ గురించి కూడా చంద్రబాబు ప్రస్తావించారు. ఆనాడు మనం అప్రమత్తంగా లేక ఎన్నికల్లో నష్టపోయామని వివరించారు. అప్పటి ఇంటెలిజెన్స్ వ్యవస్థ కూడా ఆ కుట్రలను పసిగట్టలేకపోయిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అలానే ఇటీవల తాడేపల్లి ప్యాలెస్ వద్ద జరిగిన అగ్నిప్రమాదం లోనూ కుట్రకోణం ఉందని అన్నారు. తాడేపల్లి ప్యాలెస్ వద్ద జరిగిన ప్రమాదంపై సీసీ కెమెరా ఫుటేజ్ అడిగినా ఇవ్వలేదని ఆరోపించారు. ఇలాంటి పరిణామాలు జరుగుతున్న నేపథ్యంలో, టీడీపీ నేతలు ఏమరుపాటుగా ఉండొద్దని సూచించారు. ఇక టీడీపీ ఎమ్మెల్యేలకు సైతం చంద్రబాబు గట్టిగా క్లాస్ తీసుకున్నట్లు సమాచారం అందుతోంది. నేతల పనితీరు మీద ఎప్పటికప్పుడు నివేదికలు



తెప్పించుకుంటున్నానని.. పార్టీ నిర్మాణంపై నేతలు దృష్టి పెట్టాలని సూచించారు. పార్టీని వదిలేస్తే అందరం మునుగుతామంటూ గట్టిగానే చెప్పినట్లు తెలుస్తోంది. పార్టీని నిర్లక్ష్యం చేయవద్దని చంద్రబాబు హితబోధ చేశారు. కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నేతలపై ఫోకస్

## రాష్ట్రాభివృద్ధికి అడ్డు కిషన్‌రెడ్డే

- కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి 9 పేజీల బహిరంగ లేఖ..
- రాష్ట్ర ప్రాజెక్టుల విషయంలో కిషన్‌రెడ్డి పూర్తి నిర్లక్ష్యం
- హైదరాబాద్ మెట్రోపై పలుమార్లు విజ్ఞప్తి చేసినా పురోగతి లేదు
- మూసీపై ఎందుకు విషం చిమ్ముతున్నారన్న సీఎం రేవంత్
- తెలంగాణ అభ్యర్థనలను కేంద్రం పట్టించుకోవడం లేదని ఎద్దేవా

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ రాశా రు. 9 పేజీల లేఖలో ఆయన కేంద్రానికి తెలంగాణ విజ్ఞప్తులను ప్రస్తావించడమే కాకుండా కిషన్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. రాష్ట్ర ప్రాజెక్టుల విషయంలో కిషన్‌రెడ్డి పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా ఉండగానే చెన్నై, బెంగళూరు మెట్రో విస్తరణకు ఆమోదం లభించిందన్నారు. హైదరాబాద్ మెట్రోపై మాత్రం పలుమార్లు విజ్ఞప్తి చేసినా పురోగతి లేదన్నారు. సబర్మతి, గంగా పునరుజ్జీవనంపై కిషన్‌రెడ్డి పలుమార్లు ప్రకటనలు చేశారని.. మూసీపై ఎందుకు విషం చిమ్ముతున్నారని ప్రశ్నించారు. అలానే తెలంగాణ అభ్యర్థనలను కేంద్రం పట్టించుకో వడం లేదన్నారు రేవంత్ రెడ్డి.

## హాస్టల్ సిబ్బంది నిర్వాకం

### అన్నదానం వద్దకు వెళ్లి తినాలని హుకుం కొండనాగులలో ఘటన

**నాగర్‌కర్నూలు-నవభూమిబ్యూరో**

అది ఒక ఎస్టీ బాలుర వసతి గృహం. సాధారణంగా హాస్టల్స్‌లో పరిస్థితులు ఎలా ఉంటాయో అందరికీ తెలిసిందే. అయితే ఈసారి మాత్రం ఘన కార్యానికి ఒడిగట్టారు హాస్టల్ సిబ్బంది. దాదాపు 380 మంది విద్యార్థులు ఉన్న ఆ హాస్టల్‌లో శివరాత్రి సందర్భంగా 180 మంది తమ స్వగ్రామాలకు వెళ్ళగా.. 200 మంది మాత్రమే హాస్టల్‌లో ఉన్నారు. అయితే ఆ 200 మందికి అన్నం



2

వండకుండా శివరాత్రి సందర్భంగా గుడి దగ్గరకు వెళ్లి అన్నదానం వద్ద తినాలని సూచించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ దారుణ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం కొండనాగులలో చోటు చేసుకుంది. హాస్టల్‌లో ఉన్న 200 మంది విద్యార్థులకు బుధవారం నాడు ఉదయం అల్పాహారంగా అన్నం, చారు వడ్డించారు. అంతా వరకు బాగానే ఉన్న మధ్యాహ్నం, రాత్రి భోజనం కోసం దేవాలయం వద్దకు వెళ్లి అన్నదానం వద్ద తినాలని హుకుం జారీ చేశారు. హాస్టల్ కి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుడిబండ శివాలయంలో మధ్యాహ్నం నిర్వహించే అన్నదాన

## భారతదేశ ఆర్థిక వృద్ధి రేటు 6.2%

- ఆర్థిక వ్యవస్థకు బూస్ట్!
- మార్కెట్ ఒడిదుడుకుల మధ్య ఊరట
- వేగంగా పుంజుకున్న ఆర్థిక వ్యవస్థ

2




**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

గత కొద్దీ రోజులుగా స్టాక్ మార్కెట్ తీవ్ర ఒడిదుడుకులు ఎదురుకొంటున్న నేపథ్యంలో ఒక శుభవార్త అందింది. ఏంటంటే భారతదేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా పుంజుకుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం ఇవాళ జిడిపి గణాంకాలను విడుదల చేసింది. 2025 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో (డిసెంబర్ త్రైమాసికం) భారతదేశ ఆర్థిక వృద్ధి రేటు 6.2%గా ఉంది. గత త్రైమాసికంలో జిడిపి రేటు 5.6%. మంచి సంకేతాలు, పెరిగిన ప్రభుత్వ వ్యయం ఈ వృద్ధికి కారణాలు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన వినియోగం కూడా ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చింది. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ విడుదల చేసిన డేటా ప్రకారం, డిసెంబర్ త్రైమాసికంలో వృద్ధి రేటు గత త్రైమాసికం (జూలై-సెప్టెంబర్) కంటే 5.6 శాతం ఎక్కువగా ఉంది. అయితే ఆర్‌బిఐ అంచనా వేసిన 6.8 శాతం కంటే తక్కువగా ఉంది. ఏప్రిల్-జూన్ అండ్ జూలై-సెప్టెంబర్ త్రైమాసికాలలో కూడా వృద్ధి రేటు కేంద్ర బ్యాంకు అంచనాల కంటే తక్కువగా ఉంది. ఏప్రిల్ నుండి అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ 2025-26 ఆర్థిక సర్వే భారత ఆర్థిక వ్యవస్థ 6.3 శాతం నుండి 6.8 శాతం మధ్య వృద్ధి చెందుతుందని అంచనా వేసింది. ఈ సర్వేను జనవరి 31న విడుదల చేసారు. 2023-24లో భారతదేశ 8.2 శాతం వృద్ధి నమోదైంది. దీనితో భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. 2022-23లో ఆర్థిక వ్యవస్థ 7.2 శాతం, 2021-22లో 8.7 శాతం

## భారత్ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ప్రపంచ బ్యాంకు సూచనలు

- అధిక ఆదాయ దేశంగా మారాలంటే వృద్ధి రేటు 7.8 శాతంగా ఉండాలన్న ప్రపంచ బ్యాంకు
- ఆర్థిక రంగంతో పాటు భూ, కార్మిక రంగంలో సంస్కరణలు అవసరమన్న ప్రపంచ బ్యాంకు
- ప్రస్తుత కార్యక్రమాలు కొనసాగించడంతో పాటు నూతన సంస్కరణలను విస్తరించాలన్న ప్రపంచ బ్యాంకు

2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**


2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. భారత్ అధిక ఆదాయ దేశంగా మారాలంటే 7.8 శాతం వృద్ధి రేటు సాధించాలని ప్రపంచ బ్యాంకు తాజాగా విడుదల చేసిన 'ఇండియా కంట్రీ మెమోరాండం' నివేదికలో పేర్కొంది.

భారత్ వృద్ధి రేటు 7.8 శాతం చేరుకోవాలంటే దేశీయ స్థూల జాతీయ ఆదాయం ప్రస్తుతం ఉన్న దాంతో పోలిస్తే సుమారు ఎనిమిది రెట్లు పెరగాలని తెలిపింది. ఆర్థిక రంగంతో పాటు భూ, కార్మిక రంగంలో సంస్కరణలు అవసరమని అభిప్రాయపడింది. ఇందుకోసం ప్రస్తుత కార్యక్రమాలు కొనసాగించడంతో పాటు నూతన సంస్కరణలను విస్తరించాలని పేర్కొంది. భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే సగటు వృద్ధి రేటు 7.8 శాతంగా ఉండాలని పేర్కొంది. వేగవంతమైన సంస్కరణల ద్వారానే ఇది సాధ్యమవుతుందని తెలిపింది. 2000-2024 మధ్య కాలంలో భారత్ వృద్ధి రేటు సగటున 6.3 శాతంగా ఉందని వెల్లడించింది. గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్


## కండక్టర్ వద్ద చిల్లర మర్చిపోయారా?.. అయితే ఈ నంబర్‌కు కాల్‌చేయండి..



**హైదరాబాద్-నవభూమి:** ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసేటప్పుడు చాలామంది టికెట్‌కు సరిపడా చిల్లర లేకపోవడం వల్ల పెద్దనోట్లు ఇస్తుంటారు. టికెట్ ఇచ్చే డ్రైవర్‌గానీ, కండక్టర్‌గానీ మిగతా బ్యాలెన్స్ టికెట్ వెనుకాల రాసి, దిగేటప్పుడు తీసుకోవాలని సూచించారు. ఒక్కోసారి ప్రయాణికులు చిల్లర డబ్బులు తీసుకోవడం మర్చిపోతుంటారు. ప్రస్తుతం డిపోకు వెళ్తే చిల్లర డబ్బులు తీసుకునే అవకాశం ఉంది.కానీ కొద్దిపాటి చిల్లర కోసం శ్రమకోర్చి అంతదూరం ఏం వెళ్తాంలే అని చాలామంది వదిలేస్తారు. ఇకపై చిల్లర మర్చిపోయినా చింతించాల్సిన పనిలేదని ఆర్టీసీ తెలిపింది. 040-69440000 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి వివరాలు చెప్తే, రావాల్సిన చిల్లరను ఫోన్‌పే ద్వారా పంపిస్తామని వెల్లడించింది. బస్సుల్లో ఏవైనా వస్తువులు మర్చిపోతే ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని స్పష్టంచేసింది.దూర ప్రయాణం చేసేటప్పుడు మార్గమధ్యలో భోజనం కోసం ఆగినప్పుడు, కొందరు బస్ మిస్సవుతుంటారు. అలాంటి సమయంలో టికెట్‌పై ఉన్న టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే.. అదే టికెట్‌తో మరో బస్సులో ప్రయాణించే అవకాశం కల్పిస్తామని ప్రకటించింది.



## మాజీ మంత్రి హరీష్ రావుపై మరో కేసు నమోదు



**హైదరాబాద్-నవభూమి:** బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి హరీష్ రావు పై మరో కేసు నమోదు అయింది. బాచుపల్లి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. హరీష్ రావు, ఆయన అనుచరులు బెదిరిస్తున్నారని కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఏ -1 గా వంశీ కృష్ణ , ఏ -2 గా హరీష్ రావు, ఏ-3 సంతోష్ కుమార్ ఏ -4 గా పరుశురాములు పేర్లు చేర్చారు. బీఎస్ఎన్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసిన బాచుపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో అరస్టయి బెయిల్‌పై విడుదల అయిన సమయంలో వంశీకృష్ణ జైలు వద్ద మీడియాతో మాట్లాడారని దర్యాప్తు చేస్తున్న పంజాగుట్ట పోలీసులను విమర్శించడంతోపాటు.. తనపై ప్రతీకారం తీర్చుకుంటామని వంశీకృష్ణ మాట్లాడినట్లు చక్రధర్ గౌడ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే వంశీకృష్ణ చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి అభ్యంతకరమైన మాటలు లేవని తనను అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపించారని.. న్యాయపోరాటం కొనసాగిస్తానని చెప్పడంవలనే తనపై అక్రమంగా కేసులు పెట్టారని వంశీ చెబుతున్నారు. కాగా ఈ కేసుకు సంబంధించి పోలీసుల దర్యాప్తు ఎలా ఉండబోతోందో చూడాలి.గత ప్రభుత్వానికి అడ్డు తగిలిన వ్యక్తులను ఒక్కొక్కరిగా చంపేసుకుంటూ వస్తున్నారని, వాళ్లకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని ఆ పార్టీ నేత చక్రధర్ గౌడ్ అన్నారు. తనకూ ప్రాణహాని ఉందని తన అంతుచూస్తామంటూ సోషల్ మీడియా వేదికగా బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజం కోసం కొట్లాడుతున్న గొంతుకలను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. చావు ఏదో ఒకరోజు తప్పదు. కానీ సమాజం కోసం పోరాడి చావడానికి సిద్ధమేనన్నారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా వ్యక్తి స్వేచ్ఛను హరించారని కోర్టు మెట్లెక్కిన మొట్టమొదటి వ్యక్తిని తానేనన్నారు. కేసు వెనక్కి తీసుకోమని కొన్ని శక్తులు తనను వెంటాడుతున్నాయన్నారు. ఈ క్రమంలో తనకు ఏమౌతుందోనని తన కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారని ఆయన అన్నారు.కాగా మాజీ మంత్రి హరీష్‌రావు తన ఫోన్‌తో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితుల ఫోన్‌లను ట్యాప్ చేయించాడని సిద్దిపేట కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్ ఆరోపించారు. తన ఫోన్ ట్యాప్ అయిందంటూ గత ఏడాది జూన్ 19న చక్రధర్‌గౌడ్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు పట్టించుకోకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు చక్రధర్‌గౌడ్‌ను గతంలో విచారించిన పోలీసులు సరైన ఆధారాలు తీసుకు రావాలని సూచించారు.ఈ మేరకు చక్రధర్‌గౌడ్ జూబ్లీహిల్స్ ఏసీపీని కలిసి ట్యాప్ అయినట్టు అనుమానిస్తున్న సెల్‌ఫోన్‌తో పాటు యాపిల్ కంపెనీ నుంచి ఫోన్ ట్యాప్ అయిందని వచ్చిన మెయిల్ కాగితాలు, ఇతర వివరాలను విచారణ అధికారులకు అందచేశారు. హరీశ్‌రావుకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాననే కక్షతో తనపై అనేక కేసులు పెట్టి జైలుకు పంపించారని చక్రధర్‌గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రంగనాయకసాగర్ కుంభకోణాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది తానేనని ఆయన వెల్లడించారు.

## భూకంపాలను ముందుగానే గుర్తించడంపై అధ్యయనం.. జగిత్యాల యువకుడికి ఓయూ డాక్టరేట్



**హైదరాబాద్-నవభూమి:** భూకంపాలను ముందుగానే గుర్తించి, నియంత్రణా చర్యలకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసినందుకు జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన అనుమల్ల శ్రీధర్‌కు దేశంలోనే ప్రముఖ విద్యాసంస్థ అయినా ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఓయూలో జియోఫిజిక్స్‌లో పీజీ పూర్తిచేసి, ప్రొ. రామరాజ్ మాథుర్ మార్గదర్శకత్వంలో రీసెర్చ్ స్కాలర్‌గా భూకంపాల గుర్తింపునకు అధునాతన పద్ధతులు, విపత్తు నిర్వహణ సంసిద్ధత వ్యూహాలను మరింత బలోపేతం చేయడంపై శ్రీధర్ అధ్యయనం చేశారు. దేశంలోని 'దక్షిణ అండమాన్‌లోని పోర్ట్ బ్లెయిర్‌లో షాలో యాక్టివ్ ఫాల్ట్ సిగ్నేచర్‌లను గుర్తించే రిమోట్ సెన్సింగ్ జియోఫిజికల్ టెక్నిక్స్' అనే అంశంపై లోతైన పరిశోధన చేశారు. భూకంపాలు రాక ముందే గుర్తించడమే ఈ అధ్యయనం లక్ష్యం కాగా, పోర్ట్ బ్లెయిర్ భూకంపం తర్వాత అధునాతన ఫాల్ట్ డిటెక్షన్ పద్ధతుల అవసరాన్ని తన పరిశోధన ద్వారా చాటి చెప్పారు. జియోలాజికల్ సర్వే కోసం అయస్కాంత, విద్యుదయస్కాంత పరికరాలను ఉపయోగించి సరికొత్త విధానానికి రూపకల్పన చేయగా, దీనిద్వారా భూకంప అంచనా, విపత్తుల నిర్వహణకు అవసరమైన సమాచారాన్ని సేకరించే వీలు కలిగింది. తన అధ్యయనం ద్వారా ప్రభుత్వ సంస్థలు విపత్తు నిర్వహణ బృందాలను ముందుగానే అప్రమత్తం చేసే అవకాశం ఉంటుందని, అదేవిధంగా ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను సంసిద్ధత వ్యూహాలను మెరుగుపరచడానికి కచ్చితమైన సమాచారంతో సన్నద్ధం చేయడానికి తోడ్పడుతుందని శ్రీధర్ పేర్కొన్నారు. ఈ అధ్యయనం కోసం భౌగోళిక ప్రక్రియలు, ఊహించని సహజ దృగ్విషయాల యొక్క విస్తృత అవగాహనను పెంచేందుకు భౌగోళిక భౌతిక శాస్త్రంలో భవిష్యత్ పురోగతికి మార్గం సుగమం చేస్తుందన్నారు.

జియోఫిజిక్స్‌పై మక్కువతో..భూగర్భంలో జరిగే అంతు చిక్కని రహస్యాలను తెలుసుకోవాలనే జిజ్ఞాసతో మొదలైన శ్రీధర్ ప్రయాణం అదే విభాగంలో డాక్టరేట్ పొందే వరకు సాగింది. ఆయన ఆసక్తిని గమనించి ప్రొ. రామరాజ్ మాథూర్ ప్రోత్సహించడంతో ప్రకృతి విపత్తులకు సమర్థవంతంగా సన్నద్ధమయ్యే అవకాశం కల్పించే ఆధునాతన విధానానికి శ్రీధర్ రూపకల్పన చేసే స్థాయికి ఎదిగారు. శాస్త్రీయ అధ్యయనంపై మక్కువతో ఉస్మానియా యూనివర్సిటీలో స్కాలర్‌గా చేరి ఎనిమిది జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్‌కు తన పరిశోధన అనుభవాలను పంచుకున్నారు. అదే విధంగా మరో ఐదు ఎడ్యుకేషన్ సెమినార్‌ల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఈ రంగంలో తన నైపుణ్యాలను ప్రదర్శించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు.

ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కాలేజీ విద్యార్థే..%అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన శ్రీధర్ జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ పీజీ కాలేజీలో చదివారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీలో జియోఫిజిక్స్ విభాగంలో చేరారు. ఆ తర్వాత నిర్వహించిన పీహెచ్‌డీ ఎంట్రెన్స్ ద్వారా ఉస్మానియా యూనివర్సిటీలోనే రీసెర్చ్ స్కాలర్‌గా చేరి ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి విపత్తుల నిర్వహణ సవాళ్లను అధిగమించే నూతన విధానంపై అధ్యయనం చేశారు.

## ఇందిరమ్మ ఇండ్లపై ప్రభుత్వం శుభవార్త.. దరఖాస్తుకు మరో ఛాన్స్




**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనవరి 26న రిపబ్లిక్ డే రోజు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించారు. అంతకు ముందే ఈ పథకంలో అర్హుల జాబితాను ప్రకటించిన విషయం తెలసిందే. గ్రేటర్ హైదరాబాద్ జిల్లాల పరిధిలో ఇందిర ఇండ్ల దరఖాస్తుల క్షేత్రస్థాయి అధ్యయన ప్రక్రియ పూర్తయ్యింది. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో మొత్తం 10,70,859 దరఖాస్తులు వచ్చాయి. అయితే, వీటిలో చిరునామాలు గుర్తించలేకపోయినవి 10 వేలలోపు ఉంటాయని తెలుస్తోంది. ప్రస్తుతం వారు ఎక్కడ ఉంటున్నారో.. పరిసరాల్లోని వారు సైతం చెప్పలేకపోతున్నారని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చినవాటిలో 99.99 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసిన అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు అందించారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం వీటిని మూడు భాగాలుగా విభజించారు. ఇల్లు లేకపోయినా సొంత స్థలం ఉన్న వారిని ఎల్-1, ఇల్లు, స్థలం లేని వారు ఎల్-2, అర్హులు కాని వారు ఎల్-3గా విభజించారు. దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలనలో కొందర్ని అర్హులుగా అధికారులు గుర్తించారు. సొంత స్థలం, ఆదాయపన్ను చెల్లిస్తుండటం తదితర కారణాలతో అలాంటి వారిని అనర్హుల జాబితాలో చేర్చారు. అందుకు వీరికి మరో అవకాశం ఇవ్వాలని ఉన్నతస్థాయి అధికారులు భావిస్తున్నారు.వారిని అనర్హులుగా పక్కన పెడితే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్న అభిప్రాయంతో మరో అవకాశం ఇవ్వాలని ప్రాథమికంగా అధికారులు ఓ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఆ జాబితాలోని మూడు విభాగాలకు చెందినవారి వివరాలను గృహ నిర్మాణ శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచేందుకు కసరత్తు చేపట్టారు. వారు అర్హులమని నిర్ధారించేందుకు అవసరమైన వివరాలతో మరోసారి దరఖాస్తు చేసుకోడానికి అవకాశం కల్పిస్తే.. వాటిని పరిశీలించిన తర్వాత ఒకటికి రెండుసార్లు నిర్ధారించుకున్నట్లు అవుతుందని అధికారుల భావిస్తున్నారు. ఈ జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టడంతో పాటు మొబైల్‌కు మెసేజ్‌లు పంపేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఉన్నతాధికారి వివరించారు. కాగా, ఇప్పటికే ఈ పథకం కోసం ప్రభుత్వం యాప్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

# సూపర్‌సిక్స్‌లో రెండింటికి నిధులు

**(1వపేజీ తరువాయి)**మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం గురించి ఈ సారి బడ్జెట్ లో ప్రస్తావన చేయలేదు. ఇప్పటికే ఈ నిర్ణయం అమలు కోసం మంత్రుల కమిటీ ని ఏర్పా టు చేసారు. ఈ పథకం అమలు అవుతున్న రాష్ట్రాల్లో అధ్యయనం చేస్తున్నారు. ఉగాది నుంచి ఈ పథకం అమలు చేస్తామని ప్రభుత్వంలోని మంత్రులు చెబుతూ వచ్చారు. అయితే, ఈ పథకం గురించి ప్రత్యేకంగా ప్రస్తావన చేయకపోవటం తో ఎప్పటి నుంచి అమలు చేస్తారనేది ఇప్పుడు సస్పెన్స్ గా మారుతోంది. బడ్జెట్ లో లేని ప్రస్తావన మహిళలకు ఉచిత ప్రయాణం అమలుతో ఆర్టీసీకి నెలకు రూ.250 నుంచి రూ.260 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసారు. ఇక.. సూపర్ సిక్స్ లో భాగంగా ప్రతీ మహిళకు నెలకు రూ 1500 ఇస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఈ బడ్జెట్ లో ఈ పథకం అమలు గురించి ఎక్కడా ప్రస్తావన చేయ లేదు. నిరుద్యోగ భృతి హామీ గురించి బడ్జెట్ లో ఊసే లేదు. ఉద్యోగం వచ్చేంత వరకు 'నిరుద్యోగ భృతి' కింద నెలకు రూ 3 వేలు ఇస్తామని గతంలో హామీ ఇచ్చారు. ఇందు కోసం అధికారులు సుమారు నెలకు రూ 2100 కోట్లు అవసరమని అంచనా వేసారు. ఈ బడ్జెట్ లో ఈ నిర్ణయం అమలు దిశగా ఎలాంటి నిర్ణయం లేదని తెలుస్తోంది.

## జగన్‌తో జాగ్రత్త!

**(1వపేజీ తరువాయి)**పెట్టాలని నేతలకు సూచించారు.అదే విధంగా ఎమ్మెల్యేలు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని చంద్రబాబు సూచించినట్లు తెలుస్తోంది. అనవసరమైన విషయాలను మాట్లాడి ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వొద్దని చంద్రబాబు హెచ్చరించారు. ఎమ్మెల్యేలు పొరపాటు మాట్లాడితే ప్రతిపక్షం అవకాశంగా మలుచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ఎమ్మెల్యేలకు, కేడర్‌కు, ప్రజలకు మధ్య సమన్వయం కొరవడిందన్న చంద్రబాబు.. సమన్వయ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసుకుని సమస్యను అధిగమించాలని

పిలుపునిచ్చారు. కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేలు అవగాహన పెంచుకోవాలని.. వచ్చే ఎన్నికల్లో టికెట్ దక్కాలంటే ఇప్పటి నుంచే వారి పని తీరులో మార్పు రావాలని సూచించారు. మరోవైపు కష్టాల్లో కూడా మంచి బడ్జెట్ ప్రజలకు అందిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. బడ్జెట్ ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్ళే బాధ్యత ఎమ్మెల్యేలదే అని ఆయన స్పష్టం చేశారు. ఇక నియోజకవర్గాలలో దెబ్బతిన్న రోడ్లకు రెండు నెలల్లో మరమ్మత్తులు పూర్తి చేయాలని ఆదేశించారు.

## భారతదేశ ఆర్థిక వృద్ధి రేటు 6.2%

**(1వపేజీ తరువాయి)**వృద్ధి చెందింది. వ్యవసాయ వృద్ధి రేటు వ్యవసాయ వృద్ధి గత సంవత్సరంతో పోలిస్తే 5.6%కి చేరుకుంది, గత సంవత్సరం నుండి 1.5% గణనీయంగా మెరుగుపడింది. తయారీ రంగం మాత్రం మందగమనాన్ని చూసింది, నిరుడు 14% నుండి 3.5% రేటుతో వృద్ధి చెందింది. నిర్మాణ రంగం నిరుడు నమోదైన 10% వృద్ధి నుండి 7% రేటుతో వృద్ధి చెందింది. పారిశ్రామిక వృద్ధి గత సంవత్సరం 11.8% నుండి 4.5%కి తగ్గింది, అయితే సేవల రంగం నిరుడు 8.3% నుండి 7.4%కి తగ్గింది. సుజ్లాన్ ఇన్వెస్టర్లలో అయోమయం, తర్వాతి పరిస్థితి ఏంటి మరి..? కానీ ఇంకా నెమ్మదిగా భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఉంది, కానీ పెరుగుదల ఇప్పటికీ 8% కంటే తక్కువగా ఉంది. అంతేకాకుండా, ట్రంప్ పరిపాలన ప్రపంచ వాణిజ్యాన్ని పరస్పర సుంకాలతో పెంచుతామని బెదిరిస్తున్నందున అనిశ్చితులను ఎదుర్కొంటోంది.

# బ్లాక్ ఫ్రైడే

**(1వపేజీ తరువాయి)**జీడీపీ గణాంకాలపై నెలకొన్న భయాలతో పాటు సుంకాలపై ట్రంప్ తాజా వ్యాఖ్యలు, అమెరికా ఆర్థిక వ్యవస్థలో మందగమనం శుక్రవారం ఈక్విటీ మార్కెట్లో మంటలు రేపాయి. భారీ స్థాయిలో జరిగిన అమ్మకాల ప్రభావంతో సెన్సెక్స్ 1,414.33 పాయింట్లు నష్టపోయి 73,198.10 వద్ద ముగిసింది. నిఫ్టీ 420.35 పాయింట్లు నష్టపోయి 22,124.70 వద్ద క్లోజైంది. ఫలితంగా బీఎసఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ (ఇన్వెస్టర్ల సంపద) ఒక్క రోజులోనే రూ.8.9 లక్షల కోట్ల మేరకు దిగజారి రూ.384.22 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది. కీలక సూచీలన్నీ నష్టాల్లోనే ముగిశాయి. ఐటీ, ఆటో, బ్యాంక్, మెటల్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలన్నీ కూడా భారీ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అవి 0.7 శాతం నుంచి 6.5 శాతం మధ్యన నష్టపోయాయి.

ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో ప్రతికూల ధోరణులు దేశీయ మార్కెట్లో అమ్మకాలకు ఆజ్యం పోశాయి. ఏఐలో అగ్రగామిగా ఉన్న ఎన్‌విడియా షేర్లలో భారీ అమ్మకాలు దేశీయ ఐటీ షేర్లలో కూడా అమ్మకాలకు దారి తీశాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 4.2 శాతం మేరకు నష్టపోయింది. టెక్ మహీంద్రా, విప్రో, ఎంఫసిస్ షేర్లు గరిష్ఠంగా 6.5 శాతం వరకు నష్టపోయాయి.

**ట్రంప్ చర్యల ప్రభావం:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం కెనడా, మెక్సికోలపై 25% సుంకాలు విధించడంతో పాటు చైనాపై 10% అదనపు సుంకాలు విధిస్తూ తీసుకున్న చర్యలు శుక్రవారం మార్కెట్లో ప్రకంపనలు రేపాయి. ట్రంప్ వాణిజ్య విధానాలపై నెలకొన్న అనిశ్చితి మార్కెట్‌ను మరింత అస్థిరతకు గురి చేస్తోంది. వాణిజ్య యుద్ధం తీవ్ర రూపం దాల్చవచ్చన్న భయాల కారణంగా డాలర్ ఇండెక్స్ 107.36 పాయింట్లకు దూసుకుపోయింది. డాలర్ ఇండెక్స్ ఎంత బలపడితే భారత్ సహా వర్ధమాన మార్కెట్లకు అంత నష్టం అంటున్నారు.ఈక్విటీ మార్కెట్లలో బలహీనత కారణంగా అమెరికన్ డాలర్ మారకంలో రూపాయి శుక్రవారం 19 పైసల మేరకు క్షీణించి 87.37 వద్ద ముగిసింది.

**ఏడాది కనిష్ఠానికి 148 స్టాక్స్**

శుక్రవారం నాటి బేర్ దెబ్బకు నిఫ్టీ 500 ఇండెక్స్‌లోని 140 స్టాక్స్ 52 వారాల కనిష్ఠానికి చేరాయి. ఈ షేర్లలో జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆయిల్ ఇండియా, టాటా టెక్నాలజీస్, సొనాటా సాఫ్ట్‌వేర్ సహా మరికొన్ని ఉన్నాయి. మరోవైపు నిఫ్టీ 50లోని 45 షేర్లు నష్టాల్లోనే ముగిసాయి.

# స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం

**(1వపేజీ తరువాయి)**బడ్జెట్ రూపొందించినట్లు చెప్పారు. 2014-19 మధ్య రాష్ట్రం రెండంకెల వృద్ధి సాధించిందన్నారు. సవాళ్లను ఎదుర్కోవడంలో చంద్రబాబు.. ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. రాష్ట్ర విభజన కారణంగా రాజనిని కోల్పోయిన ఏపీకి అమరావతిని ప్రజా రాజధానిగా చేసుకున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అమరావతి పనులు పెద్దఎత్తున చేపడతామని చెప్పారు. మహారాష్ట్రకు ముంబయి, తెలంగాణకు హైదరాబాద్ ఎంత ముఖ్యమో.. మనకూ అమరావతి అంతే ముఖ్యమన్నారు. ప్రధాని మోదీ సహకారంతో ముంబయి, హైదరాబాద్ నగరాలకు సరితూగేలా అమరావతిని అభివృద్ధి చేస్తామని పయ్యావుల వెల్లడించారు.

రాజధాని అమరావతికి రూ.6 వేల కోట్ల నిధులు కేటాయించారు. రాజధానిలో రూ.41 వేల కోట్లతో ఏడీబీ, ప్రపంచబ్యాంకు, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ వంటి ఆర్థిక సంస్థల అప్పుతో పనులు చేపడుతున్న విషయం తెలిసిందే. వీటికి అదనంగా రాజధాని ప్రాంత పరిధిలో చేపట్టాల్సిన పనులకు రూ.6వేల కోట్లు కేటాయించారు. అమరావతి అభివృద్ధి పనులకు తీసుకుంటున్న రుణం నేపథ్యంలో మ్యాచింగ్ గ్రాంట్‌గా కూడా కొంత రాష్ట్ర ప్రభుత్వం చూపాల్సి ఉంటుంది. అలాగే, అమృత సిటీలో భాగంగా అమరావతికి కేంద్రం ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా కొంత మ్యాచింగ్ గ్రాంట్‌ను కలపాల్సి ఉంటుంది. ఇవికాకుండా రాజధాని ప్రాంతంలో అవసరాల ప్రాతిపదికన చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను వినియోగిస్తారు. అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్), ఇన్నర్ రింగ్‌రోడ్డు (ఐఆర్ఆర్)కు సంబంధించి అనుబంధంగా చేపట్టాల్సిన అనుసంధాన మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను వినియోగించే అవకాశం ఉంది.

బడ్జెట్‌లో గంపగుత్తగా కేటాయింపులు జరిపినప్పటికీ విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం, మచిలీపట్నం పోర్టుకు రూ.200 కోట్ల మేర ప్రయోజనం కలగనుంది విజయవాడ విమానాశ్రయానికి సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా ఇళ్ల నిర్మాణానికి తొలి విడతగా ఇవ్వాల్సిన నిధులు, ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చిన రైతులకు కౌలు బకాయిలు, నిరాశ్రయులై అద్దె ఇళ్లలో ఉంటున్న వారికి అద్దె బకాయిలు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన బకాయిల క్లియరెన్స్‌కు రూ.100 కోట్ల మేర కేటాయింపులు జరిపారు. దీంతో విజయవాడ ఎయిర్‌పోర్టుతో ముడిపడిన ఐదేళ్ల సమస్యలకు పరిష్కారం లభించింది. మచిలీపట్నం పోర్టు పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 15 శాతం వాటాగా చెల్లింపులు, ఇతర నిర్వహణ అంశాలకు సంబంధించి రూ.100 కోట్లు కేటాయింపులు జరిపింది.మౌలిక రంగ ప్రాజెక్టులు పరుగులు పెట్టేందుకు వీలుగా భూ సేకరణలకు ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. విజయవాడలో మెట్రోరైల్ ప్రాజెక్టుతో పాటు విజయవాడ-నాగపూర్ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా జక్కంపూడి-ఖమ్మం వరకు 30 కిలోమీటర్ల నాలుగు వరసల గ్రీన్‌ఫీల్డ్ హైవే కు సంబంధించి ఉన్న స్వల్ప భూ సమస్యల పరిష్కారానికి సైతం మార్గం సుగమమైంది.

జల్‌జీవన్ మిషన్ స్కీమ్‌లో భాగంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో రూ.6 వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాటర్ గ్రిడ్ పథకంలో భాగంగా ఈ మేరకు అంచనాలు వేశారు. మొదటి విడతగా జల్‌జీవన్ మిషన్ స్కీమ్‌కు తన మ్యాచింగ్ గ్రాంట్‌గా రూ.2,800 కోట్ల కేటాయింపులు జరపటంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఉన్న అత్యవసర పరిస్థితుల రీత్యా రూ.500 కోట్ల వరకు నిధుల కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణాజిల్లాకు మంచినీటి సరఫరాకు సంబంధించిన ప్రాజెక్టుకు అడుగులు పడనున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో బ్యాలెన్స్ పనులకు మార్గం సుగమం కానుంది. రెండు జిల్లాల్లో తలసరి నీటి వినియోగ పెంపునకూ ఇది దోహదపడుతుంది.

## ఎస్సెల్బీసీ సొరంగంలో మృతదేహాలు?

**(1వపేజీ తరువాయి)**శాఖ కూడా రంగంలోకి దిగింది. సొరంగం తవ్వేందుకు ఉపయోగించిన టీబీఎం మిషన్ అందులో చిక్కుకుపోవడంతో దాన్ని రైల్వే నిపుణులు ప్లాస్మా గ్యాస్ కట్టర్ల సాయంతో కట్ చేశారు. అనంతరం సహాయక బృందాలు లోపలికి వెళ్లేందుకు అవకాశం లభించింది. లోపలికి వెళ్లి చూడగా.. అందులో కార్మికుల మృతదేహాలు బురద, మట్టిలో కూరుకుపోయి కనిపించాయి. దీంతో అక్కడ విషాద వాతావరణం నెలకొంది. వారం రోజులుగా సొరంగంలో ఉన్న కార్మికుల్ని అధికారులు, సహాయక సిబ్బంది చేయని ప్రయత్నం లేదు. తాజాగా అత్యాధునిక గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్‌ను కూడా వాడారు. దీని సాయంతో సొరంగంలో పైకప్పు కూలిన ప్రాంతంలో కింద ఏముందో తెలుసుకునేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ మృతదేహాల్ని గుర్తించారు. వెంటనే దగ్గరకు వెళ్లి మట్టి, బురద తొలగిస్తే అందులో మృతదేహాలు కనిపించాయి. ఈ నేపథ్యంలో అధికారులు సహాయక సిబ్బందిని అక్కడికి రప్పించి వాటిని బయటకు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.అయితే టీబీఎం మిషన్‌కు ఐదుచోట్ల మెత్తని భాగాలు బురదలో కూరుకుపోయినట్లు రాడార్ గుర్తించడం వాస్తవమేనని, అయితే అవి మృతదేహాలుగా భావించలేమని అధికారులు చెబుతున్నారు. అలాగే కార్మికులు చనిపోయారని వస్తున్న వార్తలను నమ్మవద్దని నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ సంతోష్ తెలిపారు. చిక్కుకున్న కార్మికుల కోసం ఇంకా గాలింపు చర్యలు జరుగుతున్నాయన్నారు.

## మంచులో చిక్కుకున్న 57 మంది కార్మికులు

**(1వపేజీ తరువాయి)**మంది కార్మికులు మంచులో చిక్కుకుపోయారు. 10 మందిని రక్షించాం. మనాలోని ఆర్మీ క్యాంప్ నకు తరలించాం. మిగతా వారిని బయటకు తీసుకొచ్చే పనిలో ఉన్నాం. మంచు భారీగా కురుస్తున్న క్రమంలో కార్మికుల దగ్గరికి వెళ్లలేకపోతున్నాం" అని ఐజీ నీలేశ్ ఆనంద్ భార్నె తెలిపారు. ఘటనా స్థలిలో మూడు అంబెలెన్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మంచు కూరుకుపోవడం వల్ల లోపలికి వెళ్లలేకపోతున్నామని.. మంచులో చిక్కుకున్న కార్మికులను ఎలాగైనా బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. అయితే గత రెండు రోజులుగా ఉత్తరాఖండ్ లో భారీగా మంచు కురుస్తోంది.

## ఎయిర్‌పోర్టుకు పచ్చజెండా

**(1వపేజీ తరువాయి)**మామునూరు ఎయిర్ పోర్ట్ విస్తరణకు అవసరమైన 253 ఎకరాల భూసేకరణ కోసం రూ. 205 కోట్లను రేవంత్ సర్కారు విడుదల చేసింది. ఇప్పటికే ఎయిర్ పోర్ట్ పరిధిలో 696 ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కొత్తగా సేకరించే 253 ఎకరాల భూమిని రన్ వే విస్తరణకు, నెవిగేషనల్ ఇన్‌స్ట్రూమెంట్ ఇన్‌స్టాలేషన్ విభాగాల కోసం నిర్మాణాలకు, ఏటీసీ, టెర్మినల్ బిల్డింగ్ కోసం వినియోగించనున్నారు. వరంగల్ జిల్లాలోని గాడిపల్లి, గుంటూరుపల్లి, నక్కలపల్లి గ్రామాల నుంచి భూమిని సేకరించనున్నారు. విమానాశ్రయం ఏర్పాటుకు తమ విలువైన భూములు ఇస్తున్న రైతులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లిస్తామని మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. భూమి కోల్పోతున్న 233 మంది రైతులు, ప్లాట్ల యజమానుతో చర్చించి వారి అభిప్రాయాల మేరకు వేరే చోట భూమి కేటాయిస్తామని మంత్రి తెలిపారు. అంతేగాక, రైతులు కోరిన విధంగా మౌలిక సదుపాయాలైన రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, ఇతర సదుపాయాలను కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## రాష్ట్రాభివృద్ధికి అడ్డు కిషన్‌రెడ్డే

**(1వపేజీ తరువాయి)**రాష్ట్రానికి నిధులు మంజూరు చేయించడం కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డి బాధ్యతని సీఎం అన్నారు. రేవంత్ రెడ్డి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారంటూ కేంద్రమంత్రి హోదాలో ఉన్న మీరు వ్యాఖ్యలు చేయడం పూర్తి బాధ్యతా రాహిత్యం అని లేఖలో రాసుకొచ్చారు. తెలంగాణలో 2023, డిసెంబరు 7న ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచే పూర్తి బాధ్యతాయుతంగా, పారదర్శకంగా తమ పాలన సాగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రయోజనాల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని సీఎం స్పష్టం చేశారు. అంతే కాకుండా తెలంగాణ అభివృద్ధిలో కీలకమైన హైదరాబాద్ మెట్రోఫేజ్-2, ఆర్ఆర్ఆర్, మూసీ పునరుజ్జీవనం, సహా పలు అంశాలలో కేంద్రప్రభుత్వ విధివిధానాలను పూర్తిగా పాటిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే ప్రాజెక్టుల సాధనకు ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులతో పాటు మిమ్మల్ని కలిసిన విషయాన్ని మీకు గుర్తు చేయాలనుకుంటున్నానని రేవంత్ లేఖలో పేర్కొన్నారు. ఇక పలు అంశాలను సైతం లేఖలో ప్రస్తావించారు. వాటిలో హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ఆలస్యం, కేంద్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి రాసుకొచ్చారు. మూసీ నది పునరుద్ధరణకు కేంద్రం మద్దతు కావాలని కోరారు. గోదావరి నీటిని మూసీ నదికి అనుసంధానం చేయాలన్న ప్రణాళికతో పాటు నదిని శుద్ధి చేయడానికి చేపట్టే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు అవసరమని పేర్కొన్నారు. కేంద్ర కేబినెట్‌లో కొనసాగుతున్న కిషన్ రెడ్డి, రాష్ట్రానికి ఏం సాధించారో ప్రజలకు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రిగా ఉండి తెలంగాణకు ఏమీ సాధించలేకపోయారని ఆరోపించారు.

## హాస్టల్ సిబ్బంది నిర్వాకం

**(1వపేజీ తరువాయి)**కార్యక్రమానికి వెళ్లాలని.. రాత్రికి వీరంరాజుపల్లి రోడ్డులోని గంగమ్మ దేవాలయం వద్ద పెట్టే భోజనం తినాలని విద్యార్థులకు చెప్పి వంట చేయడం మానేశారు. అయితే విధిలేక ఆలయాల వద్దకు వెళ్లిన విద్యార్థులకు చేదు అనుభవమే ఎదురైంది. భక్తులు తిన్నాకే తినాలని ఆలయ నిర్వాహకులు చెప్పడంతో విద్యార్థులకు షాక్ తగిలింది. భక్తులు తినే వరకు ఆగి కొందరు పెట్టింది తినగా... సగం మందికి పైగా విద్యార్థులు తినకుండా మిగిలిపోయినట్టు చెబుతున్నారు. ఈ క్రమంలోనే గురువారం ఉదయం పాఠశాలలో విద్యార్థులు నీరసంగా కనిపించడంతో ఉపాధ్యాయులు ఆరా తీయడంతో విషయం బయటపడింది. 200 మంది విద్యార్థులు హాస్టల్ లో ఉన్నప్పుడు భోజనం వండకుండా.. అన్నదానం వద్ద తినమని పంపించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భోజనం కోసం కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలయానికి విద్యార్థులను నడుచుకుంటూ వెళ్లాలని చెప్పడమేంటని ఫైర్ అవుతున్నారు. ఈ ఘటనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సదరు హాస్టల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### భారత్ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ప్రపంచ బ్యాంకు సూచనలు

**(1వపేజీ తరువాయి)**హబ్‌గా మారడానికి ఇటీవలి కాలంలో భారత్ అనేక నిర్మాణాత్మక సంస్కరణలను చేపట్టిందని తెలిపింది. వీటిలో భాగంగానే మౌలిక సదుపాయాల కల్పన, మానవ మూలధనాన్ని మెరుగుపరచడం, స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడం వంటి సంస్కరణలు చేపట్టిందని వెల్లడించింది.



# సిద్ధరామయ్యకూ 'శీష్ మహల్' సెగలు

**బెంగళూరు - నవభూమి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 'సీఎం బంగ్లా' వివాదం ముదరడం, దానిని 'శేష్ మహల్' (అద్దాల మేడ)గా అభివర్ణిస్తూ బీజేపీ విరుచుకుపడటం 'ఆప్' విజయావకాశాలను గండికొట్టింది. తాజాగా ఇప్పుడు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన అధికార నివాసాన్ని 'శేష్ మహల్' తరహాలో పునరుద్ధరించుకునేందుకు భారీగా ఖర్చు చేస్తున్నారంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఓవైపు ప్రజాపనుల కోసం నిధులు లేవంటూ సొంత పనులకు భారీ ఖర్చులు ఎందుకంటూ నిలదీస్తున్నుయి.ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికార నివాసం 'కావేరీ' పునరుద్ధరణకు రూ.2.6 కోట్లను రాష్ట్ర ప్రజాపనుల శాఖ అంచనా వేసింది. ఇందుకు సంబంధించి ఆర్థిక శాఖ నుంచి జీవో వెలువడింది. బంగ్లా అప్‌గ్రేడేషన్‌లో భాగంగా రూ.1.7 కోట్లతో హెల్పర్ రూమ్‌లు, ఇతర నిర్మాణాలు చెపట్టనుండగా, రూ.89 లక్షలతో ఎలక్ట్రిక్ అప్‌గ్రెడ్, మొదలైన సదపాయాలు కల్పించనున్నారు.తాజా పరిణామంపై బీజేపీ ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్ విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ నిధులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి తన సొంత పనులపై దృష్టిసారించడం ఏమిటని ఆయన నిలదీశారు. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన పనులను ముందు చేపట్టి ఆ తర్వాత సొంత బంగ్లా పనుల చక్కబెట్టుకోవాలని హితవు పలికారు. కర్ణాటక ఆర్థిక పరిస్థితి తీవ్ర ఒడిదుడుకుల్లో ఉందంటూ వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో సీఎం బంగ్లాను పునరుద్ధరిస్తారంటూ వార్తలు రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రభుత్వ గ్యారెంటీ పథకాలకే నిధుల కొరత ఉందని, ఇక రాష్ట్రాభివృద్ధి ఎలా సాధ్యమని బీజేపీ, ఇతర ప్రతిపక్షాలు నిలదీస్తున్నాయి.

# ఢిల్లీ రైల్వే స్టేషన్ తొక్కిసలాటపై పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఫిబ్రవరి 15వ తేదీన న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. కుంభమేళాకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఒక్కసారిగా ఫ్లాట్‌ఫాంపై విరుచుకుపడడంతో ఆ తొక్కిసలాట జరిగింది. ఆ ఘటనలో సుమారు 18 మంది మరణించారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలైంది. ఆనంద్ లీగల్ ఎయిడ్ ఫోరం ట్రస్టు ఆ పిటీషన్ వేసింది. మరణాల సంఖ్యను రైల్వే శాఖ దాచిపెడుతున్నట్లు ఆ లీగల్ సంస్థ తన పిటీషన్‌లో ఆరోపించింది.అయితే ఇవాళ సుప్రీంకోర్టు ఆ అభ్యర్థనను తోసిపుచ్చింది. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం రైల్వే స్టేషన్ తొక్కిసలాటలో సుమారు 200 మంది మరణించినట్లు పిటీషనర్ తన ఫిర్యాదులో ఆరోపించారు. విచారణ సమయంలో పిటీషనర్‌ను సుప్రీం ప్రశ్నించింది. మీరు చెప్పిన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందా అని కోర్టు అడిగింది. 200 మరణాలు సంభవించినట్లు చెబుతున్న నేపథ్యంలో.. దానికి ఏమైనా ఆధారాలు ఉన్నాయా అని కోర్టు నిలదీసింది. కొంత సమయం విచారణ జరిగిన తర్వాత కోర్టు .. ఆ పిటీషన్‌ను కొట్టివేసింది. బాధిత కుటుంబాలు కోర్టును ఆశ్రయించే వరకు వేచి చూద్దామని సుప్రీం ధర్మాసనం పేర్కొన్నది.

# జనాభా ఆధారంగా డీలిమిటేషన్ వద్దు: సీఎం స్టాలిన్





**చెన్నై- నవభూమి:** కేవలం జనాభా ఆధా రంగా దక్షిణాది రాష్ట్రాల పార్లమెంట్ సీట్లను నిర్ణయిం చరాదు అని కేంద్రాన్ని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ కోరారు. ఒకవేళ అలాంటి ప్రయత్నం ఏదైనా జరిగితే, దాన్ని ప్రతిఘటిస్తామని ఆయన అన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గాల డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా తమ రాష్ట్రానికి ఎటువంటి అన్యాయం జరిగినా సహించేది లేదన్నారు. మా డిమాండ్ చాలా స్పష్టంగా ఉందని, కేవలం జనాభా ఆధారంగా పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరగవద్దు అని, జనాభా నియంత్రణకు దక్షిణా రాష్ట్రాలు తీవ్ర చర్యలు తీసుకున్నాయని, ఇప్పుడు డీలిమిటేషన్ ద్వారా ఆ రాష్ట్రాలను శిక్షించవద్దు అని స్టాలిన్ తన వీడియో సందేశంలో తెలిపారు. 72వ పుట్టిన రోజు సందర్భంగా ఆయన ఈ సందేశాన్ని రిలీజ్ చేశారు. తమిళ భాష, సంస్కృతిని కాపాడుకునేందుకు కూడా పోరాటం చేస్తానన్నారు.

# కుంభమేళాలో మహిళలు స్నానం చేస్తున్న వీడియోలు.. వ్యక్తి అరెస్ట్



ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 45 రోజులపాటూ సాగిన అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళా ముగిసింది. అయితే, అక్కడ సంగమంలో స్నానాలు చేస్తున్న మహిళా భక్తులకు సంబంధించిన వీడియోలు ఫొటోలు తీసి కొందరు సోషల్ మీడియాలో విక్రయిస్తున్న ఉదంతం ఇటీవలే బయటకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై యూపీ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో తాజాగా ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు.నిందితుడు పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాకు చెందిన అమిత్ కుమార్ ఝూగా పోలీసులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. యూట్యూబ్‌లో కంటెంట్‌తో డబ్బు సంపాదించేందుకు వీడియోలను చిత్రీకరించినట్లు విచారణలో నిందితుడు అంగీకరించినట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు గురువారం తెలిపారు. అతడిపై పలు సెక్షన్ల కింద సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

# మార్చి 15 నుంచి స్పేడెక్స్ ప్రయోగాలు తిరిగి ప్రారంభం: ఇస్రో చీఫ్ నారాయణన్




**న్యూఢిల్లీ-నవభూమి:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మార్చి 15 నుంచి 'స్పాడెక్స్' మిషన్ కింద మళ్ళీ ప్రయోగాలు ప్రారంభించనుందని.. ఇస్రో చీఫ్ వి. నారాయణన్ వెల్లడించారు. గతనెల జనవరి 16, 2025న తొలిసారి నింగిలో ఉపగ్రహాలను ఇస్రో విజయవంతంగా అనుసంధానం చేయడంతో.. ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇస్రో మళ్లీ స్పేడెక్స్ కింద మార్చి 15 నుంచి ప్రయోగాలు మొదలుపెట్టనుంది. ఈ సారి భవిష్యత్ ప్రాజెక్టులను దృష్టిలో ఉంచుకుని సాంకేతిక పరిజ్ఞానాలను సమకూర్చుకునేందుకు.. చేజర్, టార్గెట్ అనే రెండు ఉపగ్రహాలను వేరు చేసి తిరిగి కలిపేందుకు ప్రయత్నించబోతోంది."ప్రస్తుతం ఇంటిగ్రేటెడ్ ఉపగ్రహం దీర్ఘవృత్తాకార కక్ష్యలో ఉంది. కాబట్టి, ప్రతి రెండు నెలలకు ఒకసారి మాకు ప్రయోగానికి 10-15 రోజులు అనుకూలిస్తాయి. ప్రస్తుతం ఉపగ్రహాలను వేరు చేయడానికి, రీడాక్ చేయడానికి 'సిమ్యులేషన్' ప్రయోగాలను నిర్వహిస్తున్నాము. ఇప్పటికే ఒక ప్రణాళిక సిద్ధం చేశాం. మార్చి 15 నుంచి 'స్పేడెక్స్' ఉపగ్రహాలపై ప్రయోగాలు చేపడతామని" ఇస్రో చైర్మన్ వి నారాయణన్ జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పేర్కొన్నారు.గతేడాది డిసెంబర్ 30న ఇస్రో 'స్పాడెక్స్' మిషన్‌ను ప్రారంభించింది. అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను డాక్ చేసే ప్రయోగాన్ని ప్రదర్శించడానికి ఇస్రో అప్పుడు %ాణశ01, ాణశ%02 అనే రెండు ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. అనేక ప్రయత్నాల తర్వాత ఇస్రో 2025 జనవరి 16న ఈ విజయాన్ని సాధించింది.

# ఐలవ్‌యూ చెప్పి, డ్యాన్స్ ఇరగదీసిన మోనాలిసా..



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ప్రయాగ్‌రాజ్ మహా కుంభ మేళాలో పూసలు, రుద్రాక్ష దండలు అమ్ముకుంటూ సోషల్ మీడియాలో ఒక్కసారిగా సెన్సేషన్‌గా మారిన వైరల్ గర్ల్ మోనాలిసా భోంస్లే.. అప్పటినుంచి వరుసగా వార్తల్లో నిలుస్తోంది. ఇక బాలీవుడ్ డైరెక్టర్ సనోజ్ మిశ్రా తీస్తున్న ది స్టోరీ ఆఫ్ మణిపూర్ చిత్రంలో కీలక పాత్రను దక్కించుకున్నప్పటి నుంచి మోనాలిసా పేరు దేశవ్యాప్తంగా మారుమోగిపోతోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఆమె కోజికోడ్ జిల్లాలో ఓ జ్యువెలరీ షాప్ ఓపెనింగ్‌కు వెళ్లిన మోనాలిసాను చూసేందుకు అక్కడికి భారీగా జనం తరలిరావడంతో ఆమె క్రేజ్ ఎంత ఉందో అర్థం అయిపోయింది. ఈ క్రమంలోనే తాజాగా ఇటీవల మహా శివరాత్రి సందర్భంగా ఆమె నేపాల్ పర్యటనకు వెళ్లారు.మహా శివరాత్రి పండగ వేళ.. బాలీవుడ్ డైరెక్టర్ సనోజ్ మిశ్రాతో కలిసి.. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోనాలిసా పాల్గొంది. ఇక ఆ కార్యక్రమానికి స్థానికంగా భారీగా జనం తరలివచ్చారు. నేపాల్‌లోని మైలాపూర్‌లో నిర్వహించిన మహా శివరాత్రి ఉత్సవాల్లో ఆమె ప్రదర్శన ఇచ్చింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై మొదట ప్రసంగించిన మోనాలిసా.. ఈ క్రమంలోనే అంతా ఎలా ఉన్నారంటూ అడిగింది.ఆ తర్వాత ఐలవ్‌యూ అంటూ అక్కడికి వచ్చిన కుర్రకారును ఉత్సాహ పరిచింది. ఇక ఆ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను మోనాలిసా తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లో షేర్ చేయడంతో ఆ వీడియో ఇప్పుడు నెటిజన్లను తెగ ఆకర్షిస్తోంది. ఇక ఆ వీడియోకు నెటిజన్ల నుంచి హర్షం వ్యక్తం అవుతోంది. చాలా మంది నెటిజన్లు.. ఆమె తొందర్లోనే గొప్ప స్థాయికి వెళ్లిందని కొనియాడుతున్నారు. ఆమె డ్యాన్స్ బాగా చేసిందని.. ఇంకా ఉన్నత స్థితికి వెళ్లాలని ఆకాంక్షించారు. పేద కుటుంబం నుంచి వచ్చిన మోనాలిసాను అందరూ ప్రోత్సహించాలని పేర్కొంటూ కామెంట్లు పెడుతున్నారు.

# భార్య కళ్లెదుటే 7 ఏళ్లుగా ముగ్గురు బిడ్డలపై అత్యాచారం



**న్యూఢిల్లీ-నవభూమి:** తండ్రికూతుళ్ల ప్రేమ, బంధం గురించి అందరికీ తెలిసిందే. కొడుకును సరిగ్గా పట్టించుకోకపోయినా.. ప్రతీ తండ్రి తన కూతురుని మహారాణిలా చూసుకుంటాడని అంటుంటారు. సాధ్యమైనంత వరకూ కష్టపడుతూ.. వారికి మంచి జీవితం ఇవ్వడానికి ప్రయత్నాస్తారని చెబుతుంటారు. కానీ మనం ఇప్పుడు చూడబోయే ఓ నాన్న మాత్రం.. తన ముగ్గురు కూతుర్లను కంటికి రెప్పలా కాపాడుకోవడానికి బదులుగా క్రూరంగా ప్రవర్తించి వారి జీవితాలను నాశనం చేశాడు.ఎవరూ ఊహించని విధంగా.. భార్య కళ్లెదుటే ముగ్గురు కుమార్తెలపై అత్యాచారాని పాల్పడ్డాడు. పూటకొకరిని గదిలోకి తీసుకు వెళ్తూ తన కామవాంఛ తీర్చుకున్నాడు. ఇందులో ఇద్దరు మైనర్లు కాగా.. పెద్ద కుమార్తె మేజర్. తండ్రి చేసిన తప్పుడు పని వల్ల ఇప్పటికే ఆమె నాలుగు సార్లు గర్భం దాల్చింది. విషయం తెలిసిన ప్రతీ సారి తండ్రి అబార్షన్ కూడా చేయించాడు. మరి చివరకు ఈ దారుణం ఎలా వెలుగులోకి వచ్చిందంటే..? ముంబైలోని నల్లసోపారా వెస్ట్ ప్రాంతానికి చెందిన 56 ఏళ్ల నిందితుడికి 25 ఏళ్ల క్రితమే వివాహం జరిగింది. వారి అన్యోన్య దాంపత్యానికి ప్రతీకలుగా ముగ్గురు కుమార్తెలు కూడా పుట్టారు. ఇందులో పెద్ద కుమార్తెకు 21 సంవత్సరాలు కాగా, రెండోకూతురికి 17ఏళ్ళు . ఇక చివరి అమ్మాయికి 15 సంవత్సరాలు. ముందు నుంచే నేర స్వభావం కల్గిన నిందితుడు.. ముంబయి అండర్ వరల్డ్ డాన్ చోటా రాజన్ ముఠాలో చురుకైన సభ్యుడిగా కూడా ఉన్నాడు. 1980, 90 సంవత్సరాల్లో అనేక నేరాలు చేయగా... ఇతడిపై చాలానే కేసులు నమోదు అయ్యాయి.అయితే ఎవరికీ దొరక్కుండానే దందాలు కొనసాగిస్తున్న ఇతడు.. ఇంట్లో కూడా అత్యంత క్రూరంగా ప్రవర్తించాడు. ముఖ్యంగా తన ముగ్గురు బిడ్డలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సింది పోయి.. ఆట బొమ్మలుగా మార్చి వారి జీవితాలను పాడు చేశాడు. ముందుగా పెద్ద కుమార్తెపై కన్ను వేసిన నిందితుడు.. ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. 2018లో తొలిసారి దారుణానికి ఒడిగడితుండగా.. కుమార్తె కాళ్లావేళ్లా పడింది. అయినా పట్టించుకోకుండా తన పని కానిచ్చాడు. ఇది చూసి అడ్డుకోబోయిన భార్యను విపరీతంగా కొట్టగా.. తలకు తీవ్రగాయమై ఆమె స్పృహ తప్పి పడిపోయింది.ఇక ఆ తర్వాత నుంచి అనేక మార్లు పెద్ద బిడ్డను మానభంగం చేశాడు. అడ్డుకోబోయిన ప్రతీసారి భార్యపై తీవ్ర స్థాయిలో దాడి చేశాడు. ఆపై రెండో కుమార్తె, మూడో కుమార్తెపై కూడా కన్నేసిన తండ్రి.. పూటకొకరితో పడక సుఖం పొందాడు. వారికి ఎంత వద్దని బతిమాలి ఏడుస్తున్నా పట్టించుకోకుండా.. విపరీతంగా కొట్టి దాడి చేస్తూ దారుణాలకు ఒడిగట్టాడు. ఈక్రమంలోనే పెద్ద కుమార్తె 4 సార్లు గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న నిందితుడు ప్రతీ సారి అబార్షన్ చేయించాడు. తాజాగా మరోసారి ఆమె గర్భవతి కాగా.. విషయం తెలుసుకున్న తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. బతికుండి ఈ దారుణాలు చూడడం కంటే బిడ్డలను చంపి తాను కూడా చావడం మేలనుకుంది. ఈక్రమంలోనే చనిపోవాలని నిర్ణయించుకుంది.

# సెబీ కొత్త చీఫ్‌గా తుహిన్ కాంత పాండే నియామకం



**న్యూఢిల్లీ-నవభూమి:** స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ' నూతన సారథిగా తుహిన్ కాంత పాండే నియమితులయ్యారు. ప్రస్తుతం ఆర్థిక శాఖ కార్యదర్శిగా పని చేస్తున్న ఆయనకు సెబీ చీఫ్ బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర నియామకాల కమిటీ గురువారం ఇందుకు ఆమోదం తెలిపింది. కాగా, ప్రస్తుతం సెబీ చీఫ్‌గా ఉన్న మాధాబీ పురీ బుచ్ మూడేళ్ల పదవీ కాలం నేటితో (ఫిబ్రవరి 28తో) ముగియనుంది. ఈ నేపథ్యంలో తుహిన్ కాంత పాండేను సెబీ కొత్త చీఫ్‌గా ప్రభుత్వం నియమించింది.తుహిన్ కాంత పాండే 1987 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్ అధికారి. ఆయన గతంలో ఆర్థిక కార్యదర్శిగా, రెవెన్యూ కార్యదర్శిగా పనిచేశారు. ఎయిరిండియా ప్రైవేటీకరణలో పాండే కీలక పాత్ర పోషించారు. తుహిన్ కాంత పాండేకు ఫైనాన్స్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌లో విస్తృత అనుభవం ఉంది. రానున్న మూడేళ్ల పాటు ఆయన ఆ పదవిలో కొనసాగనున్నారు.ఇక ఇప్పటి వరకూ సెబీకి చీఫ్‌గా వ్యవహరించిన మాధాబీ పూరీ బుచ్‌ను కేంద్రం 2022 ఫిబ్రవరి 28న నియమించిన విషయం తెలిసిందే. దీంతో ఆమె అదే ఏడాది మార్చి 2వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. సెబీకి ఓ మహిళ చైర్మన్‌గా నియామకం కావడం ఇదే తొలిసారి. మాధవి గతంలో ఐసీఐసీఐ సెక్యూరిటీస్ హెడ్‌గా సేవలందించారు. 2017 నుంచి 2021 మధ్య కాలంలో సెబీ పూర్తి స్థాయి మెంబర్‌గా పని చేశారు. సెబీ చీఫ్‌గా ఆమె పదవీ కాలం నేటితో ముగియనుంది.

# పార్శిళ్లకు ప్లాస్టిక్ వద్దు.. ఇడ్లీ తయారీలోనూ గుడ్డలు మాత్రమే వాడాలి



**బెంగళూరు-నవభూమి:** ఎటువంటి కలుషితం లేకుండా ఆవిరితో తయారయ్యే ఇడ్లీ ఆరోగ్యానికి ఎంతో మేలని అందరూ భావిస్తారు. కానీ ఇటీవల ఇడ్లీ ద్వారా క్యాన్సర్ ప్రభావం పెరుగుతోందనే అంశం బహిరంగం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇడ్లీ పార్శిళ్లకు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించారు. ఇడ్లీ పార్శిళ్ళకు ఎటువంటి ప్లాస్టిక్ పేపర్‌లను వాడరాదని రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖా మంత్రి దినేష్ గుండూరావ్‌వెల్లడించారు.గురువారం బెంగళూరులో మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఇకపై ఇడ్లీలను గుడ్డలు ఉపయోగించి మాత్రమే తయారు చేయాలని సూచించారు. వేడి ఇడ్లీని ప్లాస్టిక్ పేపర్ ద్వారా పార్శిల్ చేయడం ద్వారా క్యాన్సర్‌ను ప్రేరేపించే రసాయనాలు ఉన్నాయని తేలిందన్నారు. ఇటీవల నగర వ్యాప్తంగా బెంగళూరు మహానగర పాలికె ఆహార సంరక్షణా విభాగం అధికారులు దాడులు జరిపారు.500 ఇడ్లీలను సేకరించగా వీటిలో 35 ఇడ్లీలు అత్యంత ప్రమాదకరమని నిర్ధారించారన్నారు. ప్లాస్టిక్ పేపర్ ఉపయోగించి ఇడ్లీ తయారు చేసినా, వేడి ఇడ్లీ పార్శిల్ చేసినా ప్రమాదకరమనే అంశాన్ని శాస్త్రవేత్తలు వివరించిన మేరకు వైద్య ఆరోగ్యశాఖ తీసుకునన్న నిర్ణయాలకు కట్టుబడాలని స్పష్టం చేశారు. ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా ఇడ్లీల తయారీలో కానీ పార్శిల్‌కు కానీ ప్లాస్టిక్ పేపర్‌లు వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

# హిమపాతం, భారీ వర్షాలతో హిమాచల్ ప్రదేశ్ అతలాకుతలం



**న్యూఢిల్లీ-నవభూమి:** హిమాచల్ ప్రదేశ్‌లో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జన జీవనం అతలాకుతలమైపోతోంది. గత 12 గంటల్లో కురిసిన కుంభవృష్టికి ఏకంగా జీవనం స్తంభించిపోయింది. ఎత్తున ఉన్న ప్రదేశాల్లో హిమపాతం, దిగువన ఉన్న ప్రాంతాల్లో వర్షం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. భారీ హిమపాతం కారణంగా లాహూల్ స్పిటీ, ఛంబా-పంగీ, కిన్నౌర్ జిల్లాలకు మార్గాలు మూసుకుపోయాయి. మిగతా ప్రాంతాల నుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కులూ, కంగ్రా ప్రాంతంలో క్లౌడ్ బర్స్ట్‌కు అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.కిన్నౌ, కులూ, కంగ్రా, చంబా జిల్లాల్లో కొంత మేర ఆస్తి నష్టం జరిగిందని స్థానిక మీడియా పేర్కొంది. ఈ జిల్లాల్లోనే అత్యధిక వర్షపాతం నమోదైందని వెల్లడించింది. భారీ వర్షం కారణంగా కులూ ప్రాంతంలోని వాగులూ, వంకలూ పొంగిపొర్లుతున్నాయి. వాహనాలు బురదలో కూరుకుపోయాయి. భూతన్‌నాత్ బ్రిడ్జి వద్ద ఉన్న భుంటార్ నగర్ మార్కెట్‌లోకి వరద పోటెత్తింది.


# మహారాష్ట్ర సీఎం కార్యాలయంలో బాంబులు



**ముంబై- నవభూమి:** ఇటీవలే మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేకు హత్య బెదిరింపులు వచ్చాయి. ఆయన కారును బాంబుతో పేల్చేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తులు పోలీసులకు ఫోన్ చేయగా.. అప్రమత్తమై చర్యలు చేపట్టారు. ఈ ఘటన జరిగిన వారం రోజులకే నేరుగా ముఖ్యమంత్రినే చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఏకంగా పాకిస్థాన్ నుంచి ఓ వ్యక్తి సీఎం కార్యాలయం సహా పలు ప్రభుత్వ భవనాలను బాంబులు పెట్టి పేల్చేస్తామంటూ వివరించగా.. పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. పెద్ద ఎత్తున భద్రతా చర్యలు చేపడుతూనే.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.ఫిబ్రవరి 20వ తేదీ గురువారం రోజు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను చంపేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తి మెయిల్ చేశాడు. ముంబయిలోని గోరెగావ్ పోలీసులకు మధ్యాహ్నం పూట ఈ మెయిల్ రాగా.. ఆయన కారులో బాంబు పెట్టామని వివరించారు. కాసేపట్లోనే దాన్ని పేల్చబోతున్నట్లు వెల్లడించారు. ఈ ఒక్క స్టేషన్‌కే కాకుండా జేజే మార్గ్ పోలీస్ స్టేషన్, రాష్ట్ర సచివాలయానికి కూడా ఇదే మెయిల్ పంపారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు డిప్యూటీ సీఎం ఎక్కుడన్నారో తెలుసుకని మరీ పరుగులు పెట్టారు. ఆయనకు అసలు విషయాన్ని చెప్పి.. కారులో తనిఖీలు చేపట్టారు. అయితే ఇదో బూటకపు బెదిరింపు అని గుర్తించిన పోలీసులు నిందితుడిని మాత్రం పట్టుకోలేకపోయారు. అయితే తాజాగా మరో బెదిరింపు వచ్చింది. అయితే ఈసారి ఏకంగా మాహారాష్ట్ర ముఖ్యమంత్రినే టార్గెట్ చేసుకున్నారు. పాకిస్థాన్‌కు సంబంధించిన ఓ ఫోన్ నెంబర్ నుంచి శుక్రవారం రోజు ఉదయం.. ముంబయి ట్రాఫిక్ పోలీసులకు వాట్సాప్‌లో బెదిరింపు మెసేజ్ వచ్చింది. అయితే అందులో ముఖ్యమంత్రి కార్యాలయాన్ని పేల్చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. అయితే ఈ మెసేజ్ చేసిన వ్యక్తి పేరు మాలిక్ షాబాజ్ హుమయూన్ రాజాదేవ్‌గా చెప్పాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు సీఎం కార్యాలయంతో పాటు.. దేవేంద్ర ఫడ్నవీస్‌కు సంబంధించిన ప్రత్యేక కార్యాలయం, ప్రభుత్వ భవనాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. దీనిపై కేసు నమోదు

# అమెరికా సెక్స్ కుంభకోణంలో ఇవాంక ట్రంప్ పేరు..

# మతిపోగొడుతున్న కొత్త జాబితా!




**వాషింగ్టన్-నవభూమి:** అగ్రరాజ్యం అమెరికాలో సంచలనం రేపిన సెక్స్ కుంభకోణం గురించి అందరికీ తెలిసిందే. 2005లో వెలుగులోకి వచ్చిన ఈ కుంభకోణంకు సంబంధించిన కీలక పత్రాలను ఆ దేశ జస్టిస్ డిపార్ట్‌మెంట్ తాజాగా విడుదల చేసింది. అందులో ప్రధాన నిందితుడు జెఫ్రీ ఎప్‌స్టీన్ కాంటాక్ట్ లిస్టు జాబితా, ఫ్లైట్‌లాగ్ సమాచారం ఉన్నాయి. అయితే ఇందులో అనేక మంది రాజకీయ, సినిమా ప్రముఖుల పేర్లు ఉండగా అంతా షాక్ అవుతున్నారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాజీ భార్య ఇవానా ట్రంప్, కుమార్తె ఇవాంక ట్రంప్, ప్రముఖ గాయకుడు మైఖేల్ జాక్సన్, నటుడు అలెక్ బాల్డ్‌విన్ వంటి వాళ్లు సైతం ఉన్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.పేద, మధ్య తరగతి బాలికలు, అమ్మాయిలను లక్ష్యంగా పెట్టుకుని.. పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లిస్తూ వారిపై అఘాయిత్యాలకు పాల్పడేవాడు జెఫ్రీ ఎప్‌స్టీన్. ముఖ్యంగా అమెరికాలోని ఫ్లోరిడా, న్యూయార్క్, వర్జిన్ ఐలాండ్స్, మెక్సికోల్లోనే తన నివాసాలకు పిలిపించుకుంటూ జల్సాలు చేసేవాడు. ముఖ్యంగా ముందుగా ఓ అమ్మాయికి డబ్బు ఆశ చూపించి లోబరుచుకుని.. ఆపై మరో అమ్మాయిని తీసుకు వస్తే మరింత కమిషన్ ఇస్తానంటూ చెప్పేవాడు. ఇలా వందలాది మంది ఈ కూపంలోకి దిగారు. అయితే 20 ఏళ్ల పాటు చాలా హాయిగా సాగిన ఈ దారుణం 2005లో వెలుగులోకి వచ్చింది.

విషయం గుర్తించిన పోలీసులు జెఫ్రీ ఎప్‌స్టీన్‌ను అరెస్టు చేసి కొన్ని నెలల పాటు జైల్లోనే ఉంచారు. ఆపై విడుదల కాగా మళ్లీ ఇదే తంతు కొనసాగించాడు. కానీ 2019లో "మీ టూ" ఉద్యమం సాగడంతో అనేక మంది జెఫ్రీ గురించి ఆరోపణలు చేశారు. దీంతో పోలీసులు మరోసారి అతడిని అరెస్ట్ చేశారు. అయితే జైల్లో ఉండగానే జెఫ్రీ అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా.. పోలీసులు దాన్ని ఆత్మహత్యగా గుర్తించారు. ఆ తర్వాత ఇతడి స్నేహితురాలు మాక్స్‌వెల్ కూడా ఈ దారుణంలో పాలు పంచుకున్నారని తెలుసుకుని కోర్టులో హాజరు పర్చగా.. 20 ఏళ్ల జైలు శిక్ష పడింది.ఇదంతా ఇలా ఉండగా.. ఈ కేసుకు సంబంధి అనేక పత్రాలను ఆ దేశ జస్టిస్ డిపార్ట్‌మెంట్ విడుదల చేస్తూ వస్తోంది. ఇప్పటికే అనేక పత్రాలు విడుదల కాగా.. తాజాగా ప్రధాన నిందితుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన కాంటాక్ట్ లిస్టు, ఫ్లైట్ లాగ్ సమాచారాన్ని బయటపెట్టారు. మొత్తం 200 పేజీలు కల్గిన ఈ జాబితాలో ఇంగ్లీష్ రాక్‌బ్యాండ్ రోలింగ్ స్టోన్ సభ్యుడు మైక్ జాగర్, దివంగత పాప్ ఐకాన్ మైఖేల్ జాక్సన్, నటుడు అలెక్ బాల్డ్‌విన్, మాజీ న్యూయార్క్ గవర్నర్ ఆండ్రూ క్యూమో, సూపర్ మోడల్ నవోమి క్యాంప్‌బెల్, సంగీతకారుడు కోర్ట్నీ లవ్ ఉన్నారు.అలాగే అమెరికా ఆరోగ్య శాఖ మంత్రి ఆర్‌ఎఫ్ కెన్నడీ జూనియర్ తల్లి ఎథెల్ కెన్నడీ, కెర్రీ, టెడ్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాజీ భార్య ఇవాన ట్రంప్, కుమార్తె ఇవాంక ట్రంప్ పేర్లు కూడా ఉన్నాయి. అయితే వీరంతా ఎప్‌స్టీన్ కస్టమర్లు కాదని.. కాంటాక్స్ లిస్టులోని పేర్ల జాబితా మాత్రమేనని అధికారులు వివరిస్తున్నారు.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
శనివారం
01 । మార్చి । 2025



## సినీ దర్శకుడు అమీర్ ఖాతాలో డబ్బు జమ చేసిన సాధిక్



చెన్నై-నవభూమి: సినీ దర్శకుడు అమీర్ బ్యాంకు ఖాతాల్లో డ్రగ్స్ అక్రమ రవాణా కేసు నిందితుడైన జాఫర్ సాధిక్ డబ్బులు జమ చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు వారు తగిన ఆధారాలను సేకరించారు. పైగా జాఫర్ సాధిక్ అధికార డీఎంకే నేత కావడంతో ఆయనకు బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని కోర్టుకు ఈడీ తెలిపింది. అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాతో కలిసి జాఫర్ సాధిక్ కొన్నేళ్ళుగా వ్యాపారం చేస్తున్నట్టు గుర్తించారు. అందువల్ల ఆయనకు బెయిల్ మంజూరు చేయవద్దని మద్రాస్ హైకోర్టులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేసింది. డ్రగ్స్ కేసులో సినీ నిర్మాత అయిన జాఫర్ సాధిక్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేయగా, ఆయన ప్రస్తుతం జైలులో ఉన్నారు. ఈ కేసులో బెయిల్ కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈడీ అధికారులు మాత్రం బెయిల్ మంజూరు చేయొద్దని కోరారు.



## మధ్య తరగతి ప్రజల సొంతింటి కల ఫలించేనా?

పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆశల్లో సొంత ఇల్లు అత్యంత ప్రధానమైంది. ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు అనే నానుడి వెనకాల సొంత ఇల్లు పట్ల జనసామాన్యంలో ఉన్న ఆశ వ్యక్తమవుతున్నది. జీవితంలో ఆర్థిక భద్రత, సామాజిక స్థాయి పెరుగుదలకు సొంత ఇల్లు ముఖ్యమనే భావనే ఇందుకు కారణం. ప్రస్తుతం ఇళ్ల ధరలు, భూమి ధరలు చుక్కలనంటుతున్నాయి. మరోవైపు నిర్మాణ వ్యయం కూడా రోజురోజుకీ పెరుగుతున్నది. ఓ పక్క స్థిరాస్తుల మార్కెట్ విలువను ప్రభుత్వాలు పెంచుకుంటూ పోతుండగా, మరోపక్క రిజిస్ట్రేషన్ చార్జీలు భారీగా పెరిగి భారమవుతున్నాయి.

పల్లెలు, చిన్నపాటి పట్టణాల్లో చిన్న ఇంటి నిర్మాణానికి కనీసం టన్ను ఇనుము కావాలి. దానికే రూ.80వేలు ఖర్చు చేయాలి. ఇటుక, సిమెంటు సహా ఇతర నిర్మాణ సామాగ్రి, కూలీల ఖర్చు వెరసి అర కోటి అవుతుంది. నగరాల్లో అయితే కనీసం రూ.కోటి పెడితే తప్ప చిన్న ఇల్లు సాధ్యం కాదు. ఇంత ఖర్చు చేసే శక్తి ఎగువ మధ్యతరగతి ప్రజలకే ఉండడం లేదు. ఇక నిరుపేద, మధ్యతరగతి ప్రజలు సొంతింటి కోసం కల కందామన్నా నిద్ర పట్టని పరిస్థితి ఉంటున్నది. ఉపాధి అవకాశాలు కూడా మృగ్యమవుతున్న నేటి పరిస్థితుల్లో చెమటోడ్చి సంపాదించే దానిలో 50 శాతం వరకూ అద్దె ఇళ్లకు కేటాయించాల్సి వస్తున్నదని చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకునే శ్రమజీవులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల తరుణంలో రాజకీయ పార్టీలు ఓటర్లను తమవైపు తిప్పుకోవడానికి గుప్పిస్తున్న అనేక హామీల్లో పేదలందరికీ సొంత ఇల్లు నిర్మాణం ప్రాధాన్యతను పొందుతున్నది. వారి ఎన్నికల మేనిఫెస్టోల్లో ఇళ్ల హామీ కచ్చితంగా ఉంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవం తరువాత మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి మా అక్క చెల్లెమ్మల ఓట్లు ఏమయ్యాయో అర్థం కావడం లేదంటూ తీవ్రమైన ఆవేదనతో మాట్లాడారు. ఇళ్లు కాదు ఏకంగా ఊళ్లనే నిర్మిస్తామని ఆడంబరంగా, నవరత్నాల్లో భాగంగా రాష్ట్రంలోని 31 లక్షల మహిళలకు వారి పేర్లతో ఇళ్ల పట్టాలు ఇచ్చినా, వారు ఓట్లు ఎందుకు వేయలేదో అనేది ఆయన సందేహం. శాంతంగా ఆలోచిస్తే- పేదల సొంత ఇంటి కలను సాకారం చేసి ఉంటే ఓట్లు పడే ఉండేవి. కానీ ప్రభుత్వ పెద్దల మాటల్లో కనిపించిన నిజాయితీ చేతల్లో కనిపించలేదు. జగనన్న గృహ నిర్మాణ పథకం కింద 30.70 లక్షల ఇళ్ల పట్టాల పంపిణీతో 17 వేల జగనన్న కాలనీల కోసం రూ.55 వేల కోట్లు ఖర్చు పెట్టనున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. అయితే ఇక్కడ జరిగింది వేరు. ఇళ్ల పట్టాల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూసేకరణలోనే అధికార పార్టీ పెద్దలు సుమారు రూ.6,500 కోట్ల అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు అప్పట్లోనే వచ్చాయి. ఇళ్ల స్థలాల కోసం ఎంపిక చేసిన భూములు నివాసయోగ్యం కావనీ తేలిపోయింది. పైగా పట్టణ ప్రాంతంలో సెంటు, పల్లెలో సెంటున్నర స్థలం అనే ప్రకటన లబ్ధిదారుల్లో ఏర్పడిన అసహనానికి ఒక కారణం. పట్టణాల్లో ఇప్పటికే ఉన్న మురికివాడలకు తోడు సెంటు స్థలంలో నిర్మించే ఇళ్లతో మరిన్ని మురికివాడలు రూపొందుతాయనే వాదనా చర్చల్లోకి వచ్చింది. ఎన్ని విమర్శలు వచ్చినా పట్టీపట్టనట్టు వ్యవహరించిన జగన్ ప్రభుత్వం, ఒక కంపెనీతో ఒప్పందం చేసుకుని 18 లక్షల ఇళ్ల నిర్మాణమంటూ హడావిడి చేసింది. ఇప్పటికీ అందులో 70 శాతం వరకూ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. జగనన్న కాలనీల పథకం ప్రారంభంలో ప్రభుత్వమే ఇళ్లను ఉచితంగా నిర్మించి ఇస్తుందని చెప్పిన మాటను క్రమంగా అటకెక్కించారు. నవరత్నాలు-, పేదలకు ఇళ్లు అంటూ ఊదరగొట్టేసిన వైసీపీ పాలనలో ఆ పథకం ఫలితాలివ్వలేదు. ఇంటి స్థలం, అందులోనే పక్కాగృహ నిర్మాణం అంటూ ఆర్భాటం చేసి అమలు విషయంలో చేతులెత్తేశారు. నిర్మాణం కోసం ముందుగా మూడు రకాల ఆప్షన్లు ఇచ్చి చివరికి లబ్ధిదారులే నిర్మాణాలు చేపట్టాలంటూ తొండి చేశారు. లక్షా 80 వేలు ఇస్తాము... మీ తిప్పలేవో మీరే పడండని చేతులు దులుపుకోవడానికి ప్రయత్నించడంతో మొత్తం ఆ ప్రక్రియే అస్తవ్యస్తంగా మారింది. మొండి గోడలు, కంపచెట్లతో జగనన్న కాలనీల కథ ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అనే చందాన ఆగిపోయింది. ప్రభుత్వం తరపున ఇస్తామని చెప్పిన సొమ్ముతో కనీసం పునాదులు కూడా తీసుకోవడం సాధ్యం కాదని గ్రహించిన లబ్ధిదారులు, కనీసం తమకు కేటాయించిన ప్లాట్ల దగ్గరికి కూడా వెళ్లడం మానేసి, తమలో గూడుకట్టుకున్న అసంతృప్తిని ఎన్నికల వేళ చూపించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల తరుణంలో జగన్ ప్రభుత్వంలా కాకుండా పల్లె ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలాన్ని కేటాయించి ఇళ్ల నిర్మాణాలను చేపట్టి పేదల కలల సౌధాన్ని పూర్తి చేస్తామని చెప్పిన మాటలు ఆయా వర్గాల్లో విశ్వాసాన్ని నింపాయి. దీనిపై ప్రభుత్వం ఒక జీవోను విడుదల చేయడం సంతోషించదగ్గ పరిణామమే. ఇది ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుంది. పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లె సీమల్లో మూడు సెంట్లలో ఇంటి నిర్మాణం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ప్రారంభం అవుతుందని అధికార పార్టీ నేతలు అనధికారికంగా అంటున్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం ఇచ్చే రూ.2.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.1.50 లక్షలు కలిపి మొత్తంగా రూ.4 లక్షలతో ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేలా చూడవచ్చన్నది కూటమి ప్రభుత్వ ఆలోచన. జగన్ హయాంలో ఇచ్చిన సెంటు స్థలంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారితో పాటు కేవలం పట్టా పత్రాలే మిగిలిన వారి వరకూ కూటమి హామీ ప్రకారం రెండు, మూడు సెంట్ల భూమి దక్కుతుందనే ఆశతో ఉన్నారు. ఇప్పటికీ ఎటువంటి నిర్మాణాలు ప్రారంభించని వారితో పోల్చితే నిర్మాణ దశలో ఉన్న లబ్ధిదారులను సంతృప్తిపరచడం ప్రభుత్వానికి పెద్ద సవాలే. ఇక గత ప్రభుత్వం లెక్కలను ఆసరాగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేదలు 32 లక్షల మంది వరకే ఉంటారని అనుకుంటే పొరపాటే అవుతుంది. దానికి రెట్టింపు పేద ప్రజలు సొంత గూడు కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొట్టి అలసిపోయి ఉన్నారు. వారంతా ఈ ప్రభుత్వంలోనైనా తమ కలల గూడు సాకారమవుతుందని ఆశగా చూస్తున్నారు. వీటన్నిటికీ మించి జగన్ ఆర్భాటంగా చేపట్టిన హౌసింగ్ స్కీములోని లోపాలను సరిదిద్దడం, జనం నివసించడానికి ఇష్టపడని లే అవుట్లను మార్చడం, సెంటు స్థానంలో రెండు సెంట్ల స్థలం కేటాయింపు ఇవన్నీ జీవోలు విడుదల చేసినంత సులభం కాకపోవచ్చు. జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన మొత్తం వ్యవహారంపై విచారణ జరిపిస్తే, వేల కోట్ల అవినీతి భాగోతం బయటకు వస్తుంది. ఆ నిధులను కక్కించి వినియోగిస్తే మరో 13 లక్షల మందికి సొంతిళ్లు నిర్మించి ఇవ్వవచ్చుననే వాదనా ఉంది. సంక్షేమం ఒక్కటే కాదు అభివృద్ధితో కూడిన సంక్షేమం తమ విధానమంటున్న చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటినీ నిలుపుకోవడం నల్లేరు మీద నడక కాకపోవచ్చు.

# విజ్ఞాన కాంతిపుంజం సి.వి.రామన్



ప్రాయోగిక విజ్ఞానం కేవలం తమకే సాధ్యమని యూరోప్ దేశాలు విర్రవీగుతున్న దశలో బ్రిటీష్ ఇండియాలోని ఒక భారతీయుడు, ఏ అవకాశాలు లేని ఒక మారుమూల గ్రామంలో పుట్టినవాడు, నెలకు పది రూపాయల జీతంతో జీవితం వెళ్ళబోస్తున్న ఒక కాలేజి ట్యూటర్ కుమారుడు స్వయంశక్తితో కాకలుతీరిన శాస్త్రజ్ఞుడిగా తయారై, నోబెల్ బహుమతి సాధించి, దేశంలో అనేక పరిశోధనా సంస్థలు స్థాపించి, సర్వస్వం దేశానికి అర్పించగలగడం కేవలం చంద్రశేఖర్ వెంకట రామన్ వంటి అద్భుత వ్యక్తులకు మాత్రమే సాధ్యపడుతుంది. తమిళనాడులో తిరుచునాపల్లి సమీపంలో 1888 నవంబర్ 7న పుట్టిన సి.వి.రామన్ కుటుంబం అతని బాల్యంలో విశాఖపట్నానికి చేరింది. రామన్ చదువుకునే పాఠశాల సముద్ర తీరాన ఉండేది. తరగతి గదిలోంచి చూస్తే, లేచి పడే సముద్ర కెరటాలు కనిపిస్తూ ఉండేవి. బాల్యంలో రామన్ సముద్రాన్ని తదేకంగా చూస్తూ ఉండేవాడు. అలా సి.వి.రామన్ బాల్య దశలో విశాఖ సముద్రం ఎంతగానో ప్రభావితం చేసింది.


సి.వి. రామన్ తన పదకొండవ యేట మెట్రిక్యులేషన్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో చేరాడు. అప్పుడక్కడ పనిచేసే యూరోపియన్ ప్రొఫెసర్లంతా ఈ కుర్రవాడు పొరపాటున తమ క్లాసుకు వచ్చాడేమోనని భావించేవారు. ఆ తర్వాత ఆయన తన పద్దెనిమిదోయేట లండన్ నుండి వెలువడే 'ద ఫిలసాఫికల్ మేగజైన్' (1906)లో పరిశోధనా పత్రాలు ప్రచురించాడు. అప్పటికి ఆయన పి.జి (యం.ఎ) విద్యార్థి. తనకు ఇష్టమైన భౌతిక శాస్త్రంలో పరిశోధనలు చేస్తూ, వెలుగు కిరణాల్ని కొలుస్తూ ఉండేవాడు. ప్రొఫెసర్ ఆర్.ఎన్. జోన్స్ రామన్ ప్రశ్నలకు సమాధానాలివ్వలేక -నేచర్, ఫిలసాఫికల్ మేగజైన్ వంటి పత్రికలకు రామన్‌తో వ్యాసాలు రాయించి పంపిస్తూ ఉండేవాడు. ఒక రకంగా తొలి దశలో రామన్‌కు ఆయన 'గైడ్'గా ఉపయోగపడ్డాడు.

రామన్‌ది మామూలు కుటుంబం. ఉద్యోగం చేయడం తప్పనిసరైన పరిస్థితి. బ్రిటీష్ గవర్నమెంట్ వారి ఫైనాన్స్ సర్వీసులో చేరాడు. పెద్ద జీతం, బంగళా వంటివి అమిరాయి. అప్పుడే లోకసుందరి అమ్మాళ్‌తో వివాహమైంది. 1907లో రామన్ ఉద్యోగం కలకత్తాకు మారింది. అక్కడికి చేరుకున్న మొదటి వారంలోనే ఆయన ట్రామ్‌లో ప్రయాణిస్తూ బౌ బజార్ స్ట్రీట్‌లో ఒక బోర్డు (ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది కల్టివేషన్ ఆఫ్ సైన్స్) చూశాడు. ఆ సాయంత్రమే అక్కడికి వెళ్ళి వివరాలు తెలుసుకున్నాడు - డాక్టర్ మహేంద్రలాల్ సర్కార్ 1876లో ఆ అసోసియేషన్ స్థాపించి, భారతీయ శాస్త్రవేత్తలు జాతీయాభిమానంతో దేశంలోనే పరిశోధనలు సాగించాలన్న మహదాశయాన్ని ప్రచారం చేస్తున్నాడు. ఆ విషయం తెలుసుకుని సి.వి. రామన్ వెంటనే అందులో చేరిపోయాడు. అంతేకాదు, నోబెల్ బహుమతికి అర్హత సంపాదించగలిగే స్థాయి పరిశోధనలు కొన్నేళ్లలోనే అక్కడ చేయగలిగాడు. ఒకవైపు ఆర్థిక శాఖలో ఉద్యోగం చేస్తూ, మరోవైపు భౌతికశాస్త్రంలో పరిశోధనలు చేయడం ఎంత కష్టం? క్రమశిక్షణ, పట్టుదల, దీక్ష, అన్నీ రామన్‌కు ఉన్నాయి గనకనే - ఇతరులకు అసాధ్యమనిపించినవి సాధ్యమేనని ఆయన రుజువు చేసి చూపాడు.

ఒక దశలో టైగర్ ఆఫ్ బెంగాల్ అశుతోష్ ముఖర్జీ కలకత్తా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు, బ్రిటీష్ ప్రభుత్వంతో మధ్యవర్తిత్వం నెరపి, పరిశోధనల నిమిత్తం సి.వి.రామన్‌కు రెండేళ్ల సెలవు ఇవ్వాల్సిందిగా కోరాడు. ఈ భారతీయుడి పరిశోధనలపై బ్రిటీష్ ప్రభుత్వానికి నమ్మకం కలగలేదు. ఆ అభ్యర్థనను తోసిపుచ్చి, వీలు కాదని చెప్పింది. చివరకు అశుతోష్ ముఖర్జీ నిబంధనల్ని కొద్దిగా సడలించి సి.వి.రామన్‌ను ఎలిల్ ఛైర్ ఆఫ్ ఫిజిక్స్‌కు ఎన్నుకున్నాడు. అది 1917వ సంవత్సరం. చూస్తూ చూస్తూ పెద్ద ఉద్యోగం, హోదా, దాబు, వసతులు అన్నీ వదులుకుని, ఒక చిన్న ఉద్యోగానికి రావడం అందరూ చేయగల పని కాదు. ఆయనలోని వైజ్ఞానిక జిజ్ఞాస, నిబద్ధత, ధ్యేయం అన్నీ కలిసి ఆయనను ఆ పనికి ఉసిగొల్పాయి. ఒకవైపు విశ్వవిద్యాలయంలో బోధన, మరోవైపు పరిశోధనల మధ్య ఆయన జీవితం ఆ కాలంలో ఊపిరి సలపకుండా సాగింది. తన జీవిత సహచరి సహాయ సహకారాలతో, రామన్-వైజ్ఞానిక శిఖరాలను అధిరోహించి, ఈ దేశపు జెండాను దిగ్విజయంగా ఎగరేశాడు. జీవితంలో ఏదైనా సాధించాలనుకుంటే, ఎన్నింటినో వదులుకోక తప్పదు-అన్న విషయం రామన్ జీవితం స్పష్టం చేసింది. 'రామన్ ఎఫెక్ట్' వెలుగులోకి వచ్చిన పదేళ్ళలో ప్రపంచంలో సుమారు రెండు వేల పైచిలుకు పరిశోధనా పత్రాలు అదేవిషయాన్ని ధ్రువపరిచాయి. ఆప్టిక్స్‌కు సి.వి.రామనే ఆద్యుడు. 'సైకాలజీ ఆఫ్ విజన్'ను మొదట అధ్యయనం చేసిందీ ఆయనే. ఇలా వైజ్ఞానిక రంగంలో ఎన్నో శాఖలకు ఆయన బీజం వేశాడు. అందుకే భారత ప్రభుత్వం 'భారత రత్న'తో గౌరవించుకున్న తొలి శాస్త్రవేత్త కూడా ఆయనే అయ్యారు!

'రామన్ ఎఫెక్ట్' పేరుతో 1928 ఫిబ్రవరి 28న సి.వి.రామన్ తన పరిశోధనల్ని ప్రతిపాదించారు. ఆ రోజును గుర్తు చేసుకుంటూ-దేశ ప్రజలలో వైజ్ఞానిక స్ఫూర్తిని నింపడానికి అదే ఫిబ్రవరి 28ని మనం జాతీయ వైజ్ఞానిక దినంగా జరుపుకుంటున్నాం. అయితే సర్ సి.వి.రామన్‌కు నోబెల్ పురస్కార ప్రదానం 1930లో జరిగింది. ఇది మన భారత దేశానికే కాదు, మొత్తం ఆసియా ఖండానికే తొలి నోబెల్ బహుమతి అయ్యింది.

# విద్యారంగం సంస్కరణలు లేవా?



ముక్కుసూటితనం కలిగిన మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఆధ్వర్యంలో తెలంగాణ విద్యా కమిషన్ ఏర్పడినప్పుడు తెలంగాణ విద్యాభిమానుల్లో ఒక భరోసా ఏర్పడింది. తెలంగాణ విద్యావ్యవస్థ, ముఖ్యంగా ప్రభుత్వరంగ పాఠశాల వ్యవస్థలో మౌలిక మార్పులు చూడవచ్చుననే ఆశలు కనిపించాయి. తీరా కొన్ని నెలలు తర్వాత తెలంగాణా విద్యా కమిషన్ అందజేసిన నివేదిక సారాంశం చూస్తే ఉన్న సమస్యలు తాత్కాలికంగా సరిదిద్దే విధంగా సిఫారసులు ఉన్నాయే తప్ప మొత్తం విద్యారంగం సంస్కరణ దిశగా లేవు.

మధ్యాహ్న భోజనం మెనూ, బిల్లులను వారం వారం చెల్లింపు, రెసిడెన్షియల్ పాఠశాలలలో స్నాక్స్ సిఫారసుతో పాటు, ప్రైవేటు విద్యా సంస్థలకు సంబంధించిన ఫీజుల నియంత్రణ, వాటి అమలుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీల ఏర్పాటు వరకు కమిషన్ సిఫారసు చేసింది. అంటే%-% ఉన్న సమస్యల్లో తక్షణ సమస్యకు పరిష్కారం చూపిందే తప్ప, కీలకమైన నిర్ణయాల జోలికి వెళ్ళలేదని అర్థమవుతూంది. ప్రభుత్వ విద్యాసంస్థల పనితీరు మెరుగుపర్చడంబీ ప్రభుత్వ పాఠశాలలలో ఎన్‌రోల్మెంట్ ప్రక్రియబీ అనేక రకాల యాజమాన్యాల కింద ఉన్న పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు ఒకే క్యాచ్‌మెంట్ ఏరియాకు తేవడంబీ విద్యాహక్కు చట్టం అమలుబీ పరీక్ష విధానంబీ తెలంగాణలో అడుగంటుతున్న విద్యా ప్రమాణాలుబీ వెనుకబడిన విద్యార్థుల విద్యాబోధన... ఇలాంటి కీలక నిర్ణయాల జోలికి వెళ్ళాలనే ప్రయత్నం చేసినట్లు లేదు.

మధ్యాహ్న భోజనం విషయంలో కమిషన్ సిఫారసు కొత్తదేమీ కాదు! అనేక ఏళ్ళుగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీలు చేస్తున్న డిమాండ్లనే కమిషన్ ప్రభుత్వానికి సూచనగా నివేదించింది. ఇక ప్రైవేటు విద్యా సంస్థలలో ట్యూషన్ ఫీజులు తప్ప ఇతరత్రా పీజులు వసూలు చేయకుండా నియంత్రించేందుకు రాష్ట్ర స్థాయిలోనూ జిల్లా స్థాయిలోనూ కమిటీలు వేయాలన్న సూచన, దాన్ని అమలుపరిచే యంత్రాంగ సూచన కూడా అరకొర సంస్కరణ రూపం గానే ఉంది. మళ్ళీ ప్రైవేటు విద్యా వ్యవస్థ నియంత్రణ కమిటీలు అని చెప్పి నామినేటెడ్ పదవుల పందేరం జరిగి, ప్రైవేటు స్కూల్ అనుయాయులకే ఈ పదవులు కట్టబెడితే ఆ సిఫారసు మూలంగా ప్రభుత్వానికి గానీ, ప్రజలకు గానీ ఒరిగేదేమీ ఉండదు. ప్రైవేటు విద్యాసంస్థల్లో భాగస్వామ్యం లేని విద్యారంగ ప్రముఖులు, సామాజిక సేవకులతో రాజకీయాలకు అతీతంగా ఈ కమిటీలు వేసినప్పుడు మాత్రమే కమిషన్ సిఫారసులు ఎంతోకొంత సజావుగా అమలు జరిగే అవకాశం ఉంది. వీటన్నింటికి మించి సమగ్ర శిక్షా అభియాన్ క్యాచ్‌మెంట్ ఏరియాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను అన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చి ఆయా ఆవాస ప్రాంతాలలో ఉన్న ప్రైవేటు పాఠశాల రవాణా సౌకర్యాలు నిషేధిస్తే తప్ప విద్యావ్యవస్థ పూర్తి సంస్కరణ దిశగా పయనించదు. ఇకపోతే గ్రామీణ ప్రాంతాల్లో ఎకరాలకు ఎకరాల విలువైన స్థలాలు, పాఠశాల భవనాలు ఉన్నప్పటికీ సరైన సంఖ్యలో విద్యార్థుల నమోదు లేదు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్న గురుకులాలలో సరైన బోధనా సిబ్బంది లేదు. తెలంగాణ విద్యా కమిషన్ ఈ రెండు వ్యవస్థలలో సమతౌల్యం కాపాడే సిఫారసులు చేస్తే బావుండేది. అనేక ఏండ్లుగా విద్యా బాధ్యతల నుండి వైదొలగుతూ వచ్చిన పాలకులు ప్రభుత్వ విద్యావ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ప్రైవేటు విద్యా వ్యవస్థను ప్రోత్సహించారు. దాని అత్యున్నత రూపమే ఫీజు రీయింబర్స్‌మెంట్. ఇప్పటికే ఉచితాల ఊబిలో లక్షల కోట్లు అప్పు చేసిన పాలకులు ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కూడా అనేక ఏళ్ళుగా పెండింగ్‌లో పెట్టడంతో ఇంటర్మీడియట్ స్థాయి నుండి పీజీ స్థాయి వరకు ప్రైవేటు విద్యా వ్యవస్థ తెలంగాణా రాష్ట్రంలో కుప్పకూలింది. ఇక విద్యార్థులకు ఇచ్చే ఫీజు రీయింబర్సమెంట్‌నే ప్రభుత్వ కళాశాలలకు గ్రాంట్లుగా ఇవ్వగలిగితే ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలు పూర్వ వైభవం సంతరించుకొనే అవకాశం ఉంది. తెలంగాణా విద్యా కమిషన్ ఇటీవల కార్పోరేట్ పాఠశాలల్లో పెరుగుతున్న విద్యార్థుల బలవన్మరణాలు గురించి పరిశోధించాల్సిన అవసరం ఉంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో మరో దారుణమైన స్థితి ఏమంటే%-% ప్రభుత్వం సరైన నిర్మాణం లేని ఇంజనీరింగ్ కళాశాలల బిల్డింగులను అద్దెకు తీసుకుని గురుకులాల పేరుతో లక్షలాది రూపాయలను అద్దెల రూపంలో ఈ బిల్డింగ్ యజమానులకు ప్రతి నెలా చెల్లిస్తున్నది. దీనికి బదులు విశాలమైన స్థలం, ప్రాంగణాలు, బిల్డింగ్ సౌకర్యాలు పూర్తిగా ఉన్న, పెద్దగా పిల్లలు లేని సమీప ప్రభుత్వ పాఠశాల భవనాల లోనికి ఈ గురుకుల పాఠశాలలను మార్చి భారం దించుకోవచ్చు గదా? ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న వేలాది పాఠశాలలు విద్యార్థులు లేక వెలవెలపోతున్నాయి. వాటిని బలోపేతం చేయకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఏకలవ్య, నవోదయ, సైనిక, స్పోర్ట్స్ ఇలా ఓ ఇరవై రకాల పాఠశాల వ్యవస్థలను వివిధ పేర్లతో పెంచి పోషించడం ఎందుకు? ఈ అన్నిరకాల పాఠశాలల్లో ఒకే రకమైన సిలబస్ అయినప్పుడు విద్యకు కుల మతాల రంగులు అవసరమా?



"ఒక దేశ భవిష్యత్ తరగతి గదిలో రూపుదిద్దుకుంటుంది" అన్న రజనీ కోఠారీ మాటల్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకొని, ఆ దిశగా విద్యా రంగంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనలు గాని, తెలంగాణా విద్యా కమిషన్ సిఫారసులు గానీ ఉండాలని ఆకాంక్షిద్దాం.

## మనసును లొంగదీసుకోవాలి

భక్తి




ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించడం చాలా కష్టం అనే అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. అయితే అలా ఆలోచించే వ్యక్తులకు 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు భరోసా ఇస్తూ... కర్మ యోగంలో చిన్న ప్రయత్నాలే పెద్ద ప్రతిఫలాలను ఇస్తాయని చెప్పాడు. తగినంత (యుక్తమైన) ఆహారం, విశ్రాంతి, నిద్ర కలిగి ఉండి, యుక్తమైన కర్మలు చేస్తూ, జాగ్రదావస్థలో ఉండే వ్యక్తి... దుఃఖాలన్నిటినీ నాశనం చేసేది యోగమేనని తెలుసుకుంటాడని పేర్కొన్నాడు. ఆయన చెప్పిన ప్రకారం... 'యోగ' లేదా ఆధ్యాత్మిక మార్గం ఆకలి వేసినప్పుడు ఆహారం తినడం, పని చేయాల్సి వచ్చినప్పుడు చెయ్యడం, నిద్రపోవడం లేదా విశ్రాంతి తీసుకోవడం, పని అవసరమైనప్పుడు వివిధ పనులు చేయడం అంతటి సరళమైనది.

ఒక శిశువుకు వయోధికులకన్నా ఎక్కువ నిద్ర కావాలి. మన ఆహారపు అవసరాలు రోజులో మనం చేసే శారీరక శ్రమ మీద ఆధారపడి ఉండొచ్చు. 'యుక్తమైన' అనే మాట... 'ఆ క్షణంలో తెలుసుకోదగినది' అనే అర్థాన్ని సూచిస్తుంది. భగవద్గీతలో అంతకుముందు పరిమిత చర్య, నిర్దేశిత విధులు లేదా తప్పనిసరి చర్యలుగా వీటి గురించి శ్రీకృష్ణుడు ప్రస్తావించాడు. దీనికి విరుద్ధంగా, మన మనస్సులు సాధారణ వాస్తవాలను సాగదీస్తూ, వాటి చుట్టూ సంక్లిష్టమైన కథనాలను అల్లడం కోసం మన ఊహలను జోడిస్తాయి. మనకు మనం చెప్పుకొనే ఈ కథలు వేరొకరిని కథానాయకులుగానో, ప్రతి నాయకులుగానో చేస్తాయి, పరిస్థితులను ఆహ్లాదకరంగానో, దుర్భరంగానో మారుస్తాయి. ఈ కథలే మన మాటలను, ప్రవర్తనను శాసిస్తాయి. అందుకే అన్ని కోరికలతో అనుబంధాన్ని వదిలిపెట్టి, ఈ కథలను చెప్పే మనసును లొంగ దీసుకోవాలని శ్రీకృష్ణుడు చెప్పాడు. గాలి లేని ప్రదేశంలో కంపించకుండా ఉన్న దీపం మాదిరిగా... ఆత్మతో ఐక్యతను అభ్యాసం చేస్తున్న, నిగ్రహంతో ఉన్న యోగి మనసు చలించదని ఆయన స్పష్టం చేశాడు. శ్రీకృష్ణుడు ఇంతకు ముందు తాబేలు, నదులు, సముద్రం లాంటి ఉదాహరణలు ఇచ్చాడు. నదులు సముద్రంలోకి ప్రవేశించిన తర్వాత వాటి ఉనికిని కోల్పోతాయి, అనేక నదులు ప్రవేశించిన తనతో తర్వాత కూడా సముద్రం ప్రశాంతంగా ఉంటుంది. అదేవిధంగా, సముద్రంలా స్థిరంగా ఉన్న యోగి మనస్సులో కోరికలు ప్రవేశించినప్పుడు... అవి వాటి ఉనికిని కోల్పోతాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
హైదరాబాద్
5
శనివారం
01 । మార్చి । 2025

## సెంటుతో చేటు




ఇంటి నుంచి బయటికి అడుగెయ్యాలంటే.. ఒంటికి సెంటు కొట్టాల్సిందే. చెమట వాసన రావొద్దన్నా, శరీరం సువాసనలు వెదజల్లాలన్నా.. బాడీ మొత్తం 'బాడీ స్ప్రే' చేసుకోవాల్సిందే! శరీరమే కాదు.. గది కూడా కమ్మటి వాసనలతో నిండిపోవాలని రూమ్ స్ప్రేలూ వాడేస్తున్నారు. ఈ సువాసనలు మనసుకు హాయినిస్తాయి. కానీ, ఆరోగ్యానికి చేటు తెస్తాయి. ఇప్పుడొస్తున్న అనేక రకాల పర్‌ఫ్యూమ్స్, రూమ్ ఫ్రెష్‌నర్ల తయారీలో ప్రమాదకర రసాయనాలను వాడుతున్నారు. విభిన్నమైన సువాసనల కోసం, అవి ఎక్కువ సమయంపాటు తాజాగా ఉండటం కోసం.. బెంజీన్, ట్కస్టెరిన్, ఫార్మాల్డిహైడ్, థాలేట్స్, వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్ లాంటివి విరివిగా కలిపేస్తున్నారు. ఈ రసాయన సమ్మేళనాలు శ్వాసకోశ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయి. కొన్ని చర్మానికి హాని చేస్తే.. మరికొన్ని క్యాన్సర్‌కు దారితీస్తాయి.

**బెంజీన్:** బాడీ స్ప్రే సువాసనలు ఎక్కువ సమయంపాటు శరీరంపై ఉండేందుకు 'బెంజీన్' అనే రసాయనాన్ని వాడతారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే బెంజీన్‌ను 'కార్సినోజెన్'గా ప్రకటించింది. అంటే.. దీనిని దీర్ఘకాలంపాటు వాడితే క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.

# ఒంటరిగా శ్రమించి గంగమ్మనే తన ఇంటికి తెచ్చారు





మహాకుంభ మేళాకు వెళ్లి గంగలో మునకేయాలనేది ఆమె కోరిక. ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు. కానీ... ఒంటరిగా శ్రమించి గంగమ్మనే తన ఇంటికి తెచ్చారు. మహాసంకల్పంతో పెరట్లో బావిని తవ్వి... మహాశివరాత్రినాడు అందులో పవిత్ర స్నానం ఆచరించేందుకు సిద్ధమయ్యారు యాభై ఏడేళ్ల కర్ణాటక మహిళ... గౌరీచంద్రశేఖర్. గంగమ్మను భువికి తెచ్చిన గౌరమ్మ కథ ఇది.

'ప్రయాగరాజ్ మహాకుంభ మేళాకు వెళ్లాలంటే అదృష్టం ఉండాలి. నాకు అంతటి అదృష్టం లేదు. కారణం... నా ఆర్థిక పరిస్థితి. అందుకే ఆ గంగమ్మనే ఇక్కడకు తేవాలనుకున్నాను. దాని కోసం మా ఇంటి వెనుక భావి తవ్వాలని నిర్ణయించుకున్నాను' అంటున్న గౌరీది కర్ణాటక రాష్ట్రం ఉత్తర కన్నడ జిల్లా సిర్సీ గ్రామం. అక్కడ ఆమెకు చిన్నపాటి వ్యవసాయ క్షేత్రం ఉంది. దానిపై వచ్చే ఆదాయంతో ఇల్లు గడవడమే కష్టమైపోవడంతో కొబ్బరి తోటలో కూలి పనికి వెళుతున్నారు. గౌరీకి మహాకుంభమేళ గురించి గత ఏడాది డిసెంబరులో తెలిసింది. ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లి త్రివేణి సంగమంలో మునగాలని తొలుత భావించారు. అయితే ఖర్చుల లెక్కలు వేసుకొంటే అది తనవల్ల అయ్యే పని కాదని తెలిసి, ప్రయాణం విరమించుకున్నారు. అలాగని అంతటితో వదిలేయలేదు. గంగ దగ్గరకు తను వెళ్లలేకపోవచ్చు. కానీ ఆ గంగనే తన ఇంటికి రప్పించి తన కోరిక నెరవేర్చుకోవాలని అనుకున్నారు. వెంటనే రంగంలోకి దిగారు. డిసెంబరు 15న బావి తవ్వడం ప్రారంభించారు. రోజుకు ఎనిమిది గంటల చొప్పున శ్రమించారు. తవ్వడం, తవ్విన మట్టిని బయటకు తోడేయడం... వేరొకరి సాయం లేకుండా అన్నీ తానే చేసుకున్నారు. రెండు నెలలు కష్టపడి... 40 అడుగుల లోతు వరకు తవ్వారు. చివరకు ఈ నెల 15న పని పూర్తి చేసి, భువి నుంచి గంగమ్మను పరవళ్లు తొక్కించారు.

'మహాశివరాత్రి పర్వదినాన ఈ గంగలో పవిత్ర స్నానం చేస్తాను' అంటూ ఎంతో ఉద్వేగంగా చెప్పారు గౌరీ. ఎవరి సాయం లేకుండా బావులు తవ్వడం ఆమెకు ఇదే మొదటిసారి కాదు. గతంలో మూడు బావులు తవ్వారు. ఒకటి సాగు కోసం... తన వ్యవసాయ క్షేత్రంలో. మరొకటి తన గ్రామంలో... ప్రజల దప్పిక తీర్చడానికి. మూడోది అంగన్‌వాడీ పాఠశాలలో... విద్యార్థుల కోసం.

**ప్రతిఘటనలు తిప్పికొట్టి...**

విద్యార్థులు, టీచర్ల కోసం అంగన్‌వాడీ స్కూల్‌లో బావి తవ్వే క్రమంలో ఆమెకు జిల్లా అధికారుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఇక్కడ అందుకు అనుమతి లేదని, తక్షణమే పనులు ఆపేయాలని డిప్యూటీ కమిషనర్ ఆదేశించారు. బావి తవ్వకం ప్రారంభ సమయంలో వచ్చి, గౌరీని అభినందించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఆ తరువాత అభ్యంతరం వ్యక్తం చేశారు. తవ్వడానికి వీల్లేదని మాట మార్చారు. కానీ గౌరీ ఇవేవీ పట్టించుకోలేదు. నలుగురికీ ఉపయోగపడే ఒక మంచి పని కోసం వెనకడుగు వేసేది లేదని ఆమె తేల్చి చెప్పారు. అప్పటి స్థానిక
ఎంపీ అనంత్‌కుమార్ హెగ్డే మద్దతుతో 45 అడుగుల లోతు వరకు తవ్వి, బావి పూర్తి చేశారు. అందులో నీటి ఊట చూశాక తన మనసు ఆనందంతో ఉప్పొంగిందంటారు గౌరీ. సమాజం కోసం ఆమె చేస్తున్న అలుపెరుగని కృషికి ప్రజలు, ప్రభుత్వం, పలు సంస్థల నుంచి ఎన్నో ప్రశంసలు, అభినందనలు, గౌరవ సత్కారాలు అందుకున్నారు.

# గజ్జె ఘల్లుమన్నది

**వెండి వెలుగులు: మువ్వల పట్టీలు అనగానే కళ్లముందు వెండి పట్టీలే మెదులుతాయి. అయితే తాజాగా పాత కాలంనాటి వెడల్పాటి పట్టీల ట్రెండ్ మళ్లీ పునరావృతమైంది. కాబట్టి ఒకటిన్నర అంగుళం వెడల్పు ఉండే పట్టీలు ఎంచుకోవాలి. ఆక్సిడైజ్ చేసినవైనా, చేయనివైనా ఫరవాలేదు. మరింత ఆకర్షణీయంగా కనిపించడం కోసం ఎనామిల్ లేదా రాళ్లు పొదిగిన పట్టీలు ఎంచుకుంటే చాలు!**

**ఆధునిక అలంకరణ:** ఆధునిక వస్త్రధారణకు కాలి పట్టీల అలంకరణ నప్పదేమో అనుకోవలసిన అవసరం లేదు. ఇలాంటి దుస్తులకు నప్పేలా 'సింగిల్ చైన్ యాంక్లెట్స్' కూడా తయారవుతున్నాయి. సన్నగా, మెరుపులీనే నగిషీలతో కూడిన ఈ రకం పట్టీలు ఎంతో సొగసుగా కనిపిస్తాయి. 10 నుంచి 25 గ్రాముల బరువులో దొరికే ఈ పట్టీలు కొనేటప్పుడు లింకులు బలంగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలి. అలాగే రెండు చివర్లు కలిపే కొక్కెం ధృడంగా ఉండేలా చూసుకోవాలి.

**ముత్యాల పట్టీలు:** మధ్యస్తంగా ఉండే ముత్యాలతో తయారయ్యే ఈ రకం కాలి పట్టీలు నేటి తరం అమ్మాయిలకు చక్కగా నప్పుతాయి. ముత్యాల మధ్యలో వెండి లేదా బంగారంతో తయారైన గుండ్లు జోడించి తయారుచేసే ఈ పట్టీలు అటు సంప్రదాయ వేడుకలకూ, ఇటు ఆధునిక విందు వినోదాల్లో ధరించడానికి అనువుగా ఉంటాయి.









# గంజి తాగుదాం..!



గంజి సహజ ఔషధమని నిపుణులు చెబుతున్నారు. దీనిని తాగడంవల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

గంజిలో కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉంటాయి. వ్యాయామం చేసిన తరవాత, నీరసంగా అనిపించినప్పుడు ఒక గ్లాసు గంజి తాగితే తక్షణ శక్తి లభిస్తుంది.

ప్రతిరోజూ గంజి తాగడంవల్ల జీర్ణ వ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. మలబద్ధకం దూరమవుతుంది. పొట్ట సమస్యలు రావు.

వేసవికాలంలో తరచూ గంజి తాగుతూ ఉంటే వడదెబ్బ తగలదు. ఒక గ్లాసు గంజిలో చిటికెడు ఉప్పు, కొద్దిగా నిమ్మరసం కలుపుకుని తాగితే శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. డయేరియాను నిరోధిస్తుంది.

గంజిలో బి 1, బి 2, బి 6 విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్ ఉంటాయి. ఇవి జీవక్రియలను వేగవంతం చేయడంతోపాటు మెదడు పనితీరుని క్రమబద్ధీకరిస్తాయి.

గంజి తాగడం వల్ల చర్మానికి తేమ అంది ఆరోగ్యంగా కనిపిస్తుంది. మొటిమలు, గుల్లలు రాకుండా ఉంటాయి. శిరోజాలు చక్కగా పెరుగుతాయి.

గంజిలో ఉండే పోటాషియం శరీరంలో సోడియం స్థాయిని నియంత్రిస్తుంది. దీనివల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. గుండె ఆరోగ్యంగా పనిచేస్తుంది.

గంజిలో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, అమైనో ఆమ్లాలు అధికంగా ఉంటాయి. అనారోగ్యంతో ఉన్నప్పుడు గంజి తాగితే రోగనిరోధక శక్తి మెరుగవుతుంది.



# మనకొద్దీ మోనోడైట్ బరువు

బరువు తగ్గాలనుకునేవాళ్లు రకరకాల డైట్ ప్లాన్‌లు ఫాలో అవుతుంటారు. పక్షం రోజులు పని గట్టుకొని కడుపు మాడ్చుకుంటారు. లాభం లేదనుకొని మళ్లీ వెనక్కి తగ్గుతారు. కానీ, వెయిట్ లాస్ కోసం తహతహలాడుతున్న వారికోసం ఇప్పుడు నయా ట్రెండ్ ఒకటి పరిచయమైంది. అదే మోనో డైట్. ఈ విధానంలో రోజంతా గానీ, ఒక భోజనంలో గానీ ఒకే రకమైన ఆహారం తీసుకోవడమే మోనో డైట్ సూత్రం. ఉదాహరణకు ఒక రోజు కేవలం అరటిపళ్లు మాత్రమే ఆరగించాలి. ఇంకోరోజు కేవలం గుడ్డు వెరైటీలపై ఆధారపడాలి. ఇలా చేయడం వల్ల సులువుగా బరువు తగ్గొచ్చని కొందరు చెబుతున్నారు. హాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు చాలామంది సెలెబ్రిటీలు దీన్ని ఫాలో అవుతున్నారు. ఆ స్టార్లను అభిమానించే వాళ్లు సైతం ఈ విధానానికి జై కొడుతున్నారు. ఈ పద్ధతిలో బరువు తగ్గడం సాధ్యమేనా అంటే.. భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

**కీడే ఎక్కువ**

మొదట్లో బరువు తగ్గినట్టు అనిపించినా, మోనోడైట్ వల్ల నష్టాలే ఎక్కువ అంటున్నారు పోషకాహార నిపుణులు. 'ఈ డైట్ వల్ల శరీరానికి కావాల్సిన అన్ని పోషకాలూ అందవు. ఫలితంగా దీర్ఘకాలంలో పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి' అని హెచ్చరిస్తున్నారు. అంతేకాదు, మోనోడైట్ వల్ల శరీర మెటబాలిజం మందగిస్తుంది. సరైన ప్రొటీన్లు, ఫైబర్ లేని ఆహారం వల్ల కండరాల శక్తి తగ్గుతుంది. బరువు తగ్గడం మాట అటుంచితే.. జీవక్రియలు పట్టు తప్పే ప్రమాదం ఉందంటున్నారు. పైగా, ఈ తరహా డైట్‌ను మొదట్లో ఉత్సాహంగా పాటించినా.. పోనుపోనూ బోర్ కొట్టేస్తుంది. ఇలాంటి షరతులతో కూడిన డైట్ దీర్ఘకాలం కొనసాగించడం సాధ్యం కాదంటున్నారు నిపుణులు. మొండిగా పాటించినా.. మోనోడైట్ వల్ల ప్రయోజనాల కన్నా దుష్పరిణామాలే ఎక్కువని వాళ్లు తేల్చి చెబుతున్నారు.

**కొవ్వు కరగదు**

కొన్ని రోజులపాటు ఈ డైట్ ఫాలో అయితే బరువు తగ్గినట్టు అనిపించవచ్చు. కానీ, ఇది ఎక్కువగా శరీరంలో నీటిని తగ్గిస్తుందే కానీ, కొవ్వును కరిగించదని నిపుణులు చెబుతున్నారు. మళ్లీ రెగ్యులర్ డైట్‌కు మళ్లినప్పుడు మరింత బరువు పెరిగే ప్రమాదం ఉంటుందని అంటున్నారు. కాబట్టి, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, తగినంత శారీరక శ్రమ చేస్తుంటే.. క్రమపద్ధతిలో బరువు తగ్గే అవకాశం ఉంటుంది. అందువల్ల, మోనోడైట్‌కు బదులుగా పోషకాలన్నీ సమతులంగా ఉండే






# దలాల్ స్ట్రీట్‌పై ట్రంప్ సుంకాల హెచ్చరికల దెబ్బ..



**న్యూఢిల్లీ-నవభూమి:**బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ 1,414.33 పాయింట్లు (1.90 శాతం) నష్టపోయి 73,198.10 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 1,471.16 పాయింట్లు (1.97 శాతం) పతనంతో 73,141.27 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది. మరోవైపు ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ వరుసగా ఎనిమిదో రోజు నష్టాలను చవి చూసింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ ట్రేడింగ్ ముగిసే సమయానికి 420.35 పాయింట్లు (1.86 శాతం) నష్టపోయి 22,124.70 పాయింట్ల వద్ద స్థిర పడింది. గతేడాది సెప్టెంబర్ 27న జీవిత కాల గరిష్ట స్థాయి 85,978.25 పాయింట్లను తాకిన సెన్సెక్స్.. నాటి నుంచి ఇప్పటి వరకూ 12,780.15 పాయింట్లు (14.86శాతం) నష్టపోయింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ గత సెప్టెంబర్ 27న జీవిత కాల గరిష్టం 26,277.35 పాయింట్లకు చేరుకుంది. నాటి నుంచి ఇప్పటి వరకూ 4,152.65 పాయింట్లు (15.80 శాతం) నష్టపోయింది.బీఎస్ఈ సెన్సెక్స్‌లో టెక్ మహీంద్రా ఆరు శాతానికి పైగా నష్టపోగా, ఇండస్ఇండ్ బ్యాంకు ఐదు శాతం పతనమైంది. మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, టాటా మోటార్స్, టైటాన్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), నెస్లే, మారుతి సుజుకి స్టాక్స్ భారీగా పతనం అయ్యాయి. మరోవైపు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మాత్రమే లాభాలతో ముగిసింది. ఆసియా మార్కెట్లలో సియోల్, టోక్యో, షాంఘై, హాంకాంగ్ భారీ నష్టాలతో సరిపెట్టుకున్నాయి. యూరోపియన్ యూనియన్ మార్కెట్లు పూర్తిగా నష్టాలతో ముగిశాయి. గురువారం వరకూ విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) రూ.556.56 కోట్ల విలువైన వాటాలు ఉపసంహరించారు. గ్లోబల్ ఆయిల్ బెంచ్ మార్క్ బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్‌పై 0.69 శాతం తగ్గి 73.53 డాలర్లు పలుకుతుంది.

## 84 వేల డాలర్ల వద్ద తచ్చాడుతున్న బిట్‌కాయిన్.. వారాంతంపైనే అందరి దృష్టి!



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక ఒడిదుడుకులు, ట్రంప్ నిర్ణయాల ప్రభావంపై అస్పష్టతో బిట్‌కాయిన్ పెట్టుబడిదారుల్లో అనిశ్చిత నెలకొంది. గురువారం నాటికి బిట్‌కాయిన్ విలువ 84 వేల వద్ద తచ్చాడుతుండగా అందరి దృష్టి వారాంతంపైనే నెలకొంది. నేటితో 5.07 బిలియన్ డాలర్ల విలువైన క్రిప్టో డెరివేటివ్‌ల కాలపరిమితి ముగియనుండటంతో తదుపరి ఏం జరుగుతుందన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ వారంతంలో బిట్‌కాయిన్ విలువ తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి .

ఈవారం బిట్‌కాయిన్ ఈటీఎఫ్ భారీగా నష్టపోయాయి. అయితే, వ్యవస్థాగత మదుపర్లు కొనుగోళ్లకు దిగడంతో కొంత ఆశాభావం నెలకొంది. గురువారం క్రిప్టో డెరివేటివ్స్ ఏకంగా 326.81 మిలియన్ డాలర్లు కోల్పోయాయి. అయితే, ఫ్యూచర్స్, ఆప్షన్స్ ట్రేడర్స్‌లో ఆశాభావం కారణంగా 108 మిలియన్ల మేర నష్టాలు తగ్గాయి. ప్రస్తుతం ఓపెన్ ఫ్యూచర్స్ ఇంటర్నెస్ట్ 55,100 బీట్‌కాయిన్‌ల మధ్య తచ్చాడుతోంది.భవిష్యత్తులో బిట్‌కాయిన్ విలువ తగ్గుతుందనేందుకు సూచనా క్రిప్టో ఫియర్ అండ్ గ్రీడ్ సూచీ 10 పాయింట్ల వద్దే తచ్చాడుతోంది. నేటి పరిణామాలపైనే క్రిప్టో సమీప భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. బిట్‌కాయిన్ 89 వేల డాలర్లు తాకొచ్చన్న అంచనా లున్నా ప్రతికూల వార్తలు కచ్చితంగా వాస్తవ విలువను తగ్గిస్తాయన్న భయాలు నెలకొన్నాయి. చరిత్రలో నమోదైన గరిష్ఠ విలువకు 22 శాతం తక్కువగా ప్రస్తుతం బిట్ కాయిన్ ట్రేడవుతోంది.

## బంగారం ధరలు రోజూ ఒకేలా ఎందుకుండవు.. ఈ 5 అంశాలే ప్రధాన కారణం..



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రతిరోజూ బంగారం ధరలు చెక్ చేసుకునే అలవాటు చాలామందికి ఉంటుంది. కానీ, ఇలా గోల్డ్ రేట్లు రోజుకో విధంగా ఎందుకుంటాయని ఎప్పుడైనా ఆలోచించారా.. హఠాత్తుగా ఒక్కరోజులోనే అమాంతం ధర పైకి ఎగబాకటం.. ఇంకోరోజు తగ్గటం.. ఇలా బంగారం ధరల్లో ప్రతి రోజూ హెచ్చుతగ్గులు నమోదు కావడానికి కారణమేంటి.. మార్కెట్ పరిస్థితి ఎలా ఉన్నా బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా ఇన్వెస్టర్లు ఎందుకు భావిస్తారు. ఈ 5 అంశాలే అందుకు ప్రధాన కారణం.

**1. అంతర్జాతీయ బంగారం ధరలు :** భారతదేశంలో బంగారం ధరలను నిర్ణయించడంలో అంతర్జాతీయ బంగారం ధరలు గణనీయమైన పాత్ర పోషిస్తాయి. ఎందుకంటే, బంగారాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ ట్రేడ్ చేస్తారు. అందుకే ప్రపంచ మార్కెట్లలో జరిగే ప్రతి మార్పు ప్రభావం భారతీయ మార్కెట్లపైనా పడి బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తాయి.


**2. రూపాయి-డాలర్ మారకం రేటు :** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ బంగారం ధరలను ప్రభావితం చేస్తుంది. బలహీనమైన రూపాయి బంగారం ధరల పెరుగుదలకు దారితీస్తుంది. ముఖ్యంగా అమెరికా డాలర్ బలహీనపడితే వెంటనే ఇన్వెస్టర్లు బంగారంపై పెట్టుబడికి మొగ్గు చూపుతారు.

**3. దిగుమతి సుంకం, పన్నులు :** బంగారంపై దిగుమతి సుంకం, పన్నులలో మార్పులు బంగారం ధరలను ప్రభావితం చేస్తాయి. అధిక పన్నులు బంగారం ధరలు పెరగడానికి కారణమవుతాయి.

**4. డిమాండ్, సరఫరా :** పండుగలు, వివాహాల సమయంలో ఇండియాలో బంగారానికి డిమాండ్ ఎక్కువనే సంగతి తెలిసిందే. అందువల్లే ఈ సమయంలో గోల్డ్ రేట్లు అమాంతం పెరుగుతాయి. అలాగే తక్కువ డిమాండ్ ఉన్నప్పుడు ధరలు తగ్గడానికి ఆస్కారం ఉంటుంది.

**5. భౌగోళిక రాజకీయ, ఆర్థిక అంశాలు :** ప్రపంచ ఆర్థిక ధోరణులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కేంద్ర బ్యాంకు విధానాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తాయి. ఆర్థిక అనిశ్చితి తలెత్తిన సమయంలో బంగారాన్ని తరచుగా సురక్షితమైన ఆస్తిగా పరిగణిస్తాయి ప్రపంచదేశాలు.

## న్యూమరస్ మోటార్స్ డిప్లాస్ మ్యాక్స్ ఈవీ



**హైదరాబాద్-నవభూమి:** బెంగళూరు కేంద్రంగా ఉన్న న్యూమరస్ మోటార్స్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లోకి మల్టీయుటిలిటీ ఎలక్ట్రిక్ స్కూటర్ డిప్లాస్ మ్యాక్స్ విడుదల చేసింది. ఈ స్కూటర్ ధర రూ.1,12,199. అన్ని రకాలైన వాతావరణ పరిస్థితులను తట్టుకునే విధంగా ఈ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను రూపొందించినట్లు సంస్థ వైస్ ప్రెసిడెంట్ (ఇంజనీరింగ్) సుందరరాజన్ ఎస్ వెల్లడించారు. రెండు బ్యాటరీలు, డ్యూయల్ డిస్క్ బ్రేక్స్, థెఫ్ట్ అలర్ట్స్, జియోఫెన్సింగ్, వెహికల్ ట్రాకింగ్ వంటి అడ్వాన్స్‌డ్ ఫీచర్లతో డిప్లాస్ మ్యాక్స్‌ను తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. న్యూమరస్ మోటార్స్ ప్రస్తుతం 30 ఔట్‌లెట్స్‌ను నిర్వహిస్తోందని, త్వరలో ఈ సంఖ్యను 45కు చేర్చనున్నట్లు చెప్పారు.

# భారీగా పెరుగుతున్న బంగారం ధరలు.. నవంబర్ తర్వాత తొలిసారి ఇలా..!



**న్యూఢిల్లీ-నవభూమి:** పసిడి ప్రియులకు అదిరిపోయే శుభవార్త. గత కొంత కాలంగా భారీగా పెరిగి జీవన కాల గరిష్టాల్ని చేరిన సంగతి తెలిసిందే. అయితే అక్కడి నుంచి ఇప్పుడు వరుసగా పతనం అవుతున్నాయి. వరుసగా మూడో రోజు కూడా గోల్డ్ రేట్లు భారీగా పడిపోయాయి. ఈ క్రమంలోనే ఈ వారాన్ని భారీ నష్టాలతో ముగించబోతోంది. గత 3 నెలల కాలంలో కూడా బంగారం ధరలు ఒక వారంలో ఇంతలా పడిపోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇది ఇన్వెస్టర్లకు నష్టాల్ని మిగులుస్తుంది. భౌతికంగా కొనుగోలు చేయాలనుకునేవారికి ఊరట కలిగిస్తోంది. బంగారం ధరలు ఇంతలా పెరిగేందుకు యూఎస్ డాలర్ పుంజుకోవడమే కారణం అని నిపుణులు అంటున్నారు.యూఎస్ డాలర్ ఇండెక్స్ ఈ వారంలో 0.7 శాతం పుంజుకుంది. ఇంకా బాండ్ ఈల్డ్స్ కూడా గణనీయంగా పుంజుకుంటున్నాయి. ఇవే గోల్డ్ రేట్లు పెరిగేందుకు కారణం అవుతోంది. అయినప్పటికీ.. ఇప్పుడు ఇన్వెస్టర్లు కీలక ద్రవ్యోల్బణం గణాంకాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇదే ఫెడ్ వడ్డీ రేట్ల పాలసీని నిర్ణయించనుంది. ఇటీవల ఫెడ్ వడ్డీ రేట్లను వరుసగా రెండు సార్లు తగ్గించి.. మళ్లీ స్థిరంగా ఉంచిన సంగతి తెలిసిందే.ఈ ఫెడ్ వడ్డీ రేట్ల విషయంలోనే ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ట్రంప్ వడ్డీ రేట్లను సున్నాకు చేర్చాలని ఒత్తిడి చేస్తుండగా.. ఫెడ్ బాస్ మాత్రం ససేమిరా అంటున్నారు. ద్రవ్యోల్బణం అధిక స్థాయిలోనే ఉందని.. ఈ క్రమంలో తగ్గించడం కుదరదని అంటున్నారు. ఇప్పుడు ద్రవ్యోల్బణం డేటా తర్వాత ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందా లేదా పెంచుతుందా అనే దానిపై ఒక అంచనాకు రావొచ్చు. ఇక ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గిస్తే.. డాలర్, బాండ్ ఈల్డ్స్ డిమాండ్ తగ్గి గోల్డ్ రేట్లు పెరుగుతుంటాయి. అదే ఫెడ్ వడ్డీ రేట్లు పెంచితే మాత్రం.. బంగారం రేట్లు దిగొస్తాయి.ఇక ఇవన్నీ డొనాల్డ్ ట్రంప్ చుట్టూరానే తిరుగుతున్నాయి. ట్రంప్ మొదట మెక్సికో, కెనడా, చైనా నుంచి వచ్చే దిగుమతులపై సుంకాలు ప్రకటించడంతో వాణిజ్య యుద్ధ భయాలు నెలకొన్నాయి. అదే అనిశ్చితికి కారణమైంది. ఆర్థిక వ్యవస్థ మందగమనానికి దారి తీసింది. ఈ సంక్షోభ సమయంలోనే బంగారంపై పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. దీంతో ధరలు పెరగ్గా.. సడెన్‌గా ఇప్పుడు డాలర్ పుంజుకోవడంతో రేట్లు దిగొస్తున్నాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో తాజాగా గోల్డ్ రేట్లు భారీగా పతనం అయ్యాయి.

ముందటి రోజు ఏకంగా 40 డాల ర్ల మేర గోల్డ్ రేట్లు దిగొచ్చిన సంగతి తెలిసిందే. స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు 2920 డాలర్ల స్థాయి నుంచి 2880 డాలర్లకు పడిపోయింది. అదే ఇవాళ మరో 20 డాలర్ల పతనంతో 2860 డాలర్లకు పడిపోయింది. ఈ వారంలో స్పాట్ గోల్డ్ రేటు 2.5 శాతం వరకు పతనమైంది. ఇక దేశీయంగా కూడా వరుసగా 3 రోజులుగా బంగారం ధరలు పడుతూనే ఉన్నాయి.

# రూ. 1385కే విమాన ప్రయాణం.. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ బంపరాఫర్.. బస్ టికెట్ ధరలోనే..!




**న్యూఢిల్లీ-నవభూమి:**విమాన ప్రయాణం చేయాలనుకునే వారికి శుభవార్త. దేశంలోని దిగ్గజ విమానయాన సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ తీపికబురు అందించింది. మరో కొత్త సేల్ లాంచ్ చేసింది. ఎయిరిండయా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ ఇప్పుడు పేడే సేల్ తీసుకొచ్చింది. దీంట్లో భాగంగా లైట్ ఆఫర్ కింద ఎక్స్‌ప్రెస్ లైట్ ఫేర్స్ రూ. 1385 నుంచే ప్రారంభం అవుతున్నాయి. ఇదే సమయంలో వాల్యూ ఆఫర్ కింద ఎక్స్‌ప్రెస్ వాల్యూ ఫేర్స్ రూ. 1535 నుంచి ప్రారంభం అవుతున్నాయి. ఇక ఈ బుకింగ్స్ చేసుకునేందుకు 2025, మార్చి 2 లాస్ట్ డేట్‌గా ఉంది. అంటే ఆలోగా టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక ఈ ఆఫర్ 2025 సెప్టెంబర్ 19 వరకు వర్తిస్తుంది. అంటే మార్చి 1 నుంచి సెప్టెంబర్ 19 వరకు ఎప్పుడైనా ప్రయాణం చేసే వీలుంటుంది.ఈ ఆఫర్లో ప్రకటించిన ధరలోనే బేస్ ఫేర్, టాక్సలు, ఎయిర్‌పోర్ట్ ఛార్జీలు ఉంటాయి. కన్వీనియన్స్ రుసుములు, ఇతర అనుబంధ ఛార్జీలు వేరేగా ఉంటాయి. అయితే ఇక్కడ ఈ ఛార్జీల్ని కూడా తప్పించుకోవచ్చు. ఎక్స్‌ప్రెస్ లైట్ ఫేర్స్‌పై ఎయిరిండియాఎక్స్‌ప్రెస్.కామ్ వెబ్‌సైట్ లేదా ఎయిర్‌లైన్స్ మొబైల్ యాప్ ద్వారా బుక్ చేసుకున్నట్లయితే అప్పుడు జీరో కన్వినియన్స్ ఫీజు వర్తిస్తుంది.ఈ లైట్ ఆఫర్ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ అఫీషియల్ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా లాగిన్ అయిన లోయల్టీ సభ్యులకు మాత్రమే వర్తిస్తుంది. అంటే లాగిన్‌నై టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. లాగిన్ అయిన సభ్యులు ఇతర బెనిఫిట్స్ కూడా అందుకోవచ్చు. ప్రైమ్ అండ్ స్టాండర్డ్ సీట్స్‌లో 25 శాతం తగ్గింపు, బిజ్ సీట్ అప్‌గ్రేడ్స్‌లో 50 శాతం తగ్గింపు పొందొచ్చు. 10 కేజీ ఎక్సెస్ చెకిన్ బ్యాగేజీపై 25 శాతం తగ్గింపు ఇలా చాలానే ప్రయోజనాలు ఉన్నాయి. పూర్తి వివరాలు కోసం ఇక్కడ క్లిక్ చేయండి.

మరోవైపు వియత్నాంకు చెందిన ప్రముఖ విమానయాన సంస్థ వియత్‌జెట్ హోలీ పండగకు ముందు స్పెషల్ సేల్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. హనోయ్ ప్రధాన కేంద్రంగా నడిచే ఈ విమానయాన సంస్థ కేవలం రూ. 11 ప్రారంభ ధరతోనే విమాన టికెట్లు అందిస్తోంది. రూ. 11కుపైన టాక్సులు, ఇతర రుసుములు వర్తిస్తాయని అధికారిక వెబ్‌సైట్లో స్పష్టం చేసింది. ఇక్కడ హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, అహ్మదాబాద్, కొచ్చి, ముంబై నుంచి ప్రయాణం చేయొచ్చు. ఫిబ్రవరి 21న ఈ ఆఫర్ ప్రారంభం కాగా.. ఫిబ్రవరి 28 లాస్ట్ డేట్. మార్చి 10 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఎప్పుడైనా ప్రయాణం చేయొచ్చు.

# చేతిలో రూ.10000 ఉంటే చాలు..

## ఈ 5 వ్యాపారాల్లో నెలకు రూ.30వేలు గ్యారెంటీ..




**న్యూఢిల్లీ-నవభూమి:**ఈ రోజుల్లో చాలామంది ఇంటి నుంచే చేయగలిగే వ్యాపార ఆలోచనల కోసం వెతికే వారి సంఖ్య పెరుగుతోంది. మరీ ముఖ్యంగా మహిళలు స్వీయ ఉపాధి పొందడమెలా అని ఆలోచిస్తుంటారు. నష్టభయం లేకుండా కాలు బయటపెట్టకుండానే స్థిరమైన ఆదాయమార్గం కోసం మీరు అన్వేషిస్తుంటే.. ఈ 5 వ్యాపార ఆలోచనలు మీకోసమే. మీ చేతిలో కేవలం రూ.10 వేలు ఉంటే చాలు. స్వంతంగా వ్యాపా రం ప్రారంభించాలనే కల కచ్చితంగా సాధ్యమే.

నేటికాలంలో మహిళలు వ్యాపార ప్రపంచంలోకి వేగంగా ప్రవేశిస్తున్నారు. తక్కువ ఖర్చుతో వ్యాపారం ప్రారంభించి ప్రతి నెలా మంచి లాభాలను సంపాదించాలని కోరుకునే మహిళల కోసం ఐదు గొప్ప వ్యాపార ఆలోచనలు.

**1. క్లౌడ్ కిచెన్ బిజినెస్ :** వంట చేయడానికి ఇష్టపడే మహిళలకు ఈ వ్యాపారం సరైనది. ఈ మధ్య కాలంలో హెూటళ్లు, రెస్టారెంట్ల కంటే ఇంట్లో తయారుచేసిన భోజనం తినాలని ఆరాటపడేవారి సంఖ్య పెరుగుతోంది. కాబట్టి, సరైన విధానాల్లో ముందుకెళితే ఈ వ్యాపారం ద్వారా ఉద్యోగులతో సమానంగా ఇంటి నుంచే ప్రతి నెలా రూ. 15,000 నుంచి 30,000 వరకు సంపాదించవచ్చు. మార్కెటింగ్ నైపుణ్యాలు, ఆహార రుచి, నాణ్యత బాగుంటే ఇంతకంటే ఎక్కువే వచ్చినా ఆశ్చర్యం లేదు.

**ఎలా ప్రారంభించాలి:**

టిఫిన్ సర్వీస్, స్వీట్లు లేదా స్నాక్స్ వంటి మీ స్పెషల్ వంటకాలపై దృష్టి పెట్టండి.

స్థానిక మార్కెట్లు లేదా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రచారం చేసుకోండి.

పెట్టుబడి : ఆహార తయారీకి అయ్యే ముడిసరుకు, ప్యాకేజింగ్, డెలివరీ, ఇతర ఖర్చుల కోసం మొదట్లో కనీసం రూ. 10,000 పెట్టుబడి అవసరం.

**లాభం:** మీరు ప్రతి నెలా రూ. 15,000 నుండి 30,000 వరకు సంపాదించవచ్చు.

**2. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ వ్యాపారం :** కొందరు మహిళలకు సృజనాత్మకంగా ఆలోచించి, చేతితో రకరకాల అందమైన వస్తువులు తయారు చేసే నైపుణ్యం ఉంటుంది. ఈ నైపుణ్యాన్నే వ్యాపార ఆలోచనగా మలచుకుంటే మంచి ఆదాయం లభిస్తుంది.

**ఎలా ప్రారంభించాలి:**

రాఖీ, ఆభరణాలు, బహుమతి వస్తువులు లేదా అలంకార వస్తువులను తయారు చేయండి.

వాటిని స్థానిక మార్కెట్లలో, ఉత్సవాలలో లేదా ప్రముఖ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో అమ్మకానికి పెట్టండి.

పెట్టుబడి : ప్రారంభ సామాగ్రి (ఫ్యాబ్రిక్, పూసలు, రంగులు మొదలైనవి) కొనడానికి రూ. 10,000 సరిపోతుంది.

లాభం: నెలకు రూ. 10,000 నుండి రూ. 25,000 వరకు.

**3. బ్యూటీ, హెయిర్ స్టైల్:** కాస్మటిక్ రంగంలో ఎల్లప్పుడూ డిమాండ్ ఉంటుంది. మీరు ఇంటి నుంచే బ్యూటీషన్‌గా తక్కువ పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించవచ్చు.

**ఎలా ప్రారంభించాలి:**

ప్రాథమిక మేకప్, హెయిర్ స్టైలింగ్‌లో శిక్షణ తీసుకోండి.

మీ సేవలను ఇంటి నుండే ప్రారంభించండి లేదా ఇంటింటికి సేవలను అందించండి.

పెట్టుబడి : మీరు రూ. 10,000 కు బేసిక్ మేకప్ కిట్, హెయిర్ టూల్స్ కొనుగోలు చేయవచ్చు.

**లాభం:** ఒక్కో కస్టమర్‌కు రూ. 500-2000 వరకు సంపాదించవచ్చు.

**4. ఫిట్‌నెస్, యోగా తరగతులు :** ఈ మధ్య కాలంలో ఫిట్‌నెస్, యోగా ట్రెండ్ వేగంగా పెరుగుతోంది. ఇంటి నుంచే ఈజీగా నిర్వహించగలిగే ఈ వ్యాపారం ద్వారా మహిళలకు ఫిట్‌నెస్, ఆదాయం రెండూ లభిస్తాయి.

**ఎలా ప్రారంభించాలి:**

మీరు ఫిట్‌నెస్ లేదా యోగాలో శిక్షణ పొందినట్లయితే ఇంట్లో నుంచే తరగతులు ప్రారంభించండి. ఆన్‌లైన్ తరగతులు కూడా మంచి ఎంపిక.

**అవసరమైన ఖర్చు:** ప్రమోషన్, ప్రారంభ సెటప్ కోసం రూ. 10,000 సరిపోతుంది.

**లాభం:** నెలకు రూ. 20,000 నుండి రూ. 50,000 వరకు.

**5. ఆన్‌లైన్ రిటైల్ వ్యాపారం :** డిజిటల్ యుగంలో ఆన్‌లైన్‌లో ఉత్పత్తుల అమ్మకం వేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యాపారం. మీరు తయారుచేసినవి లేదా కొన్నవి ఏవైనా కస్టమర్లను ఆకట్టునేలా విక్రయిస్తే కష్టపడకుండానే మంచి లాభాలు దక్కించుకోవచ్చు.

**ఎలా ప్రారంభించాలి:**

నగలు, దుస్తులు, గృహాలంకరణ లేదా చేతితో తయారు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో అమ్మండి.

ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా ఉత్పత్తిని ప్రచారం చేయండి.

**ఖర్చు:** ఉత్పత్తి కొనుగోలు మరియు డెలివరీకి రూ. 10,000.

**లాభం:** నెలకు రూ. 15,000 నుంచి రూ. 40,000 వరకు.

## పసిడి కొనేందుకు తగిన సమయం.. స్వల్పంగా తగ్గిన ధరలు



**న్యూఢిల్లీ-నవభూమి:**పసిడిపై పెట్టుబడి పెట్టాలనుకునే వారికి గుడ్ న్యూస్. నేడు బంగారం ధరలో స్వల్పంగా తగ్గుదల కనిపించింది. 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర రూ.10 మేర తగ్గి రూ. 87,380కి చేరుకుంది. అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర రూ.80,100 నుంచి రూ.80,090కు చేరింది. ఇక వెండి ధర కూడా నిన్నటితో పోలిస్తే స్వల్పంగా తగ్గింది. నిన్న కిలో వెండి ధర రూ.98,000 కాగా నేడు రూ.97,900కు చేరుకుంది.

దేశంలోని వివిధ నగరాల్లో 24 క్యారెట్ ధరలు ఎలా ఉన్నాయంటే..

చెన్నై రూ. 87,370
ముంబై రూ.87,370
ఢిల్లీ రూ. 87,520
కోల్‌కతా రూ.87,370
హైదరాబాద్ రూ.87,370
బెంగళూరు రూ87,370
అహ్మదాబాద్ రూ.87,420

ఇక వచ్చే ఏడు రోజుల వ్యవధిలో బంగారం, వెండి ధరలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నెలలో ఇప్పటివరకూ బంగారం ధరలు పెరుగుతూనే ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఫిబ్రవరి 1న 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.84,490గా ఉండా ప్రస్తుతం ఇది రూ.87,370కు చేరుకుంది. ఫిబ్రవరి 25న అత్యధికంగా రూ.88090కు చేరింది. ఫిబ్రవరి 3న అత్యల్పంగా 84,050ను తాకింది. అంతర్జాతీయ పరిస్థితులు, డిమాండ్-సరఫరాల్లో తేడాలు వంటివన్నీ పసిడి ధరలను ప్రభావితం చేస్తాయన్న విషయం తెలిసిందే.

## సూపర్ బిలియనీర్లలో అంబానీ, అదానీ

**న్యూఢిల్లీ-నవభూమి:**భారత కుబేరులు, పారిశ్రామిక దిగ్గజాలు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ సంపదలో మరో ఘనత సాధించారు. ప్రపంచంలో 24 మంది సూపర్ బిలియనీర్ల జాబితా లో స్థానం సంపాదించారు. 5,000 కోట్ల డాలర్ల (రూ.4.35 లక్షల కోట్లు) పైబడిన సంపద గల వారిని సూపర్ బిలియనీర్లుగా వ్యవహరిస్తారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 41,900 కోట్ల డాలర్ల (రూ.36.45 లక్షల కోట్లు) నికర సంపదతో ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలవగా, జెఫ్ బెజోస్ 26,380 కోట్ల డాలర్లతో రెండో స్థానంలో నిలిచారు. కాగా 9,060 కోట్ల డాలర్లతో (రూ.7.88 లక్షల కోట్లు) అంబానీ 17వ స్థానంలోను, 6,060 కోట్ల డాలర్లతో (రూ.5.27 లక్షల కోట్లు) అదానీ 22వ స్థానంలోను నిలిచారు. ప్రపంచ సంపదను ట్రాక్ చేసే అల్ట్రాటా సంస్థ విడుదల చేసిన జాబితా లో ఈ వివరాలున్నాయి. సూపర్ బిలియనీర్లలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న మస్క్ సంపాదన గంటకి 20 లక్ష ల డాలర్లు.. అంటే అక్షరాలా రూ.17.4 కోట్లు. ఈ లెక్కన మస్క్ 2027 నాటికి ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్ అవుతాడని అంచనా. ఒక సగటు అమెరికన్ సంపదతో పోల్చితే మస్క్ సంపద 20 లక్షల రెట్లు అధికమని వెల్లడించింది.

100 మంది సెంటి బిలియనీర్లు: ఇటీవల కాలంలో ప్రపంచంలో కుబేరుల సంఖ్య విశేషంగా పెరిగిపోతూ ఉండడంతో వారిలో 5,000 కోట్ల డాలర్ల పైబడిన సంపద గల వారిని సూపర్ బిలియనీర్లుగా వర్గీకరిస్తున్నారు. ఫిబ్రవరి ప్రారంభం నాటికి ఈ సూపర్ బిలియనీర్లు ప్రపంచంలోని కుబేరుల సంపద మొత్తంలో 16 శాతం వాటా కలిగి ఉన్నట్టు ఆ నివేదిక తెలిపింది. 2014లో ఈ వాటా కేవలం 4 శాతం ఉంది. వీరందరి మొత్తం సంపద 3.3 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. అంటే ఫ్రాన్స్ జీడీపీతో సమానం. సూపర్ బిలియనీర్లుగా వర్గీకరించిన 24 మందిలో కూడా 16 మంది సెంటి బిలియనీర్లుగా (10,000 కోట్ల డాలర్లు) గుర్తింపు పొందారు.కుబేరుల్లోనూ అసమానతలు..సమాజంలో సంపన్నులు, పేదల మధ్య ఆర్థిక వ్యత్యాసాలు పెరిగిపోతున్నట్టుగానే కుబేరుల్లో కూడా ఆర్థిక వ్యత్యాసాలు గణనీయంగా పెరుగుతున్నాయి. సూపర్ బిలియనీర్ల సంఖ్య గణనీయంగా పెరిగిపోతుండడంతో విలాసవంతమైన రంగాల్లో డిమాండ్ పెరుగుతోంది. ప్రధానంగా రియల్ ఎస్టేట్ రంగం పట్ల వారు మొగ్గు చూపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత విలాసవంతమైన భవంతులు కొనుగోలు చేస్తున్నారు. న్యూయార్క్, మియామీ, పామ్ బీచ్, లాస్ ఏంజిలిస్, యాస్పెన్ వంటి నగరాలు లగ్జరీ రియల్ ఎస్టేట్ కేంద్రాలుగా మారుతున్నాయి. ఈ నగరాల్లో వీరి కోసమే ప్రత్యేకంగా విలాసానికి మారుపేరైన ఆకాశ హర్మాలు నిర్మిస్తున్నారని ఆ నివేదిక వెల్లడించింది. అంతేకాదు ఈ భూమండలంపై అమిత ధనవంతులుగా పేరొందిన 15 మందిలో 10 మంది టెక్నాలజీ రంగానికి చెందిన వారని బ్లూమ్‌బర్గ్ గణాంకాలు తెలుపుతున్నాయి.



## లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయిన పోలీస్ అధికారి.. తర్వాత ఏం జరిగిందంటే?

**లక్నో-నవభూమి:**ఒక వ్యక్తి నుంచి పోలీస్ అధికారి లంచం తీసుకున్నాడు. ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. ఆ పోలీస్ అధికారిని వారు అదుపులోకి తీసుకున్నారు. వాహనంలోకి ఎక్కించేందుకు ప్రయత్నించగా ఆయన తీవ్రంగా ప్రతిఘటించాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో ఈ సంఘటన జరిగింది. చిల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో శివశంకర్ సింగ్ ఒకరి నుంచి రూ.30,000 లంచం తీసుకున్నాడు. మాటు వేసిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



కాగా, సివిల్ డ్రెస్‌లో ఉన్న ఏసీబీ అధికారులు శివశంకర్ సింగ్‌ను చుట్టుముట్టారు. ఆయనను అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్ నుంచి బయట ఉన్న వాహనం వద్దకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే ఆ పోలీస్ అధికారి తీవ్రంగా ప్రతిఘటించాడు. వాహనం ఎక్కేందుకు నిరాకరించాడు. 'నా మాట వినండి, ఒక్క నిమిషం ఆగండి. నేను మీతో రాను' అంటూ వారిని ప్రాధేయపడ్డాడు.

## హెూలీ కార్యక్రమాన్ని రద్దు చేసినందుకు.. ప్రిన్సిపాల్, టీచర్లను బంధించిన స్టూడెంట్స్



**భోపాల్-నవభూమి:** క్యాంపస్‌లో తలపెట్టిన హెూలీ కార్యక్రమాన్ని కాలేజీ యాజమాన్యం రద్దు చేసింది. దీంతో ఆగ్రహించిన విద్యార్థులు ప్రిన్సిపాల్, టీచర్లు సమావేశమైన హాల్ డోర్ లాక్ చేసి బంధించారు. కాలేజీ యాజమాన్యం దీనిపై సీరియస్‌గా స్పందించింది. నలుగురు విద్యార్థులను కాలేజీ నుంచి బహిష్కరించింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ సంఘటన జరిగింది. ప్రభుత్వ హెూల్కర్ సైన్స్ కాలేజీ క్యాంపస్‌లో మార్చి 7న గ్రాండ్‌గా హెూలీ వేడుక నిర్వహించాలని విద్యార్థులు ప్లాన్ చేశారు. ఫిబ్రవరి 23న అనుమతి తీసుకోకుండా కాలేజీలో పోస్టర్లు ఏర్పాటు చేశారు. ఆగ్రహించిన యాజమాన్యం వాటిని తొలగించింది. అలాగే కాలేజీలో తలపెట్టిన హెూలీ కార్యక్రమాన్ని రద్దు చేసింది.

కాగా, కాలేజీ యాజమాన్యం తీరు పట్ల విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 24న మహిళా ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, విద్యార్థులతో సహా 150 మంది సమావేశమైన హాల్ డోర్‌ను బయట నుంచి లాక్ చేశారు. సుమారు అరగంట పాటు వారిని బంధించారు. సెమినార్ హాల్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.మరోవైపు కాలేజీ యాజమాన్యం ఈ సంఘటనపై సీరియస్‌గా స్పందించింది. విద్యార్థుల చర్యను తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యంగా దర్యాప్తు కమిటీ భావించింది. నలుగురు విద్యార్థి నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణా కమిటీ సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో నలుగురు విద్యార్థులను కాలేజీ నుంచి బహిష్కరించినట్లు ప్రిన్సిపాల్ అనామిక జైన్ తెలిపారు. టీసీలు తీసుకుని వెళ్లిపోవాలని వారికి చెప్పినట్లు వెల్లడించారు.

## ఆస్తి ఇవ్వబోనని హెచ్చరించిన తండ్రి.. ఇంటి నుంచి కోటి చోరీ చేసిన కొడుకు



**లక్నో-నవభూమి:** చెడు సహవాసం పట్టిన కొడుకును తండ్రి మందలించాడు. ఆస్తి ఇవ్వబోనని, ఇంటి నుంచి వెళ్లగొడతానని హెచ్చరించాడు. దీంతో ఆ కుమారుడు తండ్రిపై ప్రతీకారం తీర్చుకున్నాడు. స్నేహితులతో కలిసి ఇంట్లో దొంగ ఫిర్యాదు అందుకున్న పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. పాంకి ప్రాంతానికి చెందిన వ్యాపారవేత్త బట్టలకు రంగులు వేసే ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నాడు. పదో తరగతి చదువుతున్న అతడి కుమారుడు తన స్నేహితులతో చెడు సహవాసం చేస్తున్నాడు. చెడ్డ పనులతో దారి తప్పుతున్నాడు.కాగా, కొడుకు తీరుపై తండ్రి ఆగ్రహం వ్యక్తం చేశాడు. చెడు సహవాసాలు మానకపోతే ఆస్తి ఇవ్వబోనని, వీలునామా రద్దు చేస్తానని, ఇంటి నుంచి పంపివేస్తానని కుమారుడ్ని హెచ్చరించాడు. దీంతో తండ్రిపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఆ యువకుడు ప్లాన్ వేశాడు. ఫిబ్రవరి 27న ఆరుగురు స్నేహితులతో కలిసి సొంత ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. రూ.20 లక్షల నగదు, రూ.80 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను దొంగిలించాడు.మరోవైపు కోటి విలువైన డబ్బు, నగలు చోరీపై ఆ వ్యాపారవేత్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ ఇంటితోపాటు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. మైనర్ బాలుడైన వ్యాపారి కుమారుడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతడ్ని జువైనల్ హెూమ్‌కు తరలించారు.కాగా, ఈ చోరీకి సంబంధించి మరో నలుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. రూ. 4 లక్షల నగదు, 165 గ్రాములకు పైగా బంగారం, 3 కిలోలకు పైగా వెండిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పరారీలో ఉన్న మరో ఇద్దరిని అరెస్టు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. వారి అరెస్ట్‌తో చోరీ చేసిన మిగతా నగదు, నగలు స్వాధీనం చేసుకుంటామని వివరించారు. నిందితుల్లో ఇద్దరు గతంలో చోరీ కేసులో అరెస్టైనట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## బద్రీనాథ్ ఘటన బాధాకరం: ఉత్తరాఖండ్ సీఎం



**చమోలీ-నవభూమి:** ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో మంచు చరియలు విరిగిపడ్డాయి. ఆ ప్రమాదంలో సరిహద్దు రహదారుల సంస్థకు చెందిన సుమారు 50 మంది వరకు ఆ కొండచరియల్లో చిక్కుకున్నారు. బద్రీనాథ్ క్షేత్రానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న బోర్డర్ గ్రామం మానా వద్ద ఈ ఘటన జరిగినట్లు చెబుతున్నారు. ఆ రాష్ట్ర సీఎం పుష్కర్ సింగ్ ధామీ ఈ ఘటన పట్ల స్పందించారు. ఆ ఘటన బాధాకరమన్నారు. రిలీఫ్, రెస్క్యూ ఆపరేషన్ వేగంగా చేపట్టినట్లు వెల్లడించారు. కార్మికులు క్షేమంగా ఉండాలని ఆయన భగవాన్ బద్రీనాథ్‌ను ప్రార్థించారు.మొత్తం 57 మంది వర్కర్లు మంచు చరియల్లో చిక్కుకున్నారు. దీంట్లో ఇప్పటి వరకు 16 మందిని రక్షించారు. మానా గ్రామంలోని ఆర్మీ క్యాంపుకు వాళ్లను చేర్చారు. గురువారం రాత్రి బీఆర్వో క్యాంపులో 57 మంది రోడ్డు కార్మికులు ఉన్నారు. రెస్క్యూ ఆపరేషన్‌కు చెందిన ఫోటోలను రిలీజ్ చేశారు. రెస్క్యూ ఆపరేషన్‌లో మొత్తం 65 మంది వరకు పాల్గొన్నారు. కొన్ని గంటల నుంచి ఆపరేషన్ కొనసాగుతోంది. అయితే తీవ్రమైన మంచు తుఫాన్ వల్ల .. రెస్క్యూ చర్యలకు ఆటంకం కలుగుతోంది. బలమైన గాలితో పాటు అధిక స్థాయిలో మంచుకురుస్తోంది. రోడ్లన్నీ మూసుకుపోయాయి. స్నో కట్టర్‌లతో రోడ్లను ఓపెన్ చేస్తున్నారు.

## నేటినుంచి ఇంటర్ పరీక్షలు

**తిరుపతి-నవభూమి:** ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 20వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనున్నాయి. 32,213 మంది ప్రథమ, 30,548 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు మొత్తం 62,761 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

## మహా కుంభమేళా ముగిసింది.. 2027లోనే మరో కుంభమేళా, ఎక్కడో తెలుసా?



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** 144 ఏళ్లకు ఒకసారి వచ్చే మహా కుంభమేళా.. ఈ ఏడాది ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లోని గంగా, యమునా, సరస్వతి నదుల త్రివేణి సంగమం వద్ద అత్యంత విజయవంతంగా ముగిసింది. సంక్రాంతి పండగ సందర్భంగా జనవరి 13వ తేదీన ప్రారంభం అయిన ఈ మహా కుంభమేళా 2025.. మహా శివరాత్రి సందర్భంగా ఈనెల 26వ తేదీతో ముగిసింది. మొత్తంగా 45 రోజుల్లో 66 కోట్లకు పైగా భక్తులు మహా కుంభమేళాకు వచ్చినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. ఈ సంఖ్య అమెరికా జనాభా 34 కోట్ల కంటే దాదాపుగా రెట్టింపు అని పేర్కొంది. ఇదే ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనంగా రికార్డుల్లోకి ఎక్కింది. ఈ నేపథ్యంలోనే తర్వాత వచ్చే కుంభమేళాపై అందరి దృష్టి పడింది. అయితే తర్వాతి కుంభమేళా ఎక్కడ జరుగుతుంది. ఎన్ని రోజులు జరుగుతుంది అనే విషయాలు ఇప్పుడు అందర్లో చర్చకు దారి తీస్తున్నాయి.

**తర్వాతి కుంభమేళా ఎప్పుడు, ఎక్కడ?**

ఇక తదుపరి కుంభమేళా 2027లో జరగనుంది. మహారాష్ట్రలోని నాసిక్ త్రయంబకేశ్వర్ వద్ద ఈ కుంభమేళాను మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. నాసిక్ పట్టణానికి 38 కిలోమీటర్ల దూరంలో ఈ కుంభమేళా జరగనుంది. దేశంలోనే రెండో అతి పొడవైన నది అయిన గోదావరి నది ఇక్కడే జన్మిస్తుంది. ఇక 12 జ్యోతిర్లింగాలలో ఒకటైన త్రయంబకేశ్వర్ శివాలయం ఇక్కడ ఉంటుంది. ఇక అక్కడ జరిగే కుంభమేళాను 2027 జులై 17వ తేదీ నుంచి ఆగస్ట్ 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది.

**టెక్నాలజీతో వర్చువల్‌గా కుంభమేళా స్నానం**

2027 నాసిక్ కుంభమేళాలో అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి నిర్వహిస్తామని.. ముంబైలో జరిగిన నాస్కామ్ టెక్నాలజీ అండ్ లీడర్‌షిప్ ఫోరం 2025లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వెల్లడించారు. కుంభమేళా సందర్భంగా పవిత్ర జలాల్లో స్నానం చేయలేని వారు.. ఆ అనుభూతిని వర్చువల్‌గా పొందడంలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

**3 ఏళ్ల వ్యవధిలోనే కుంభమేళా ఎందుకు?**

సాధారణంగా కుంభమేళాను మన దేశంలోని 4 నగరాల్లో మాత్రమే నిర్వహిస్తారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్, మహారాష్ట్రలోని నాసిక్, మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీలో జరుపుతారు. అయితే కనీసం 3 ఏళ్ల వ్యవధిలో ఈ కుంభమేళాను నిర్వహిస్తూ ఉంటారు. ప్రతీ 4 ఏళ్లకు ఒకసారి నిర్వహించేదాన్ని కుంభమేళా అంటారు. అదే ప్రతీ 6 ఏళ్లకు ఒకసారి నిర్వహించేదాన్ని అర్ధ కుంభమేళా అని పిలుస్తారు. ఇక ప్రతీ 12 ఏళ్లకు ఒకసారి నిర్వహించేది పూర్ణ కుంభమేళాగా పరిగణిస్తారు. ఇక ఇటీవల ముగిసిన కుంభమేళా 144 ఏళ్ల తర్వాత నిర్వహించారు. అందుకే దీన్ని మహా కుంభమేళాగా అభివర్ణిస్తారు.

## మోదీ చేతులకు సంకెళ్లేసి గట్టిగా నవ్వేస్తున్న ట్రంప్



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే అమెరికా పర్యటనకు వెళ్లిన విషయం అందరికీ తెలిసిందే. మోదీ అక్కడకు వెళ్లొచ్చిన మరుసటి రోజే యూఎస్ సర్కారు అక్రమ వలసదారులను తిరిగి ఇండియాకు పంపించింది. ట్రంప్, మోదీ భేటీ తర్వాత సంకెళ్లు వేసి మరీ భారత పౌరులను పంపించడంతో.. తమిళ వెబ్‌సైట్ వికటన్ దీనిపై ఓ వివాదాస్పద కార్టూన్ వేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే సదరు వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసింది. ఈ విషయం గుర్తించిన సంస్థ తాజాగా దీనిపై న్యాయ పోరాటానికి సిద్ధం అయింది. ఎలాగైనా సరే తమ సంస్థను తిరిగి పునరుద్ధరించుకోవాలని పెద్ద ఎత్తునే ప్రయత్నాలు చేస్తోంది. ఆ పూర్తి వివరాలు మీకోసం.ఇటీవలే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికా పర్యటనకు వెళ్లారు. అక్కడ ట్రంప్‌తో ఓ భేటీలో పాల్గొని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అయితే ఆయన అక్కడి నుంచి ఇండియాకు వచ్చేకంటే ముందే యూఎస్ సర్కారు అక్రమ వలసదారులు అయిన భారత పౌరులను తిరిగి స్వదేశానికి పంపించింది. అయితే ఆ సమయంలో వారందరి చేతులకు సంకెళ్లు వేసి నిందితులుగా ఇళ్లకు చేర్చడంతో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈక్రమంలోనే తమిళ వెబ్‌సైట్ వికటన్.. ఓ వివాదాస్పద కార్టూన్ వేసింది.

ముఖ్యంగా ట్రంప్, మోదీ భేటీలో పాల్గొన్నట్లుగానే ఆ కార్టూన్ ఉండగా.. అందులో ట్రంప్ ప్రధాని చేతులకు సంకెళ్లు వేసి నవ్వుతున్నట్లు కనిపించారు. అలాగే మోదీ ముఖం మాడ్చుకుని.. అమెరికా అధ్యక్షుడి వైపు కోపంగా చూస్తున్నట్లు ఉంది. ఈ కార్టూన్‌ను వికటన్ వెబ్‌సైట్ ఫిబ్రవరి 10వ తేదీన పబ్లిష్ చేసింది. అయితే 15వ తేదీ నుంచి ఈ వెబ్‌సైట్ అందుబాటులో లేకుండా పోయింది. దీంతో ఏమైందో సదరు సంస్థ ఏమైందో తెలుసుకునే పనిలో పడగా.. కేంద్ర ప్రభుత్వమే ఆ వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసినట్లు గుర్తించింది. ఈక్రమంలోనే ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది.కేంద్ర సమాచార, ప్రసార శాఖ కావాలనే తమ వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసినట్లు వివరిస్తూనే.. అనేక ఆరోపణలు చేసింది. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈక్రమంలోనే వికటన్ సంస్థ న్యాయపరంగా ముందుకు వెళ్లింది. అయితే ఫిబ్రవరి 20వ తేదీ రోజు దీనిపై విచారణ చేపట్టగా.. భావ ప్రకటనా స్వేచ్ఛతోనే ఈ కార్టూన్ వేసినట్లు వెల్లడించింది. అయతే ఫిబ్రవరి 25వ తేదీన మాత్రమే కేంద్ర సమాచారం, ప్రసారశాఖ నుంచి అధికారికంగా ఆదేశాలు అందాయని వికటన్ వివరించింది. ఎలాగైనా సరే ఆ వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాలని కోరింది. చూడాలి మరి మున్ముందు జరగనున్న న్యాయ పోరాటంలో ఎవరు గెలవనున్నారనేది.

## రూ.200 తేడా ఉందని.. రూ.93 కోట్ల బ్యాంకు అకౌంట్ ఫ్రీజ్!



**న్యూఢిల్లీ-నవభూమి:**సైబర్ నేరాలపై దర్యాప్తులో భాగంగా నిందితులు, అనుమానితుల బ్యాంకు అకౌంట్‌లను ఫ్రీజ్ చేసే విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని దర్యాప్తు సంస్థలకు ఢిల్లీ హైకోర్టు సూచించింది. హేతుబద్ధత లేకుండా ఖాతాలను నిలిపివేస్తే మనుషుల జీవితాలే తారుమారవుతాయని వ్యాఖ్యానించింది. ఖాతాల్లో కేవలం రూ.200 మేర తేడా ఉందన్న కారణంతో రూ.93 కోట్ల ఖాతాను పూర్తిగా స్తంభింపజేయడాన్ని తప్పుబట్టింది. ఈ కేసుకు సంబంధించి కీలక తీర్పును వెలువరించిన న్యాయమూర్తి జస్టిస్ మనోజ్ జైన్... "సరైన కారణాలు చూపకుండా, బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడమే పరిష్కారమార్గమని భావిస్తే.. అది సంబంధిత వ్యక్తుల ఆర్థిక స్థితిగతుల్లో ఉపద్రవం సృష్టిస్తుంది" అని హెచ్చరించారు.

అకౌంట్‌ను మొత్తంగా స్తంభింపజేయడానికి బదులు వివాదంలో ఉన్న మొత్తాన్ని డిపాజిట్ రూపంలో పక్కనపెడితే ఖాతాదార్లకు ఎటువంటి ఇబ్బంది ఉండదని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. అలాగే, కేసుతో సంబంధం ఉన్న వ్యక్తులకు కూడా తమ ఖాతాలో సొమ్ము భద్రంగా ఉందన్న నమ్మకం కలుగుతుందని పేర్కొన్నారు. ఇలాంటి తరహా కేసులు పెద్ద సంఖ్యలో వస్తున్నందున బ్యాంకు అకౌంట్ల ఫ్రీజ్‌పై ఒకే రకమైన విధానాన్ని రూపొందించాలని కేంద్ర హెూం శాఖను జస్టిస్ మనోజ్ జైన్ ఆదేశించారు. ఇందుకోసం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, ఇతర భాగస్వాములతో చర్చలు జరిపి... మార్గదర్శకాలు, ప్రామాణిక నిర్వహణ విధానాలను రూపొందించాలని ఆయన సూచించారు.

ప్రస్తుత కేసులో పిటిషనర్ ఎలాంటి సైబర్ కేసులో నిందితుడు లేదా అనుమానితుడు కాకపోయినా కానీ మొత్తం ఖాతాను స్తంభింపజేయడం సరైంది కాదని అన్నారు. నేరంతో ఎలాంటి సంబంధం లేకపోయినా, అనుకోకుండా లబ్ధి పొంది ఉండొచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఇటీవలి పవన్ కుమార్ రాయ్ %ఎం% యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో కేవలం రూ.105 కోసం ఖాతాను స్తంభింపజేశారని, వెంటనే దీనిని తొలగించాలని ఆదేశించింది. ఈ సందర్భంగా దర్యాప్తు సంస్థల తీరును కోర్టు విమర్శించింది, 'ఖాతాలను స్తంభింపజేయడానికి ఆదేశాలను జారీ చేసే అధికారం పోలీసులకు ఉన్నప్పటికీ, వారు వారి చర్యలకు ఆధారాలు చూపాలి.. కారణం లేకుండా ఖాతాలు ఫ్రీజ్ చేయడం ఖాతాదారుల ఆర్థిక స్థిరత్వంపై వినాశనం కలిగిస్తాయి... చిరు వ్యాపారి అయిన ఆయన జీవనోపాధిని ఇది దెబ్బతీస్తుంది' అని అన్నారు.

## బోర్డు పరీక్షల్లో విద్యార్థులకు టీచరమ్మ సాయం..

## ఏకంగా బోర్డు మీదే సమాధానాలు రాసి!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఏవైనా పరీక్షలు పెడుతున్నప్పుడు కొందరు టీచర్లు చాలా కఠినంగా వ్యవహరిస్తూ.. ఏమాత్రం కాపీయింగ్ జరగకుండా చూస్తారు. ఒకరి దాంట్లో మరొకరు చూసి రాసినా, చీటీలు పెట్టినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. మరికొందరు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తూ వదిలేస్తుంటారు. కానీ మనం ఇప్పుడు చూడబోయే ఈ టీచరమ్మ మాత్రం.. పిల్లలు పదే పదే అడుగుతున్నారని బోర్డు పరీక్షల్లోనే సాయం చేసింది. నేరుగా బోర్డు మీదే సమాధానాలు రాస్తూ పిల్లలందరినీ రాసుకోమని చెప్పింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుండగా అంతా షాక్ అవుతున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.

మధ్య ప్రదేశ్‌లోని బేతుల్ జిల్లాలో 5వ తరగతి బోర్డు పరీక్షలు నిర్వహించారు. ఫిబ్రవరి 25వ తేదీన గణితం పరీక్ష ఉండగా.. ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న సంగీతా విశ్వకర్మ అనే టీచర్ ఇన్విజిలేటర్‌గా వెళ్లింది. అయితే ఆ సమయంలో తరగతి గదిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు ప్రశ్నాపత్రం చూడగానే బిత్తర పోయారు. తమకు సమాధానాలు తెలియవంటూ.. పదే పదే టీచర్‌ను సాయం చేయమని కోరారు. చాలా సేపు అది తప్పని చెప్పినా విద్యార్థులు బతిమాలడం చూసి సాయం చేసేందుకు సిద్ధమైంది.ముఖ్యంగా ప్రశ్నాపత్రాన్ని తీసుకుని బోర్డు వద్దకు వెళ్లి స్వయంగా ఆమే సమాధానాలు రాసింది. వాటిని పిల్లలు అందరూ ఎక్కించుకోవాలని చెప్పగా.. విద్యార్థులంతా చకచకా రాసేసుకున్నారు. అయితే ఈ విషయం గుర్తించిన వారు ఎవరో.. కిటికీలోంచి దీన్ని వీడియోగా తీశారు. ఆపై సెల్‌ఫోన్ ద్వారానే అందరికీ పంపారు. ఇలా ఈ వీడియో కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. ఆనోటా ఈనోటా పాకి బేతుల్ జిల్లా కలెక్టర్ నరేంద్ర కుమార్ సూర్యవంశీ వద్దకు వెళ్లగా.. ఉపాధ్యాయురాలు సంగీతా విశ్వకర్మను విధుల నుంచి బహిష్కరించారు.

అయితే ప్రస్తుతం ఈ ఘటనపై విచారణ జరుపుతున్నామని.. ఆమె తప్పు చేసినట్లు రుజువు అయితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నరేంద్ర కుమార్ సూర్యవంశీ పేర్కొన్నారు. ఈ కేసులో పరీక్షా కేంద్రం ఇంఛార్జీ, ఇతర అధికారులపై కూడా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మరోవైపు ఈ విషయం బయటకు రావడంతో విద్యాశాఖ కూడా ఉపాధ్యాయులు అందరికీ హెచ్చరికలు జారీ చేసింది. పరీక్షల సమయంలో మాయి కాపీయింగ్‌కు సాయం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అన్నీ తీసుకుంటామని వివరించింది.

## ఆయుధాల అప్పగింతకు ఇదే చివరి అవకాశం.. గడువు పొడిగించిన మణిపూర్ గవర్నర్



**ఇంఫాల్-నవభూమి:** మణిపూర్ ప్రజలు ఆయుధాలను అప్పగించేందుకు ఆ రాష్ట్ర గవర్నర్ అజయ్ కుమార్ భల్లా చివరి అవకాశం ఇచ్చారు. ప్రజలు స్వచ్ఛందంగా ఆయుధాలు అప్పగిస్తుండటంతో గడువును పొడిగించారు. ఫిబ్రవరి 20 నుంచి అమలులోకి వచ్చిన వారం రోజుల గడువు గురువారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ఈ గడువును మార్చి 6 సాయంత్రం 4 గంటల వరకు గవర్నర్ పొడిగించారు. కొండ, లోయ ప్రాంతాల ప్రజలు అదనపు సమయం కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. 'స్వచ్ఛందంగా ఆయుధాలను అప్పగించడానికి ఏడు రోజుల గడువు ముగిసింది. ఈ వ్యవధిని పొడిగించాలని లోయ, కొండ ప్రాంతాల ప్రజల నుంచి అభ్యర్థనలు వచ్చాయి. ఈ అభ్యర్థనలను నేను పరిగణనలోకి తీసుకున్నా. మార్చి 6 సాయంత్రం 4 గంటల వరకు గడువును పొడిగించాలని నిర్ణయించుకున్నా' అని అందులో పేర్కొన్నారు.కాగా, పొడిగించిన గడువులోగా భద్రతా దళాల నుంచి దోచుకున్న, చట్టవ్యతిరేకంగా కలిగి ఉన్న ఆయుధాలను అప్పగించే వారిపై ఎలాంటి శిక్షార్హమైన చర్యలు తీసుకోబోమని గవర్నర్ అజయ్ కుమార్ భల్లా మరోసారి భరోసా ఇచ్చారు. 'శాంతి, మత సామరస్యం, మన యువత భవిష్యత్తు, మన సమాజ భద్రతకు దోహదపడటానికి సంబంధిత ప్రతి ఒక్కరికీ ఇదే చివరి అవకాశం' అని తాజా ప్రకటనలో స్పష్టం చేశారు.మరోవైపు 2023 మే నుంచి మణిపూర్‌లోని మైతీ, కుకీ జాతుల మధ్య ఏడాదిన్నర కాలం పైగా ఘర్షణలు కొనసాగాయి. హింసాత్మక సంఘటనల్లో 250 మందికి పైగా మరణించగా వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఫిబ్రవరి తొలి వారంలో సీఎం ఎన్ బీరేన్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను కేంద్రం విధించింది.

## ఎత్తైన టవర్‌లోని 42వ అంతస్తులో భారీ అగ్నిప్రమాదం



**ముంబై-నవభూమి:** ఎత్తైన టవర్‌లోని 42వ అంతస్తులో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో అగ్నిమాపక బృందాలు వెంటనే అక్కడకు చేరుకున్నాయి. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ముందు జాగ్రత్తగా ఆ అంతస్తులోని నివాసితులను ఖాళీ చేయించారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం ఉదయం 10.45 గంటల సమయంలో బైకుల్లా ప్రాంతంలోని 57 అంతస్తుల టవర్ సాల్సెట్ 27లోని 42వ అంతస్తులో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఆ ఫ్లోర్‌లో చెలరేగిన మంటలు చాలా దూరం వరకు కనిపించాయి.కాగా, ఈ సమాచారం తెలిసిన వెంటనే ఫైర్ బృందాలు, పోలీసులు, స్థానిక అధికారులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. లెవల్ 1 అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఐదు అగ్నిమాపక యంత్రాలు, మూడు జంబో ట్యాంకర్లు, అధునాతన నీటి టెండర్, హైడ్రాలిక్ ప్లాట్‌ఫామ్, ఎత్తైన అగ్నిమాపక వాహనం వంటి అధునాతన పరికరాలు, సాంకేతికతను వినియోగిం చారు. మరోవైపు ముందు జాగ్రత్త చర్యగా రెండు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. మంటలు వ్యాపించిన 42వ అంతస్తులోని నివాసితులను ఖాళీ చేయించారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదని అధికారులు తెలిపారు. అగ్నిప్రమాదానికి దారి తీసిన కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా, ఎత్తైన టవర్‌లో అగ్ని ప్రమాదానికి సంబంధించిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## జాలర్ల బోటుకు అగ్నిప్రమాదం.. ప్రాణాలతో బయటపడ్డ 20 మంది



**ముంబై-నవభూమి:** మహారాష్ట్రలోని అలీబాగ్ వద్ద సముద్రంలో మత్స్యకారుల బోటు అగ్ని ప్రమాదానికి గురైంది. శుక్రవారం తెల్లవారు జామున 3 నుంచి 4 గంటల మధ్య ఈ ప్రమాదం జరిగింది. 80 శాతం బోటు ఆ ప్రమాదంలో కాలిపోయింది. అయితే బోటులో ఉన్న జాలర్లు సురక్షితంగా ఉన్నారు. ఎవరికీ గాయాలు కాలేదు. అందర్నీ రక్షించినట్లు అధికారులు చెప్పారు. అగ్ని ప్రమాదానికి గురైన బోటు నుంచి భారీగా పొగ, మంటలు వ్యాపించాయి. దేని వల్ల ప్రమాదం జరిగిందో ఇంకా స్పష్టంగా తెలియదు. బహుశా షార్ట్‌సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. బోటులో ఉన్న చేపల వల వల్ల .. వేగంగా మంటలు వ్యాపించినట్లు భావిస్తున్నారు. మండుతున్న బోటును గుర్తించిన స్థానిక జాలర్లు.. అధికారుల్ని అప్రమత్తం చేశారు. అయితే వెంటనే ఆ బోటును తీరానికి తీసుకువచ్చి మంటల్ని ఆర్పారు. సకారాక్షి గ్రామానికి చెందిన రాకేశ్ మూర్తికి ఆ బోటు చెందినట్లు పోలీసులు వెల్లడించారు.

## ఇంటర్‌నేషనల్ రేంజ్‌కి అల్లు అర్జున్.. బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో పుష్ప 2 పాటకు డ్యాన్స్





ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం పుష్ప 2 ది రూల్. రేంజ్ ఇంటర్‌నేషనల్ వరకు వెళ్లింది. తాజాగా ఈ సినిమాలోని వచ్చుండాయి ఫీలింగ్స్ పాటకు నేషనల్ బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో డ్యాన్స్ చేశారు. నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అనేది నార్త్ అమెరికాలో ఉన్న ప్రొఫెషనల్ బాస్కెట్‌బాల్ లీగ్. ఇందులో 30 జట్లు ఉంటాయి. ప్రపంచంలోని ప్రధాన ప్రొఫెషనల్ బాస్కెట్‌బాల్ లీగ్‌లలో నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కూడా ఒకటి. ప్రస్తుతం ఈ టోర్నీకి సంబంధించి ఒక మ్యాచ్‌కి ముందు చీర్ గర్ల్స్ పుష్ప-2లోని వచ్చుండాయి ఫీలింగ్స్ పాటకు డ్యాన్స్ చేశారు. కాగా ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఇక ఈ వీడియో చూసిన అల్లు అర్జున్ అభిమానులు అల్లు అర్జున్ నేషనల్ కాకుండా ఇంటర్‌నేషనల్ వరకు వెళ్లిందని కామెంట్లు పెడుతున్నారు.




# వామిక ఫోటోతో రష్మిక క్షమాపణలు!





నేషనల్ క్రష్ రష్మిక మందన్న పలు బ్రాండ్స్‌కి అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న విషయం తెల్సిందే. ఆమె బ్రాండింగ్ చేస్తున్న కంపెనీల్లో ఒనిట్సుకా టైగర్ బ్రాండ్ ఒకటి. చాలా కాలంగా రష్మిక ఈ బ్రాండ్‌కి అంబాసిడర్‌గా వ్యవహరిస్తుంది. ప్రతి సంవత్సరం రష్మికతో ఫోటో షూట్ చేసి సదరు సంస్థ తమ ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేస్తూ ఉంటుంది. కానీ ఈసారి వామిక గబ్బి ఫోటోలతో ఒనిట్సుకా టైగర్ సంస్థ తమ ఉత్పత్తులను ప్రమోట్ చేసింది. పలువురు రష్మిక ఈ సంస్థ నుంచి తప్పుకుందా అంటూ కామెంట్స్ చేస్తూ ఉంటే, కొందరు రష్మిక పారితోషికం ఎక్కువ డిమాండ్ చేయడం వల్ల ఆమెను తప్పించారని అంటున్నారు. అసలు విషయం ఏంటంటే రష్మిక గత కొన్ని వారాలుగా కాలి గాయం కారణంగా తీవ్రంగా ఇబ్బంది పడుతుంది. అందుకే ఆమె ఒనిట్సుకా టైగర్ సంస్థకు ఈ సారి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించలేనని, అంతే కాకుండా ఫోటో షూట్స్‌కి హాజరు కాలేను అని చెప్పుకొచ్చిందట. దాంతో ఆమె స్థానంలో వామిక గబ్బిని ఎంపిక చేయడం జరిగింది. తాజాగా ఒనిట్సుకా టైగర్ కొత్త బ్రాండ్ అంబాసిడర్ వామిక ఫోటోలను రష్మిక ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసింది. ఈసారి సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనందుకు క్షమాపణలు చెబుతున్నాను అంటూ వామికా ఫోటోకు, ఆమె ధరించిన ఔట్ ఫిట్‌పై ప్రశంసలు కురిపించింది. రష్మిక మందన్న కాలి గాయం కారణంగా చాలా కార్యక్రమాలకు హాజరు కాలేక పోతుంది. ఇటీవల జరిగిన ఒక ఫారిన్ ఈవెంట్‌లోనూ రష్మిక హాజరు కాలేదు. మరో నెల రోజుల పాటు ఆమె పూర్తి విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు తెలియజేసినట్లు సమాచారం అందుతోంది. కాలి గాయం, నొప్పితోనే ఛావా సినిమా ప్రమోషన్‌లో రష్మిక మందన్న పాల్గొన్నది. ఛావా సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. యానిమల్, పుష్ప 2 సినిమాల తర్వాత ఇప్పుడు ఛావా సినిమా ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేస్తుంది. కనుక రష్మిక నేషనల్ క్రష్ మాత్రమే కాకుండా నేషనల్ స్టార్ హీరోయిన్ అంటూ ఫ్యాన్స్ తెగ సందడి చేస్తున్నారు! మరో వైపు ఈ అమ్మడి సినిమాల జాబితా చూస్తే పెద్దగానే ఉంది. ముందుగా రష్మిక మరో బాలీవుడ్ మూవీ సికిందర్ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సల్మాన్ ఖాన్ హీరోగా మురగదాస్ దర్శకత్వంలో రూపొందిన సికందర్ సినిమా టీజర్ ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చింది. టీజర్‌లో రష్మిక మందన్న లుక్‌కి మంచి స్పందన వచ్చింది. కనుక మరోసారి రష్మిక సికిందర్‌తో తన సక్సెస్ జర్నీ కంటిన్యూ చేసే అవకాశాలు ఉన్నాయి. మరో వైపు గర్ల్ ఫ్రెండ్ సినిమాలోనూ ఈ అమ్మడు నటిస్తుంది. ఇక ధనుష్ తో కలిసి నటించిన కుబేరా సినిమా జూన్ లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. విజయ్ దేవరకొండతో కలిసి కింగ్డమ్ లోనూ కీలక పాత్రలో రష్మిక మందన్న నటించింది అనే వార్తలు వస్తున్నాయి. మొత్తానికి రష్మిక చాలా చాలా బిజీగా ఉంది.

# వీరమల్లు ఏదోటి తేల్చేస్తే బెటర్!




చూస్తుండగానే ఫిబ్రవరి నెల కూడా పూర్తైపోయింది. రేపటి నుంచి మార్చిలోకి వెళ్తున్నాం. అంటే హరిహర వీరమల్లు రిలీజ్ కు మరో 28 రోజులు మాత్రమే టైముంది. చూస్తుండగానే ఫిబ్రవరి నెల కూడా పూర్తైపోయింది. రేపటి నుంచి మార్చిలోకి వెళ్తున్నాం. అంటే హరిహర వీరమల్లు రిలీజ్ కు మరో 28 రోజులు మాత్రమే టైముంది. వీరమల్లును ఎలాగైనా ఈ డేట్ కే తీసుకొస్తామని చెప్పిన తర్వాత దర్శకనిర్మాతలు నుంచి మరో అప్డేట్ వచ్చింది లేదు. కానీ వీరమల్లు కు ఇంకా కొంత షూటింగ్ బ్యాలెన్స్ ఉన్నట్టు తెలుస్తోంది. పవన్ నాలుగైదు డేట్స్ అడ్జస్ట్ చేస్తే షూటింగ్ అయిపోతుందంటున్నారు కానీ ప్రస్తుతం ఆయన ఆరోగ్యం, రాజకీయ పరిణామాల దృష్ట్యా అది కుదిరేలా కనిపించడం లేదు కాబట్టి వీరమల్లు వాయిదా తప్పేలా లేదు. పవన్ రాడనే ఉద్దేశంతోనే మార్చి 28న రాబిన్‌హుడ్, 29న మ్యాడ్ స్క్వేర్ సినిమాలు వస్తున్నాయి. వీరమల్లు పోస్ట్ పోన్ ఖాయమని డిసైడయ్యే తమ సినిమాలకు సంబంధించిన ప్రమోషన్స్‌ను స్పీడప్ చేయనున్నాయి ఆ రెండు సినిమాలు. వీరమల్లు మార్చి 28 నుంచి వాయిదా పడితే ఏప్రిల్ 11 లేదా ఏప్రిల్ 18లో రిలీజ్ చేయాలని మేకర్స్ చూస్తున్నారట. కానీ అనుష్క ఘాటీ ఏప్రిల్ 18న రిలీజ్ కానున్నట్టు ఇప్పటికే అనౌన్స్ చేశారు. ఘాటీ పోస్ట్ పోన్ అయితే వీరమల్లుకు ఆ డేట్స్ అనుకూలంగానే ఉంటాయి. కానీ ఇప్పటివరకు ఘాటీ వాయిదా గురించి ఎలాంటి వార్తలు రాలేదు. చెప్పిన టైమ్ కే సినిమాను రిలీజ్ చేయాలని ఘాటీ టీమ్ భావిస్తోంది. ఒకవేళ ఏప్రిల్ 11నే రావాలనుకుంటే మార్చి 27కు దానికి మధ్య ఉన్నది రెండు వారాల గ్యాపే. ఈ రెండు వారాల్లో వీరమల్లును పూర్తి చేయగలరా అనేది మరో డౌట్. దానికి తోడు ఇప్పటివరకు వీరమల్లు నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ ఏదీ ఆడియన్స్ ను విపరీతంగా ఆకట్టుకోలేదు. కాబట్టి వీరమల్లు నిర్మాత ఈ విషయంలో ఏదొక క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇవన్నీ కాదు చెప్పిన ప్రకారం మార్చిలోనే సినిమాను రిలీజ్ చేస్తామంటే ఇప్పటికిప్పుడే ప్రమోషన్స్ వేగాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పవన్ కళ్యాణ్ కు ఎంత క్రేజ్ ఉన్నా రూరల్ ఆడియన్స్ థియేటర్లకు రావాలంటే ప్రమోషన్స్ కీలకం. కాబట్టి ప్రమోషన్స్ బాగా జరగాలి. అప్పుడే సినిమా ఆడియన్స్‌కు రీచ్ అవుతుంది. ఏదైనా వీరమల్లు రిలీజ్ డేట్ విషయంలో నిర్మాతలు ఓ క్లారిటీ ఇస్తే అందరికీ బావుంటుంది. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో బాబీ డియోల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు.

# డీ గ్లామర్ బ్యూటీగా బుట్టబొమ్మ!



ఇప్పటి వరకూ పూజా హెగ్డే వెండి తెరపై అందమైన బ్యూటీగానే హైలైట్ అయింది. ప్రియురాలు, ప్రేమికురాలి పాత్రల్లో తెరపై ఎంతో అందంగా కనిపించింది. తొలి సినిమా ఒక లైలా కోసం నుంచి ఆచార్య వరకూ డీసెంట్ బ్యూటీగా హైలైట్ అయింది. దీంతో డీ గ్లామర్ పాత్రలకు దూరమవ్వాల్సి వచ్చింది. కథను బట్టి రకరకాల పాత్రలు పోషించింది గానీ డీగ్లామర్ పాత్రల్లో నటించే ఛాన్స్ రాలేదు. అయితే తొలిసారి డీగ్లామర్ పాత్రకు సై అనేసింది. ఫంకీ సెట్స్‌లో జాయిన్ అయిన కాయదు రాఘవ లారెన్స్ స్వీయా దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న కాంచన 4లో పూజాహెగ్డే ఎంపికైన సంగతి తెలిసిందే. అయితే ఇందులో ఆమె పాత్ర ఎలాంటిది అన్నది ఇంత వరకూ క్లారిటీ రాలేదు. ఈ నేపథ్యంలో పూజా హెగ్డే డీగ్లామర్ పాత్రలో కనిపించనుందని సమాచారం. అమ్మడు సినిమాలో ఎక్కడా మ్యాకప్ లేకుండానే కనిపిస్తుందట. బాగా వెనుకబడిన పల్లెటూరి అమ్మాయి పాత్రలో మాస్ కోణంలో పూజా హెగ్డే రోల్ ఉంటుందట. గంగ చిత్రంలో నిత్యామీనన్ కంటే మరింత డీగ్లామర్ గా పూజాహెగ్డే పాత్ర ఉంటుందని అంటున్నారు. ఇందులో ఆమె బధిర యువతి పాత్ర పోషిస్తుందట. కథని మలుపు తిప్పే పాత్ర ఇదేనని సమాచారం. బలమైన పాత్రలో పూజా హెగ్డే ఆహార్యం సహా నటన సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. డీగ్లామర్ పాత్రల్లో పూజా హెగ్డే ఇంతవరకూ ఏ సినిమాలో నటించలేదు. అలాంటి ఆహార్యానికి కూడా ఎక్కడా ఛాన్స్ తీసుకోలేదు. ఆన్ ది స్క్రీన్ ఆఫ్ ది స్క్రీన్ లో ఎప్పుడూ మోడ్రన్ గానే కనిపించింది. అలాంటి నటి తొలిసారి డీగ్లామర్ పాత్ర పోషించడం అంటే ఓరకంగా ఇది అమ్మడికిది పెద్ద సవాల్ అనే చెప్పాలి. ప్రస్తుతం ఈ సినిమా సెట్స్ లో ఉంది. ఇందులో నోరా పటేహీ కూడా కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఆమె పాత్ర కూడా బలంగా ఉంటుందని సమాచారం.

## ఖాన్‌తో గేమ్స్ ఆడొద్దు శాల్తీ లేచిపోతుంది..

# నిట్లో సందడి చేసిన బ్రహ్మానందం




**హనుమకొండ-నవభూమి:** ఖాన్‌తో గేమ్స్ ఆడొద్దు శాల్తీ లేచిపోతుంది.. అంటూ హాస్యనటుడు డాక్టర్ కె.బ్రహ్మానందం విద్యార్థులను ఉత్సాహపరిచారు. వరంగల్ నిట్లో స్ప్రింగ్ స్ప్రి 2025 ప్రారంభించి మాట్లాడారు. చాలా పేదరికం నుంచి ఎన్నో అడ్డంకులు, అవహేళనలు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి, డా. బీఆర్ అంబేద్కర్, అబ్దుల్ కలాం ఎంతో కష్టపడి చదివారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. లెక్చరర్ గా చేసినప్పటికీ నాకంటూ గుర్తింపు తెచ్చుకోవాలని ఆలోచించగా సినిమాల్లో నటించే అవకాశం రాగా ఒక్కో అడుగు వేస్తూ ఒడిసి పట్టుకున్నానని తెలిపారు. నీ దగ్గర డబ్బు ఉంటేనే నీకు గౌరవం ఇస్తారు. కృషి, పట్టుదల సాధించాలనే తపన ఉంటే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లైఫ్ ఈజ్ ఏ గేమ్.. వి షుడ్ హేవ్ టు ప్లే అంటూ విద్యార్థులను ఉత్సాహపరిచారు. 40 ఏళ్ల సినీ పరిశ్రమలో 1200 పైగా చిత్రాల్లో నటిం చాను. ప్రపంచంలోనే అత్యధికంగా సినిమాలు తీసిన వ్యక్తి గా నిలిచిపోయానని పేర్కొన్నారు. పద్మశ్రీ అవార్డు, డాక్టరేట్, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకున్నాను. అందరూ బ్రహ్మ 'ఆనందంగా'ఉండాలి, మంచి ఆరోగ్యంతో మంచి ఆలోచనలు వస్తాయని విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపారు.

# సెమీస్‌కు వెళ్లేదెవరో?





**లాహోర్-నవభూమి:** నాలుగు రోజుల క్రితం రావల్పిండిలో కురిసిన వర్షం కారణంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మ్యాచ్ రద్దవడంతో సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకున్న అఫ్గానిస్థాన్.. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటుందా? లేదా? అన్నది శుక్రవారం తేలనుంది. లీగ్ దశలో ఇంగ్లండ్‌తో జరిగిన హోరాహోరి పోరులో బట్లర్ సేనకు షాకిచ్చి ఆ జట్టును ఇంటికి పంపిన అఫ్గాన్.. నేడు ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా సెమీస్ బెర్తును ఖాయం చేసుకునే అవకాశమున్న నేపథ్యంలో మ్యాచ్ రసవత్తరంగా సాగడం ఖాయం. 2023 వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాను ఓడించినంత పనిచేసిన అఫ్గాన్.. మ్యాక్స్‌వెల్ పోరాటంతో తలవంచక తప్పలేదు. కానీ స్పిన్‌కు అనుకూలిస్తున్న పాక్ పిచ్‌లపై జట్టునిండా స్పిన్నర్లు కలిగిన అఫ్గాన్.. కంగారూలను కంగారెత్తించి నాటి పరాభవానికి బదులు తీర్చుకోవడమే గాక 2024 టీ20 ప్రపంచకప్ తర్వాత వరుసగా రెండోసారి ఐసీసీ టోర్నీ సెమీస్ చేరుకోవాలనే పట్టుదలతో ఉంది. స్టార్క్, కమిన్స్, హెజిల్‌వుడ్ లేని ఆసీస్ బౌలింగ్ విభాగం బలహీనంగా ఉంది. తొలి మ్యాచ్‌లో ఆ జట్టు బౌలర్లు ఇంగ్లండ్‌కు 350కు పైగా పరుగులు సమర్పించుకున్నారు. జద్రాన్, గుర్బాజ్, కెప్టెన్ హష్మతుల్లాతో పాటు ఆల్‌రౌండర్లు గుల్బాదిన్, అజ్మతుల్లా, మహ్మద్ నబీ, రషీద్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే కంగారూలకు కంగారు తప్పకపోవచ్చు. ఇక బౌలింగ్‌లో బలహీనంగా ఉన్నప్పటికీ ఆస్ట్రేలియా బ్యాటింగ్‌లో పటిష్ఠంగా కనిపిస్తోంది. హెడ్, షార్ట్, స్మిత్, లబూషేన్, ఇంగ్లిస్, క్యారీ, మ్యాక్స్‌వెల్ వంటి ప్రపంచ స్థాయి బ్యాటర్లు ఆ జట్టు సొంతం. లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి మ్యాచ్ మొదలవుతుంది.

# సెప్టెంబర్‌లో ఆసియా కప్?




**న్యూఢిల్లీ-నవభూమి:** వచ్చే ఏడాది భారత్, శ్రీలంకలో జరుగబోయే టీ20 ప్రపంచకప్‌నకు ముందు సన్నాహకంగా జరుగబోయే ఆసియా కప్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో మొదలుకానుంది. ఈ మేరకు ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ప్రతినిధి ఒకరు స్పందిస్తూ.. 'ఈ టోర్నీ సెప్టెంబర్‌లో జరుగుతుంది. భారత్ వద్ద ఆతిథ్య హక్కులున్నప్పటికీ యూఏఈ లేదా శ్రీలంకలో టోర్నీ జరిగే అవకాశముంది' అని తెలిపాడు.

# పాక్ పరువు వర్షార్పణం



**రావల్పిండి-నవభూమి:** మూడు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత ఐసీసీ టోర్నీ ఆతిథ్య హక్కులను దక్కించుకున్న పాకిస్థాన్.. ఒక్కటంటే ఒక్క మ్యాచ్ కూడా గెలవకుండా ఈ టోర్నీని ముగించింది. లీగ్ దశలో ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ ఓడి ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించిన పాకిస్థాన్.. సొంత అభిమానుల ఎదుట కనీసం పరువు నిలుపుకునేందుకైనా ఆడాలని ఆశపడ్డ మ్యాచ్‌పై వరుణుడు నీళ్లు చల్లాడు. రావల్పిండి వేదికగా బంగ్లాదేశ్‌తో గురువారం జరగాల్సిన మ్యాచ్‌లో టాస్ కూడా పడకుండా రద్దయింది. దీంతో ఇరుజట్లకూ తలా ఓ పాయింట్ దక్కినా గ్రూప్-ఏలో పాకిస్థాన్.. నాలుగో స్థానంలో అట్టడుగు స్థానంలో నిలవడం గమనార్హం. బంగ్లాదేశ్ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ గ్రూప్ నుంచి భారత్, న్యూజిలాండ్ ఇదివరకే సెమీస్ బెర్తును ఖాయం చేసుకున్నాయి.

రిజ్వాన్ సేన చెత్త రికార్డు: ఈ టోర్నీలో దారుణ వైఫల్యంతో పాకిస్థాన్ ఓ చెత్త రికార్డును మూటగట్టుకుంది. 23 ఏండ్ల ఈ టోర్నీ చరిత్రలో ఆతిథ్య జట్టు కనీసం ఒక్క మ్యాచ్ కూడా గెలవకుండా నిష్క్రమించడం ఇదే ప్రథమం. 1998లో మొదలై బంగ్లాదేశ్ ఆతిథ్యమిచ్చిన ఈ టోర్నీ (అప్పుడు బంగ్లాదేశ్ ఆడలేదు).. 2000లో నైరోబిలో జరిగింది. రెండో ఎడిషన్‌లో కెన్యా ప్రీక్వార్టర్ ఫైనల్ చేరింది. 2002 నుంచి ఈ టోర్నీ ఆతిథ్యమిస్తున్న జట్లు గ్రూప్ దశలో కనీసం ఒక్క మ్యాచ్ అయినా గెలిచాయి. 2006లో భారత్, 2009లో సౌతాఫ్రికాలో నిర్వహించిన ఈ టోర్నీలో ఆ జట్లు పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచినా ఒక్క మ్యాచ్‌ను గెలుచుకున్నాయి.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**